జూన్
2019

158

సంపుటి : 14 సంచిక : 2

వెల రు. 10 /-

## ఈ సంచికలో........

ఎన్నికల క్యాం'పే'యిన్
భారత కార్మికోద్యమ 'పోరాటాల శతాబ్ది...!'
మానవ ఆవిర్భావానికి ముందు పరిణామాలు
కులంతో అభివృద్ధి సాధ్యమేనా?
పరిణామక్రమంలో భూసంబంధాలు
మార్క్సిజం జాతీయవాదం అస్తిత్వ రాజకీయాలు
కమ్యూనిజాన్నా.. నిషేధించాల్సింది...?
పాత్రికేయునిగా ఏంగెల్స్
సిరియాను ధ్వంసం చేసిన అమెరికా
కష్టజీవులు, అశృుస్యుల హక్కులకోసం ప్రాణాలొడ్డిన కా॥ అమ్మయ్య

స్ఫూర్తి

# కష్టజీవులు, అశ్పృస్యుల హక్కులకోసం ప్రాణాలొడ్డిన

# కా॥ అమ్మయ్య

విద్యార్థి జీవితంలో నేర్చుకున్న ఉద్యమ పాఠాలు ఆ యువకుడిని పోరుబాట పట్టించాయి. కుల వివక్ష పోవాలనీ, పాలేర్ల సమస్యలు పరిష్కారం కావాలనీ పోరాటాలు నిర్వహించారు. భూస్వాములు వ్యతిరేకించినా పల్లెలో సహపంక్తి భోజనాలు చేయడం ద్వారా మానవులంతా ఒకటేనని చాటారు. గోరంట్ల వారిపాలెం దాడిలో పాలపర్రు నుండి పాల్గొన్న దళానికి నాయకత్వం వహించారు. నిర్బంధ కాలంలో అజ్ఞాతంలోకి వెళ్లారు. కాసుకూర్చున్న భూస్వాములు మలబారు పోలీసులను రెచ్చగొట్టారు. అజ్ఞాత జీవితంలో ఉన్న ఆ యువకుడిని పట్టుకొచ్చిన పోలీసులు పది రోజులు క్యాంప్‌లో పెట్టి దళ సభ్యుల పేర్లు చెప్పమని, చిత్రహింసలపాల్జేశారు. రక్తపు ముద్దలా పడిఉన్న ఆ యువకుడిని తుపాకీ తూటాలతో ఛిద్రంచేసి, పోలీసులు తమ కసాయితనాన్ని మరోసారి రుజువు చేసుకున్నారు. ఉద్యమకారులు కళ్లముందున్నా, ఉద్యమ అనుపానులు తెలిసినా పెదవి విప్పని ఆ కామ్రేడ్ ఉద్యమం కోసం మృత్యువును ఆనందంగా ఆలింగనం చేసుకున్నారు. ఆ యువకుడే కామ్రేడ్ బొండలపాటి అమ్మయ్య. ఈ దుర్ఘటన మే 12, 1950లో తెనాలి దగ్గర జరిగింది. ఉద్యమకారులను భయభ్రాంతుల్ని చేయడానికి కామ్రేడ్ అమ్మయ్యను గుర్రపు బండి చక్రాలకు కట్టిన ఫొటోను, తెనాలిలో కాల్చివేసినట్లు తీసిన ఫొటోను పోలీసులు విడుదల చేశారు.

కామ్రేడ్ అమ్మయ్య పెదనందిపాడు మండలం పాలపర్రులో మధ్యతరగతి రైతు కుటుంబంలో జన్మించారు. హనుమాయమ్మ, కోటయ్య వీరి తల్లిదండ్రులు. పాలపర్రులో హైస్కూలు లేనందున దాదాపు ఏడు కిలోమీటర్ల దూరంలో ఉన్న పెదనందిపాడుకు వచ్చి చదువుకోవాల్సి వచ్చేది. అప్పుడు పెదనందిపాడు పాఠశాలలో విద్యార్థి, యువజన సంఘం వారు నిర్వహిస్తున్న కార్యక్రమాల పట్ల ఆకర్షితులయ్యారు. తరువాత పార్టీలోకి వచ్చి, పార్టీ గ్రామకార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. కామ్రేడ్ తేళ్ల నారాయణ, కామ్రేడ్ గున్నాబత్తుల సూర్యనారాయణ, కామ్రేడ్ గోరంట్ల రామయ్యతో కలిసి కార్యక్రమాలు నిర్వహించేవారు. రైతు



బొండలపాటి అమ్మయ్య

బిడ్డ కావడం, వ్యవసాయంపై మక్కువ ఉండటంతో వ్యవసాయ పనుల్లో మంచి నిపుణుడిగా పేరు గడించారు. తిన్నగా కొండ్ర వేయటం, నాగలి దున్నటం, బండికి చెత్త నింపటం లాంటి వ్యవసాయ పనులలో జరిగే గ్రామ పోటీలలో ఎప్పుడూ ప్రథమ స్థానం కామ్రేడ్ అమ్మయ్యదే. రైతులు, యువకులు, పెద్దల అభిమానాన్ని చూరగొన్నారు. ప్రావీణ్యమున్న యువ రైతుగా అందరినీ ఆకర్షించారు.

వ్యవసాయ కార్మికులపై, పాలేర్ల సమస్యలపై పోరాటాలు నిర్వహించారు. యువజన సంఘ నిర్మాణంలోనూ, ప్రజానాట్యమండలి శాఖ ఏర్పాటు, విస్తరణలోనూ ప్రముఖపాత్ర పోషించారు. మహిళాసంఘం నిర్మాణంలోనూ కీలకపాత్ర వహించారు. మాభూమి నాటకంలో రైతు నాయకుని పాత్ర వేశారు. కొన్ని పౌరాణికాల్లోనూ నటించారు. కామ్రేడ్ పెద్ది వెంకటసుబ్బయ్య, కామ్రేడ్ తేళ్ల సత్యనారాయణతో కలిసి కులవివక్ష, సనాతన సాంప్రదాయాలకు వ్యతిరేకంగా పలు కార్యక్రమాలు నిర్వహించారు. బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా నిర్వహించిన ప్రదర్శనల్లో ప్రముఖపాత్ర వహించారు.

రాజకీయ చైతన్యం గల గ్రామంగా పాలపర్రులో స్వాతంత్ర్య పోరాటం, కమ్యూనిస్టు ఉద్యమం ఒకటిగా కలసిమెలసి సాగేవి. భూస్వాములు మినహా మిగతా ఊరంతా ఒక్కటై కమ్యూనిస్టు పార్టీ కార్యక్రమాలన్నిటిలోనూ పాల్గొనేవారు. కమ్యూనిస్టు కేంద్రాలుగా గుర్తించబడ్డ వేలూరు, నర్సాయపాలెం, జూపూడి తదితర గ్రామాలతో పోటీపడి దేశ స్వాతంత్ర్యం కోసం, పేద ప్రజల విముక్తి కోసం ఈ గ్రామంలో కృషి జరుగుతూ ఉండేది. 1946లో ఫిర్కా రైతు మహాసభ కామ్రేడ్ మాకినేని బసవపున్నయ్య, కామ్రేడ్ కొల్లా వెంకయ్యలతో గ్రామ సెంటర్‌లో జరుగనున్న విషయం తెలుసుకున్న భూస్వాములు బహిరంగ సభను ఎలాగైనా భగ్నం చేయాలని గూండాలను సమీకరించారు. కామ్రేడ్స్ నార్నె హనుమయ్య, ముద్దన చిన సుబ్బయ్య, జంపని వెంకట నారాయణ, అమ్మయ్య రక్షక దళంగా తయారై బాణా కర్రలతో కాపలా కాశారు. 'దమ్ముంటే సభ జరపండి మా దెబ్బ ఏమిటో చూపిస్తాం' అని భూస్వాములు రంకెలేశారు. అమ్మయ్య, మిగిలిన కామ్రేడ్స్ కర్రలు పట్టి 'దెబ్బకు ఒక బుర్ర పగులిద్ది, చచ్చేది ఎవడో తేల్చుకుందాం' అని హెచ్చరిస్తే, కమ్యూనిస్టులు నిజంగానే అన్నంత పనిచేస్తారని భూస్వాములు, వారి గుండాలు పలాయనం చిత్తగించారు.

కామ్రేడ్ అమ్మయ్య ఇల్లు పార్టీ కార్యకలాపాలకు కేంద్రంగా ఉండేది. 8 మంది సభ్యులున్న గ్రామ పార్టీ శాఖకు కామ్రేడ్ అమ్మయ్య కార్యదర్శిగా ఉండేవారు. పార్టీ పని విభజనలో కామ్రేడ్ అమ్మయ్యకు పల్లెలో నిర్మాణ బాధ్యతలను పార్టీ శాఖ అప్పగించింది. ఆ బాధ్యతను కామ్రేడ్ అమ్మయ్య ఎంతో ప్రతిభావంతంగా నిర్వహించారు. కమ్యూనిస్టు పార్టీ గ్రామంలో ఏర్పడకముందు, 1940 ప్రాంతంలో అంటరానితనం గ్రామంలో ఎక్కువగా ఉండేది. పల్లెలోని వారిని ఇళ్ళల్లోకి రానిచ్చేవారు కాదు. ఎండకు కాళ్ళు మాడకుండా తేళ్ళు, జెర్రులు కుట్టకుండా వారు కుట్టి ఇచ్చిన చెప్పులనైతే తొడుక్కునేవారు కానీ, వారు వీరి ఇళ్ళల్లోకి రావాలంటే మాత్రం చెప్పులు బజారులోనే విడిచి ఇంటి మెల్లల్లోకి రావలసి వచ్చేది. గ్రామంలోని అగ్రవర్ణస్తులు చూడకుండా చుట్టలు, బీడీలు రహస్యంగా కాల్చవలసి వచ్చేది. పెళ్ళిళ్ళకు, దినాలకు ప్రత్యేక బంతులు ఉండేవి. చెరువులో "మాల రేవు" వేరే ఉండేది. మనుషులంతా సమానమని నమ్మిన కమ్యూనిస్టు యువకులు రాజకీయ చైతన్యంతో కుల వివక్షతను ఎదుర్కొన్నారు. అందులో కామ్రేడ్

(మిగతా 35వ పేజీలో)

## ఈ సంచికలో...

1. కష్టజీవులు, అశ్పృస్యుల హక్కులకోసం ప్రాణాలొడ్డిన కా॥ అమ్మయ్య ........ 2
1. ఎన్నికల క్యాం'పే'యిన్
ఆర్. అరుణ్‌కుమార్ ......... 4
2. భారత కార్మికోద్యమ 'పోరాటాల శతాబ్ది...!'
జెఎస్ మజుందార్ .......... 6
3. మానవ ఆవిర్భావానికి ముందు పరిణామాలు
ఎంవిఎస్ శర్మ ..................... 11
4. కులంతో అభివృద్ధి సాధ్యమేనా?
ఎ కోటిరెడ్డి ....................... 13
5. పరిణామక్రమంలో భూసంబంధాలు
సి సాంబిరెడ్డి ..................... 17
6. మార్క్సిజం జాతీయవాదం అస్తిత్వ రాజకీయాలు
అర్చనా ప్రసాద్ .................... 22
8. కమ్యూనిజాన్నా.. నిషేధించాల్సింది...?
టిఎన్‌వి రమణ .................... 28
9. పాత్రికేయునిగా ఏంగెల్స్
ఎం శివరామకృష్ణన్ .............. 31
10. సిరియాను ధ్వంసం చేసిన అమెరికా
విజయప్రసాద్..................... 33

సంపాదకుడు:
**ఎస్. వెంకట్రావు**

సంపాదక వర్గం:
**పాటూరు రామయ్య**
**బి.వి. రాఘవులు**
**తమ్మినేని వీరభద్రం**
**ఎస్. వీరయ్య**
**తెలకపల్లి రవి**

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరపున
ప్రచురణ కర్త, ముద్రాపకుడు:బి.వి.రాఘవులు
సంపాదకుడు : ఎస్. వెంకట్రావు
ముద్రణ: ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్, 14-12-19, కృష్ణనగర్, తాడేపల్లి(మ), గుంటూరు(జి)
ఫోన్: ఎడిటర్ : 9490099333
మేనేజర్ :కె.హరికిషోర్: 9490098977, 9494101091
email:venkataraosankarapu@gmail.com
email:marxistap@gmail.com
visit cpi(m) site at : cpim.org

# ప్రమాద ఘంటికలు

**2019** సాధారణ ఎన్నికలు దేశ వ్యాపితంగా ప్రమాద ఘంటికలు మోగించాయి. 2014 ఎన్నికల్లో మెజారిటీ స్థానాలు సంపాదించుకున్న పచ్చి మితవాద, సామ్రాజ్యవాద అనుకూల, మతతత్వ పార్టీ అయిన బిజెపి గెలుపొందడం ఒక ఎత్తయితే అయిదేళ్ల ప్రజావ్యతిరేక పరిపాలన తరువాత కూడా ఆ పార్టీ, దాని నాయకత్వంలోని కూటమి మరింత మెజారిటీతో గెలుపొందడం పురోగామి శక్తులకు ఆందోళన కలిగించే విషయం.

అయిదేళ్ల పాలనలో రైతులు, కార్మికులు, సామాన్య ప్రజలు వ్యతిరేక విధానాలు అవలంభించినా ప్రజలు ఆ కూటమికి ఎందుకు ఓట్లు వేశారు అనే అంశంపై కూలంకషమైన సమీక్ష జరగాల్సి ఉంది. అయితే మొత్తం ఎన్నికల ప్రచారాన్ని గమనించినప్పుడు దేశంలోని కార్పొరేట్ మీడియా పాలక పక్షంతో కుమ్మక్కయి ప్రజలెదుర్కొంటున్న ప్రధాన సమస్యలు ముందుకు రాకుండా చేశాయన్న విషయం చాలా స్పష్టంగా కనిపించింది. అయిదేళ్లలో నరేంద్ర మోడీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం అనుసరించిన విధానాల వల్ల రైతాంగం సంక్షోభంలో కూరుకుపోయింది. కార్మికవర్గంపై దోపిడీ పెరిగింది. భద్రత కరువైంది. నోట్ల రద్దు, జిఎస్‌టి, ఇంధన ధరల పెరుగుదల వల్ల కొద్దిపాటి కార్పొరేట్ కంపెనీలు మినహా దేశంలోని అన్ని వర్గాల ప్రజలు దెబ్బతిన్నారు. ఆర్థిక వ్యవస్థ కుదేలయింది. ఈ సమస్యలేవీ ఎన్నికలో ప్రచారంలో ప్రజల ముందుకు రాకుండా పాలక పక్షం, కార్పొరేట్ మీడియా జాగ్రత్త పడ్డాయి. దానికి బదులుగా మతపరంగా ప్రజలను విడదీసే భావోద్వేగాలను రెచ్చగొట్టే అంశాలు, ప్రధానంగా పుల్వామా దాడి అనంతర పరిణామాలపైకి మళ్లించాయి.

రెండవ సారి ఎన్నికయిన ప్రభుత్వం రానున్న వంద రోజుల్లో దేశంలో పెద్ద ఎత్తున సమూల సంస్కరణలు (బిగ్ బాంగ్ రిఫార్మ్) చేపట్టడానికి సన్నాహాలు చేస్తోంది. ప్రభుత్వ రంగ ఆస్తులను తెగనమ్మడం, కార్మిక హక్కులు హరించే చట్టాలు చేయడం, సబ్సిడీలు పూర్తిగా ఎత్తివేయడం వంటివి ఈ సంస్కరణల్లో కొన్ని. ప్రజల్లో పేదలు, ధనికులు అనే రెండే కులాలున్నాయి నేను పేదల పక్షాన పనిచేస్తానని ప్రచారం చేసుకున్న మోడీ ఎన్నికలు ముగిసిన వెంటనే ప్రజావ్యతిరేక సంస్కరణలు ఉధృతంగా అమలు చేయడానికి పూనుకుంటున్నారు. ఈ విధానాలు ఇప్పటికే భారాలు మోస్తున్న కార్మికవర్గంపైనా, ఇతర ప్రజలపైనా మోయలేని భారాలు వేస్తాయి. ఉద్యోగ భద్రత లేకుండా చేస్తాయి. రైతాంగాన్ని మరింత సంక్షోభంలోకి నెడతాయి. మొత్తంగా ఆర్థిక వ్యవస్థను మరింత దిగజారుస్తాయి.

అందువల్ల ఈ ప్రజావ్యతిరేక నయా-ఉదార వాద విధానాలకు వ్యతిరేకంగా వామపక్షాలు, ఇతర లౌకిక ప్రజాతంత్ర శక్తులను కలుపుకుని ద్విగుణీకృత సంకల్పంతో పోరాడాల్సిన అవసరం ఉంది. ప్రజల్లో అసంతృప్తి పెరుగుతున్న కొద్దీ మోడీ ప్రభుత్వం మరింతగా మతతత్వ, నిరంకుశ చర్యలు చేపడుతుందని గత అయిదేళ్ల అనుభవం చెబుతోంది. అందువల్ల ప్రజావ్యతిరేక ఆర్థిక విధానాలతోపాటు, మతతత్వ నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా కూడా విస్తృత స్థాయిలో ప్రజలను ఐక్యపరిచి పోరాటాలు నిర్వహించాల్సిన అవసరం ఉంది.

**చందా వివరాలు**
విడిపత్రిక: రూ. 10, సంవత్సర చందా:రూ. 100, పోస్టు ద్వారా రూ. 120
పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు.
లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి.
ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

**చిరునామా**
మేనేజర్,
మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక),
ఎం.బి. విజ్ఞానకేంద్రం,
డోర్ నెం. 27-30-3, ఆకులవారి వీధి,
గవర్నర్‌పేట, విజయవాడ-520 002

# ఎన్నికల క్యాం'పే'యిన్



రచయిత సిపిఐ(ఎం) కేంద్రకమిటీ సభ్యులు

**ఆర్ అరుణ్‌కుమార్**

ప్రతిసారి ఎన్నికలు ముగియగానే ఎన్నికల పోరాటం ఏ విధంగా జరిగిందనే అంశంపై విశ్లేషణలు లోతుగా జరుగుతుంటాయి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో తీవ్రమైన సంక్షోభం కొనసాగుతున్న నేపథ్యంలో మితవాద శక్తుల పురోగమనం జరుగుతున్న దశప్యా ఈ విశ్లేషకులపై మరింత ఆసక్తిని పెంచుతున్నాయి. ఎవరు ఎవరికి ఓటేశారు, ఎందుకేసారని అనేక ఒపీనియన్ పోల్స్ విశ్లేషణలు, ఎగ్జిట్ పోల్స్ విశ్లేషణలు, వాటి పక్షపాత వైఖరులతో పాటు, ఏఏ తరగతుల ప్రజలు లక్ష్యాలుగా చేసుకోబడ్డారు, ఏఏ సమస్యలు ముందుకు తేబడుతున్నాయో అర్థం చేసుకోడానికి, ఆ సమస్యలనే ఎంచుకోడానికి గల కారణాలు తెలుసుకోడానికి కూడా ఎన్నికల ప్రచారాలు నిశితంగా పరిశీలించబడ్డాయి, మొన్నీ మధ్యే జరిగిన ఎన్నికలే ఇందుకు మంచి ఉదాహరణ.

ఎన్నికల ప్రచార వ్యూహం ఆయా పార్టీల వర్గ స్వభావంపై ఆధారపడి ఉంటుంది. ఎన్నికలు కార్పొరేటీకరణకు దారి తీస్తున్న నేపథ్యంలో రాజకీయ పార్టీలు 'వినిమయ సరుకులుగా' మారి తమను బాగా 'అమ్మి' పెట్టగల వారికి, 'ప్రచారం' చేసి పెట్టగల 'కన్సల్టెన్సీలకి', 'అడ్వర్టైజింగ్ ఏజెన్సీలకు' ప్రచార బాధ్యతను అప్పగిస్తున్నాయి. ఖచ్చితంగా ఫలితాలు సాధించి పెట్టడమన్నది ప్రాతిపదికగా మారింది. ఎన్నికలలో పాల్గొనే పార్టీలలో ఎక్కువ మంది దోపిడీ వర్గానికి చెందిన వారే అయిన ఈ పరిస్థితులలో సిద్ధాంతం, సమస్యలు, పౌరుల ఆందోళనలు– అన్ని వెనక్కి నెట్టివేయబడతాయి. అందువలననే ప్రత్యర్థి పార్టీలకి కూడా తమ ఎన్నికల వ్యూహాలను ఒకే కాన్సల్టింగ్ సంస్థకి అప్పగించడానికి ఎటువంటి అభ్యంతరాలు ఉండడం లేదు.

అయితే ఇంతగా 'ఎన్నికలు కార్పొరేటీకరణ' జరుగుతున్నా, సమస్యలను పూర్తిగా ఎన్నికల నుండి వేరు చేయడం సాధ్యం కాదు. ఎందుకంటే 'రాజకీయ పార్టీ' అనే ఈ వినిమయ వస్తువు అంతిమ లక్ష్యం –రాజ్యాధి కారాన్ని చేరుకోవడం. అందువలన వారు సమస్యల గురించి అరకొరగానైనా ప్రస్తావనలు చేస్తుంటారు. ప్రజల జీవనానికన్నా డబ్బుకు, అస్తిత్వాలకు, మనోభావాలకు అధిక ప్రాధాన్యత ఉంటుంది. 'అమ్ముకోవడమే' ప్రధానాంశంగా ఉంటుంది. అంటే ఎన్నికలలో 'ఎన్నికల ప్రచారం' అన్నది ఇంకెంత మాత్రం ప్రచారానికి పరిమితం కాదు, అదొక 'ఎన్నికల మేనేజ్‌మెంట్'.

కాలం గడిచే కొద్దీ ఎన్నికల ఖరీదు పెరుగుతూ పోతున్నది. ప్రచారానికి ఖర్చు పెట్టడమే కాదు ఎన్నికలలో గెలవడానికి డబ్బు వెదజల్లుతున్నారు. ఈసారి ఎన్నికల కమిషన్ స్వాధీన పరుచుకున్న డబ్బు, సరుకుల విలువ రూ. 3,458,57,00,000/– (మూడు వేల నాలుగు వందల యాభై ఎనిమిది కోట్ల యాభై ఏడు లక్షలు.) ఇది కేవలం పట్టుబడ్డది మాత్రమే. సెంటర్ ఫర్ మీడియా స్టడీస్ సమాచారం ప్రకారం ఎన్నికల ఖర్చులు రూ. 5000/– కోట్లు దాటి ఉండవచ్చని అంచనా. (2014లో ఈ ఖర్చు రూ. 250 కోట్లు ఉండింది.) జెనిత్ ఇండియా రిపోర్టుల ప్రకారం టివి షోలలో, ప్రచార మాధ్యమాలైన వార్తా పత్రికలలో స్లాట్స్ ఇచ్చే జెనిత్ ఇండియా అనే సంస్థ రూ. 2,600 కోట్ల వ్యాపారం చేసిందని అంచనా. 2014 ఎన్నికలలో కాంగ్రెస్, బిజెపి రెండూ కలిసి రూ. 1,200 కోట్లు ఖర్చు చేశాయి. ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రకటించిన గణాంకాలు వేర్వేరు పద్ధతులను వేర్వేరు పార్టీలు ఎలా ఉపయోగించుకున్నాయో తెలియజేస్తున్నాయి.– గూగుల్, ఫేస్‌బుక్‌లలో బిజెపి ప్రథమస్థానం. కాంగ్రెస్ ట్విట్టర్‌లో ప్రథమస్థానం సంపాదించింది. ఎన్నికలలో ఈ రకంగా ధనం కుమ్మరించినందువల్ల ఫలితం ఏమిటి ? ఈ 'పెట్టుబడి' పై ఆయా పార్టీలకు వచ్చిన 'లాభాలెంత' ?

లార్డ్ మకల్పిన్ అనే బ్రిటిష్ కన్సర్వేటివ్ పార్టీ ట్రెజరర్ ఓసారి 'నాకు సరిపడా డబ్బు ఇస్తే నేను ప్రజలను ఏదైనా నమ్మేటట్టు చేయగలనని' అన్నారు. "ఒకటి రెండు పౌండ్లు విలువ చేసే పోస్టర్ వల్ల డబ్బు దండగ అవడం మినహా మరేం ఉపయోగం లేదు. " కానీ నాకు 80 లక్షల పౌండ్లు ఇవ్వండి. మీకు కావలసిన ఫలితం వచ్చేటట్టు చేసే బాధ్యత నాదే" అన్నారు. ఎన్నికల విధానం చూస్తే ఎంత ఎక్కువగా సొమ్ము ఖర్చు పెట్టగలిగితే అంత అనుకూల ఫలితం వస్తుందని తెలుస్తున్నది.

రొస్లిన్ ఫుల్లర్ ప్రజాతంత్రంపై రాసిన తన పుస్తకంలో "ఇంగ్లాండ్‌లో 2015 జాతీయ ఎన్నికలలో ఒక పార్టీ ఒక సభ్యునిపై 2.6 కోట్ల పౌండ్లకి మించి ఖర్చు చేయకూడదని నిబంధన విధించారు. కానీ కన్సర్వేటివ్ పార్టీ గత ఎన్నికల తర్వాత 7.0 కోట్ల పౌండ్లను సేకరించింది. ఇది మరే ఇతర పార్టీల కన్నా చాలా ఎక్కువ. అందువలనే వారు ఏ ఇతర పార్టీ కన్నా అధికంగా గెలవగలిగారు. వారి ఖర్చుల పరిమితి పెంచుకుని లాభపడ్డారు". కన్సర్వేటివ్‌లు ఎన్నికలకు కొన్ని నెలల ముందే ఎన్నికలలో ఖర్చుల పరిమితిని 3.2 కోట్ల పౌండ్లకి పెంచేశారు – ఇది ఎన్నికలలో వారికి విజయాన్ని తెచ్చిపెట్టింది. వారికి ఆర్థికంగా సహాయపడిన వారి యెడల ప్రభుత్వం సానుభూతితో వ్యవహరించింది. " అదేవిధంగా 2011–12 అమెరికా కాంగ్రెస్‌కి జరిగిన ఎన్నికల క్రమంలో ఎన్నికలు జరిగిన 84 సీట్లలో అధిక మొత్తాలలో ఎన్నికలలో ఖర్చు చేసిన వారిలో 78.3 శాతం గెలిచారు. ఈ విధానాన్నే ఇప్పుడు మన దేశంలో కూడా అవలంభిస్తున్నారు.

ఎన్నికల బాండ్లు ఉపయోగంలోకి తెచ్చి కార్పొరేట్ల నుండి నిధుల సేకరణను పెంచేశారు. దీనిపై పరిమితి అన్నదే లేదు.

డబ్బు పాత్రను పెంచడమే కాదు. ఇప్పుడు మానసిక విశ్లేషణ పరికరాల ద్వారా కూడా రాజకీయ పార్టీలు 'మైండ్ గేమ్' ఆడుతున్నాయి –ప్రజల మనోభావాలను ఎలా ప్రభావితం చేయాలి, వారి వర్గ పాలన ఎలా కొనసాగించాలన్న వ్యూహాలు రూపొందిస్తున్నారు. ఇండియా టుడే అనే పత్రిక, డేటా ఇంటెలిజెన్సు యూనిట్ నరేంద్ర మోడీ 2014లో, 2019లో ఇచ్చిన ఎన్నికల ఉపన్యాసాలను విశ్లేషించి ఈ అభిప్రాయానికి వచ్చింది: 2014లో నరేంద్ర మోడీ "పేద" అనే మాట పైనే అధికంగా నొక్కి చెప్పి దీనిని తన ప్రసంగాలలో 55 సార్లు ఉపయోగించారు. కానీ 2019 ఎన్నికలలో ఈ మాటను 44 సార్లు మాత్రమే వాడారు – పేదరికం, నిరుద్యోగం అనే సమస్యలను బిజెపి పూర్తిగా పక్కకి నెట్టేసింది. 2019 మేనిఫెస్టోలో ఆ పదాలు వాడలేదు. నరేంద్ర మోడీ కూడా ఆ పదాలను తన ప్రసంగాలలో వాడలేదు. 2014లో 19 సార్లు ప్రస్తావించబడిన 'పేదరికం' అనే పదం 2019 లోని ఎన్నికల ప్రసంగాలలో లేనే లేదు. అలాగే 2014లో 9 సార్లు ఉపయోగించాడు. 'నిరుద్యోగం' అనే పదం 2019 ఎన్నికలలో అసలు వాడనేలేదు. 2014 ఎన్నికలలో 10 సార్లు ఉపయోగించబడిన 'అవినీతి' అనే పదం 2019లో 6సార్లు మాత్రమే ఉపయోంచబడింది. "ఈ అధ్యయనం ప్రకారం ప్రజలను వేధిస్తున్న అనేక సమస్యలకు – నిరుద్యోగం, పేదరికం – బిజెపికి ప్రచారం చేసిన అతిరథ మహారథుల ప్రసంగాలలో స్థానం లేకుండా పోయింది. ఇదే అధ్యయనం ఈ సారి ఎన్నికలలో వాడిన పదాలను కూడా విశ్లేషించింది.

2014 ఎన్నికలలో పాకిస్తాన్ భారత దేశానికి సమస్యలను సృష్టిస్తున్నదని 4 సార్లు అంటే 2019 ఎన్నికలలో 15 సార్లు అన్నారు. పాకిస్తాన్, తీవ్రవాదం అనే పదాలు రెండూ ఈ ఎన్నికలలో విస్తృతంగా వాడబడగా 2014లో వాటి ప్రస్తావనే లేదు. 2014లో ఒక్కసారి మాత్రమే 'తీవ్రవాది' అనే పదం వాడారు. 2019కి వచ్చేసరికి 'తీవ్రవాదం' 'తీవ్రవాది' 'తీవ్ర' అనే పదాలు 24సార్లు ఉపయోగించబడ్డాయి. అంటే ఆయన ప్రజల అవసరాలను 'జీవనం' నుండి 'దేశరక్షణ' వైపు మరల్చారు. దేశ రక్షణ గురించి ఎన్నికలలో మాట్లాడకూడదని ఎవరూ అనలేం. కానీ రక్షణ అంటేనే యుద్ధం అన్న రీతిగా ఆ పదాన్ని మార్చడం జరిగింది. అంతేకాదు 'ఇతరులు'

> ❝డబ్బు పాత్రను పెంచడమే కాదు. ఇప్పుడు మానసిక విశ్లేషణ పరికరాల ద్వారా కూడా రాజకీయ పార్టీలు 'మైండ్ గేమ్' ఆడుతున్నాయి -ప్రజల మనోభావాలను ఎలా ప్రభావితం చేయాలి, వారి వర్గ పాలన ఎలా కొనసాగించాలన్న వ్యూహాలు రూపొంది స్తున్నారు. ఇండియా టుడే అనే పత్రిక, డేటా ఇంటెలిజెన్సు యూనిట్ నరేంద్ర మోడీ 2014లో, 2019లో ఇచ్చిన ఎన్నికల ఉపన్యాసాలను విశ్లేషించి ఈ అభిప్రాయానికి వచ్చింది.❞



బిజెపి ఎన్నికల ప్రచారంలో కార్పొరేట్ నిధులు ప్రధానమైన పాత్ర నిర్వహించాయి

అంటే అది ముస్లింల గురించే. గతంలో రైతులు కార్మికులతో కలిసి తమ జీవనానికి సంబంధించిన సమస్యలపై జరిపిన ఉద్యమంలో కనిపించిన ఐక్యతను దెబ్బతీసి ప్రజలను విభజించడానికి ఇది ఉద్దేశించబడినది.

రాయ్ యల్డేల్సన్ అనే అతను అమెరికాలో మానసిక శాస్త్రవేత్తల అసోసియేషన్ అధ్యక్షుడు. అతను ఒక పరిశోధనావేత్త. తన పరిశోధనలో 'ఇతరుల' నుండి పొంచి ఉన్న ప్రమాదమనే దాన్ని 'రక్షణ సమస్యగా' ఎలా రాజకీయవేత్తలు ఉపయోగించుకుంటారో, తద్వారా ఓటర్లను ఎలా ప్రభావితం చేస్తారో చూపారు. అసలు 'భయమనేది ముందు కొస్తే మిగిలిన అన్ని ఆలోచనలు వెనక్కు నెట్టివేయబడతాయని' నిరూపించారు. అంతేకాదు 'ఉద్రేకాలను రెచ్చగొడితే వాస్తవాలను కళ్లముందుంచినా పట్టించుకోలేము. వివేకవంతంగా ఆలోచించగలిగే శక్తి కోల్పోతాము. మనం నమ్ముడం నమ్మకపోవడమన్నది సున్నితమైన అంశం. మానసికంగా ప్రభావితం చేయగలదు. అందువలననే మనలా లేని వారిని, లేదా 'ఇతరులుగా' మనకు చూపబడుతున్న వారిని మనం సులభంగా అనుమానించగలం.

ట్రంప్ విజయానికి సంబంధించి ఎల్డేల్సన్ ఒక వివరణాత్మక విశ్లేషణ చేశారు. మోడీ ప్రచార విధానం మనకి కొన్ని విషయాలను వెల్లడి చేస్తున్నది. 'ఒక విషయాన్ని పదే పదే చెప్పడం వల్ల అది నిజామా కాదా అని ఆలోచించకుండా అటువైపే మన ఆలోచన విధానం మారిపోతుందన్నది' మరో పరిశోధకుడన్న దానిని ఆయన ఉటంకిస్తున్నారు. ప్రజలు 'దాడికి గురయ్యే అవకాశాలున్నాయన్న' భయాన్ని ట్రంప్ ఎలా వాడుకున్నాడో, తానే వారిని అనేక రకాల భయాల నుండి కాపాడగల సమర్థుడినని చిత్రించుకున్నాడో చూపించారు. ట్రంప్ తనకు తానే 'ఒక న్యాయం పొందలేని బాధితునిగా చూపుకుని', ప్రత్యర్థులను నమ్మలేని వారిగా చూపించాడు. ముస్లింలను అనుమానింప దగిన వారిగా చిత్రించాడు. తానొక్కడే నిజాలు మాట్లాడే వాడినని చెప్పుకున్నాడు. అంతేకాదు, "తన మద్దతుదారులలో తామే ఉత్తములన్న భావనను

(మిగతా 30వ పేజీలో)

# భారత కార్మికోద్యమ 'పోరాటాల శతాబ్ది...!'

**జెఎస్ మజుందార్**

సిఐటియు ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా మే నెల 30 నుండి ఏడాది పొడవునా భారత కార్మికోద్యమ 'పోరాటాలు, త్యాగాల శతాబ్ది'ని,సిఐటియు ఆవిర్భావం తరువాత 'కార్మిక వర్గ ఐక్య పోరాటాల అర్ధశతాబ్ది ఉత్సవాలను నిర్వహించేందుకు సిద్ధమయింది. కార్మికోద్యమ పోరాటాలు, త్యాగాలు చారిత్రక మైలు రాళ్లుగా నిలిచిపోయాయి. ఈ పోరాటాల నుండి నేర్చుకున్న పాఠాలతో 'ఐక్యత, పోరాటం' పిలుపుతో కార్మికోద్యమ పోరాటాలు, త్యాగాల వారసత్వంగా ఆవిర్భవించిన సిఐటియు ఈ పోరాటాలను కొనసాగించి, చారిత్రక మైలు రాళ్లుగా మలిచింది.

దేశంలో తొలి కార్మిక సంఘ ఆవిర్భావం తరువాత సిఐటియు ఏర్పడే వరకు జరిగిన కార్మిక వర్గ పోరాటాలు, త్యాగాల నేపథ్యంలో కార్మిక వర్గం, ప్రజల సమస్యలపై జరిగిన పోరాటాలు, వర్గ ఐక్యత, వర్గ దృక్పథం పెంపొందాయి. ఈ పోరాటాల గుణపాఠాలతో 'ఐక్యత–పోరాటం సిఐటియు పోరాట నినాదం రూపుదిద్దుకున్నది. ఈ కార్మికవర్గ పోరాటాలు, త్యాగాల వారసత్వాన్ని సిఐటియు ముందుకు తీసుకుపోయి, చారిత్రక మైలురాళ్ళుగా మలచిన అంశాన్ని గురించి వేరుగా చర్చించుకొందాం.

(1)

భారతదేశంలో మొదటి కార్మిక సంఘ కేంద్రం ఏర్పాటు కావటం వెనుక అనేక పోరాటాలు, త్యాగాలు చేసిన పూర్వరంగం ఉన్నది. పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంలో వర్గ పోరాటం సహజంగా ఉంటుంది. అది కార్మికవర్గంలో అంతర్లీనంగా ఉంటూ కొన్ని సమయాలలో అనుకోకుండా బటయపడుతుంటుంది. కార్మిక వర్గ సంఘాలు కార్మికోద్యమాలను నిర్మించి, నిర్వహించి, లక్ష్యసాధన దిశలో వాటికి నేతృత్వం వహిస్తున్నాయి.

19వ శతాబ్దపు చివరి పావు శతాబ్ది, 20వ శతాబ్ది తొలి దశాబ్దంన్నర కాలంలో అనేక సమ్మెలు, ఆందోళనలు జరిగాయి. వీటికి కార్మిక సంఘటిత గ్రూపులు, సంక్షేమ కేంద్రాలు, కార్మిక వర్గం, ముఖ్యంగా వ్యక్తులు, మానవత్వ వాదుల నేతృత్వంలోని కార్మిక సంఘాలు అగ్రభాగాన నిలిచాయి. ఆధునిక కార్మిక సంఘాల మాదిరిగా వీటికి రెగ్యులర్ సభ్యత్వం, నిబంధనావళి, వ్యవస్థీకృత నిర్మాణం వంటివేవీ లేవు. అయితే ఈ కాలంలో భారత కార్మిక వర్గంలో స్వాతంత్ర పోరాటంతో పాటు వృద్ధి చెందిన రాజకీయ చైతన్యం వెల్లివిరిసింది. 1908 జులైలో లోకమాన్య బాలగంగాధర తిలక్ దేశద్రోహ నేరాభియోగాలపై ఆరేళ్ల జైలుశిక్షకు గురయ్యారు. 'ఆయన అరెస్టుకు నిరసనగా బంబాయి నగరం మొత్తం స్థంభించి పోయింది. అన్ని జౌళి మిల్లులు, రైల్వే వర్క్ షాపుల సిబ్బంది సమ్మె బాట పట్టారు. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రభుత్వం సైన్యాన్ని రంగంలోకి దించింది. ఈ సందర్భంగా 16 మంది కార్మికులు మరణించగా, మరో 50 మందికి పైగా గాయపడ్డార'ని చరిత్రకారుడు బిపన్ చంద్ర తాను రచించిన భారత స్వాతంత్ర పోరాట గ్రంథంలో పేర్కొన్నారు. దీనిపై సిపిఎం నేత బిటి రణదివే 1985 అక్టోబర్–డిసెంబర్ మార్క్సిస్ట్ సంచికలో రాసిన వ్యాసంలో 'నాటి బ్రిటిష్ నిరంకుశత్వానికి వ్యతిరేకంగా నిర్వహించిన నిరసనలో కార్మికులు భారీ సంఖ్యలో పాల్గన్నారని పేర్కొన్నారు. 1908లో లోకమాన్య తిలక్ ఆరేళ్ల జైలుశిక్షకు గురైనపుడు ఇది జరిగింది. ప్రతి ఏడాది శిక్షకూ ఒక రోజు వంతున కార్మకులు సమ్మె చేశారు. ఈ సమయంలో వారు పోలీసులు, బ్రిటిష్ సైన్యంతో ఘర్షణకు దిగారు. ఈ ఘర్షణల్లో పలువురు ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రతిఘటన మొత్తం బంబయి నగరం దృష్టిని ఆకర్షించింది. చిన్న వ్యాపారులు, మధ్యతరగతి ప్రజలు వారికి మద్దతుగా రంగంలోకి దిగారు. అన్నిపరిశ్రమలకూ చెందిన శ్రామిక వర్గం రాజకీయ అవసరం కోసం అత్యంత శక్తివంతమైన సమ్మె ఆయుధాన్ని ఉపయోగించటం ఇదే తొలిసారి. ప్రజల సమీకరణలో దీని సామర్ధ్యం అప్పుడే వెల్లడయింది' అని వివరించారు.

దీనిపై నాటి సోవియట్ నేత లెనిన్ 'ఇన్‌ఫ్లేమబుల్ మెటీరియల్ ఇన్ వరల్డ్ పాలిటిక్స్' పేరుతో 1908 జులై 23 (ఆగస్టు 5) రాసిన వ్యాసంలో 'భారత ప్రజాస్వామ్య ఉద్యమనేతకు బ్రిటిష్ నక్కలు విధించిన జైలుశిక్షపై యావద్భారతం రగిలిపోయింది. కార్మిక వర్గం బంబయి నగరంలో భారీ యెత్తున నిరసనలు, సమ్మెతో తీవ్రంగా ప్రతిస్పందించింది' భారతదేశంలో కూడా కార్మికవర్గం రాజకీయ చైతన్యాన్ని సంతరించుకొని సామూహిక సమ్మెలు చేయటం జరుగుతున్నది. ఈ పరిణామాలతో భారతదేశంలోని రష్యన్ తరహా బ్రిటిష్ ప్రభుత్వం కుప్పకూలుతుంది అని పేర్కొన్నారు.

(2)

మొదటి ప్రపంచ యుద్ధం తరువాత వేగంగా చోటు చేసుకున్న ఈ దిగువ ఘటనల పరంపర దేశంలో అత్యంత వేగంగా సంఘటిత కార్మిక సంఘాల నిర్మాణానికి, తొలి కార్మిక సంఘ కేంద్రం ఆవిర్భావానికి దారి తీసింది.

– మొదటి ప్రపంచయుద్ధం ఫలితంగా భారత కార్మికవర్గం ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంది. ధరల పెరుగుదల, తక్కువ వేత నాలు, దీర్ఘకాలపు పనిగంటలు, ఇతర దోపిడీ చర్యలు తీవ్ర పారిశ్రామిక అశాంతి, ఆందోళన లకు దారి తీశాయి.

– 1917 అక్టోబర్ మహావిప్లవ ఫలితంగా మానవ చరిత్రలోనే తొలిసారిగా కార్మికరాజ్యం ఆవిర్భవించింది. దీనితో భారత్

తో సహా ప్రపంచ వ్యాప్తంగా కార్మికోద్యమాలు, జాతీయ విముక్తి ఉద్యమాలు వెల్లువెత్తాయి.

– జలియన్ వాలాబాగ్ ఊచకోత, రౌలత్ చట్టం, జాతీయ నేతలను జైలుపాలు చేయటం, 1915 నాటి హోంరూల్ ఉద్యమంతో జాతీయోద్యమం తీవ్రం కావటం, 1919 నాటి రౌలత్ సత్యాగ్రహం, 1920–22 నాటి సహాయ నిరాకరణ, ఖిలాఫత్ ఉద్యమాలు ఆ సమయంలో కార్మికోద్యమం పునరుత్తేజం పొందటానికి దారితీశాయి.

– అక్టోబర్ మహా విప్లవం తరువాత ప్రపంచ వ్యాప్తంగా కార్మికోద్యమాలు పునరుత్తేజం పొందిన ఫలితంగా 1919లో లీగ్ఆఫ్ నేషన్స్ త్రైపాక్షిక అంతర్జాతీయ కార్మికసంస్థను (ఇప్పుడు ఐరాసలో భాగమైన అంతర్జాతీయ కార్మిక సంస్థ) ఏర్పాటు చేసింది.

–1918లో మద్రాస్ లేబర్ యూనియన్ పేరుతో తొలి ఆధునిక కార్మిక సంఘం బకింగ్ హామ్ అండ్ కర్నాటిక్ మిల్స్‌లో ఏర్పడింది. అనీబిసెంట్ సహచరుడు బిపి వాడియా నేతృత్వంలో ఏర్పడిన ఈ సంఘంలో 1600 మంది సభ్యులుగా చేరారు. దీనికి నిర్మాణం, నాయకత్వ బృందం ఉంది.

–1918లో అహ్మదాబాద్‌లో గాంధీజీ అహ్మదాబాద్ టెక్స్‌టైల్ లేబర్ అసోసియేషన్ పేరుతో కార్మిక సంఘాన్ని ఏర్పాటు చేశారు. ధర్మకర్తృత్వ సిద్ధాంతం ఆధారంగా పెట్టుబడిదారులు, కార్మికుల మధ్య వర్గశాంతి, వర్గ సహకారం అన్న గాంధేయ భావాల ఆధారంగా ఈ సంఘం ఏర్పడింది.

– ఆ తరువాత అనేక పారిశ్రామిక కేంద్రాలలో ముఖ్యంగా బెంగాల్, మద్రాస్, బొంబాయి ప్రావిన్స్‌ల్లో షిప్పింగ్, రైల్వేలు, కమ్యూనికేషన్లు, జనపనార పరిశ్రమ, బొగ్గు, జౌళి, ఇంజనీరింగ్ పరిశ్రమల్లో కార్మిక సంఘాలు త్వరితంగా ఏర్పాటయ్యాయి. కార్మిక ప్రతిఘటన, సమ్మె పోరాటాలు దేశమంతటా విస్తరించాయి.

– ఈ కార్మిక సంఘాలకు జాతీయ స్థాయి నిర్మాణం లేకపోవటంతో నాటి బ్రిటిష్ ఇండియా ప్రభుత్వం ఐఎల్ఓలో భారత కార్మిక సంఘాల ప్రతినిధిగా ఎన్ఎం జోషిని నామినేట్‌చేసింది. దీనిపై అనేక సంఘాలు తీవ్ర నిరసన వ్యక్తం చేశాయి. ఈ వివాదాన్ని పరిష్కరించేందుకు కార్మిక సంఘాల జాతీయ వ్యవస్థను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

ఈ పరిణామాల ఫలితంగా 1920 అక్టోబర్ 31న బొంబాయిలో జరిగిన మహాసభలో అఖిల భారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఏఐటియుసి) పేరుతో తొలి అఖిల భారత కార్మిక సంఘం ఏర్పడింది. ఈ మహాసభకు 1.4 లక్షల మంది సభ్యత్వం కలిగిన 64 సంఘాలకు చెందిన 101 మంది ప్రతినిధులు హాజరయ్యారు. మరో 43 కార్మిక సంఘాలు ఈ మహాసభకు సంఘీభావం ప్రకటించాయి. అనేక మంది రాజకీయ నేతలు, బ్రిటిష్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్‌కు చెందిన ప్రతినిధులు కూడా ఈ సభకు హాజరయ్యారు. లాలాలజ్ పత్‌రాయ్‌ని ఏఐటియుసి అధ్యక్షుడిగానూ, ఎన్ఎం జోషిని ప్రధాన కార్యదర్శిగాను ఈ మహాసభ ఎన్నుకుంది. ఈ మొత్తం నాయకత్వం అంతా భారత జాతీయ కాంగ్రెస్‌కు చెందినదే. భారత్‌లో తొలిసారిగా కార్మిక వర్గానికి ప్రాతినిధ్యం వహించే రాజకీయ పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ కొద్దిరోజుల ముందు 1920 అక్టోబర్ 17న తాష్కెంట్‌లో ఏర్పడింది.

**❝ఈ పరిణామాల ఫలితంగా 1920 అక్టోబర్ 31న బొంబాయిలో జరిగిన మహాసభ లో అఖిల భారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఏఐటియుసి) పేరుతో తొలి అఖిల భారత కార్మిక సంఘం ఏర్పడింది. ఈ మహాసభకు 1.4 లక్షల మంది సభ్యత్వం కలిగిన 64 సంఘాలకు చెందిన 101మంది ప్రతినిధులు హాజరయ్యారు. మరో 43 కార్మిక సంఘాలు ఈ మహాసభకు సంఘీభావం ప్రకటించాయి.❞**



**1920 ఏర్పడిన ఏఐటియుసి సంఘ నాయకులు**

(3)

అయితే కొత్తగా ఏర్పడిన కార్మిక సంఘ కేంద్రం (టియుసి)లో రెండు దృక్పధాలు ఉన్నాయి. ఇందులో ఒకటి బొంబే టెక్స్‌టైల్ వర్కర్స్‌కు సంబంధించిన గిర్నీకామ్‌గార్ యూనియన్, ఈ సంఘం కార్మికుల సంఘటిత వర్గ పోరాటాలతో తక్షణ కోర్కెలతో పాటుగా విధానపరంగా మౌలికమైన మార్పుల కోసం పోరాటం చేయాలని భావిస్తున్నది. రెండవది అహ్మదాబాద్ టెక్స్‌టైల్ లేబర్ అసోసియేషన్. ఇది వర్గసంకర దృక్పధంతో కొన్ని తక్షణ ఆర్థిక ప్రయోజనాల కోసం పోరాడటానికే పరిమితం అవుతుంది. ఈ రెండు దృక్పధాలు ఏఐటియుసిలో కొనసాగుతున్నాయి.

– టియుసి ఏర్పడిన తరువాతి కాలంలో జాతీయోద్యమం, కార్మికోద్యమాలు సమాంతరంగా నడిచాయి. సమ్మె పోరాటాలు ఉవ్వెత్తున దేశవ్యాప్తంగా జరిగాయి. 1921 ఒక్క ఏడాదిలోనే దాదాపు 400 సమ్మెలు జరిగాయి. ఇందులో సగానికిపైగా విజయవంతమయ్యాయి. తొలుత కమ్యూనిస్టు పార్టీ, దాని నాయకత్వంలోని కార్మికసంఘాలు సంపూర్ణ స్వాతంత్ర్యం నినాదాన్ని ఇవ్వగా, తర్వాత జాతీయోద్యమం కూడా తన డిమాండ్‌ను 'స్వయం ప్రతిపత్తి' నుండి 'సంపూర్ణ స్వరాజ్యం'గా మార్చింది.

– భారతదేశ చరిత్రలో తొలిసారిగా అంతర్జాతీయ కార్మికదినోత్సవం మేడే సందర్భంగా 1923 మే 1వ తేదీన చెన్నయ్‌లో మలయాపురం శింగారవేలు చెట్టియార్ అరుణపతాకాన్ని ఆవిష్కరించారు.

– కార్మికోద్యమంలో చీలికలు తెచ్చి, కార్మిక సంఘాలతో కలిసి పనిచేస్తూ సమ్మెలకు నేతృత్వం వహిస్తున్న స్వాతంత్రోద్యమ విప్లవకారులను ఏకాకులను చేసేందుకు, సమ్మె

**"సంఘటిత కార్మిక శక్తిని విచ్ఛిన్నం చేసి, కమ్యూనిస్టులను ఏకాకులను చేసేందుకు, జాతీయోద్యమంతో కార్మికోద్యమం జత కలవ కుండా అడ్డుకునేందుకు నాటి సామ్రాజ్యవాద ప్రభుత్వం 1924లో 'కాన్పూర్ కమ్యూనిస్టు కుట్ర కేసు' పెట్టింది. ఈ కేసులో ముజఫర్ అహ్మద్, ఎస్ఎ డాంగే వంటి నేతలు జైలుపాలయ్యారు. అయినా కార్మికోద్యమంపై కమ్యూనిస్టుల ప్రభావం మరింత బలపడిందే తప్ప ఏ మాత్రం తగ్గలేదు."**

ఆందోళనలను అదుపు చేసేందుకు నాటి బ్రిటిష్ ప్రభుత్వం 1926లో ట్రేడ్ యూనియన్ చట్టాన్ని ప్రవేశపెట్టింది. దీనితో కార్మిక సంఘ నేతలకు గుర్తింపుతో పాటు 'సమ్మె'వంటి సంఘటిత కార్యలాపాలకు ప్రభుత్వం నుండి ముందస్తు అనుమతి తీసుకోవటం తప్పనిసరి అయింది.

– సంపూర్ణ స్వరాజ్యం స్థానంలో రాజ్యాం గ సవరణలను పరిశీలించేందుకు 1928లో భారత్‌కు సైమన్ కమిషన్ వచ్చింది. దీనికి నిరసనగా 'సైమన్ కమిషన్ గో బ్యాక్' నినాదం దేశవ్యాప్తంగా మార్మోగింది. కార్మికులు సమ్మెలు, ఆందోళనలు చేపట్టారు. ముఖ్యంగా బొంబే, కలకత్తా, మద్రాస్, లాహెూర్ నగరాల్లో సమ్మెలు, నల్లజెండాలతో నిరసన ప్రదర్శనలు వెల్లువెత్తాయి. లాహెూర్‌లో జరిగిన పోలీసు లాఠీఛార్జ్‌లో ఏఐటియుసి తొలి అధ్యక్షుడు లాలాలజపత్‌రాయ్ ప్రాణాలు కోల్పోయారు. 1928 నవంబర్ 17న ఆయన మరణించారు. ఇందుకు ప్రతీకారంగా ఈ లాఠీఛార్జ్‌కు నేతృత్వం వహించిన బ్రిటిష్ పోలీసు అధికారి శాండర్స్‌ను 1928 డిసెంబర్ 17న విప్లవకారులు హత్య చేశారు.

– కార్మికుల ఆందోళనలకు, సమ్మెలకు తెరదించటంతో పాటు స్వాతంత్ర్యోద్యమంలో వారి పాత్రను అడ్డుకునే లక్ష్యంతో నాటి సామ్రాజ్య వాద ప్రభుత్వం 'ట్రేడ్ డిస్ప్యూట్స్‌బిల్లు, పబ్లిక్ సేఫ్టీ బిల్లు వంటి రాక్షస చట్టాలను 1928లో అమలులోకి తెచ్చింది. ఇందులో ట్రేడ్ డిస్ప్యూట్స్ చట్టంపై సెంట్రల్ అసెంబ్లీలో 1929 ఏప్రిల్ 8న చర్చ జరుగుతున్న సమయంలో భారీ పేలుడు సంభవించి అసెంబ్లీ హాల్ అంతా దట్టమైన పొగతో నిండిపోయింది. విజిటర్స్ గ్యాలరీనుండి ఇద్దరు యువకులు బిగ్గరగా 'ఇంక్విలాబ్ జిందాబాద్, సామ్రాజ్యవాదం నశించాలి, ప్రపంచ కార్మికుల ఐక్యత వర్ధిల్లాలి అంటూ నినాదాలతో హోరెత్తించారు. వారే భగత్‌సింగ్, బటుకేశ్వర్ దత్‌లు (2009 మెయిన్ స్ట్రీమ్ వీక్లీలో జెఎన్‌యు ప్రొ.చమన్‌లాల్ రచన) మిగతా విషయాలు చరిత్రలో భాగమైనాయి. నాటి నుండి వర్గపోరాట మార్గంలో ముందుకు పోవటానికి భారత కార్మికవర్గానికి 'ఇంక్విలాబ్ జిందాబాద్' రణన్నినాదంగా మారింది.

– సంఘటిత కార్మిక శక్తిని విచ్ఛిన్నం చేసి, కమ్యూనిస్టులను ఏకాకులను చేసేందుకు, జాతీయోద్యమంతో కార్మికోద్యమం జత కలవ కుండా అడ్డుకునేందుకు నాటి సామ్రాజ్యవాద ప్రభుత్వం 1924లో 'కాన్పూర్ కమ్యూనిస్టు కుట్ర కేసు' పెట్టింది. ఈ కేసులో ముజఫర్ అహ్మద్, ఎస్ఎ డాంగే వంటి నేతలు జైలుపాలయ్యారు. అయినా కార్మికోద్యమంపై కమ్యూనిస్టుల ప్రభావం మరింత బలపడిందే తప్ప ఏ మాత్రం తగ్గలేదు. కానీ బ్రిటిష్ ప్రభుత్వం మరోసారి 1929లో దాడి చేసి 31 మంది కార్మిక నేతలను అరెస్ట్ చేసింది. ఇందులో భారతీయ కార్మికోద్యమానికి బాసటగా అంతర్జాతీయ సంఘీభావం చూపి గిర్ని కామ్‌గార్ యూనియన్‌కు చెందిన ఇద్దరు నేతలతో పాటు అంతర్జాతీయ కార్మికవర్గ సౌభ్రాతృత్వంతో భారత కార్మికవర్గానికి మద్దతు తెలుపుతున్న ఇద్దరు బ్రిటిష్ జాతీయులు కూడా వున్నారు. ఎటువంటి ప్రచారమూ లేకుండానే బ్రిటిష్ ప్రభుత్వం వీరిని నాలుగున్నరేళ్లు నిర్బంధించి మీరట్‌లోని ఒకమారుమూల ప్రాంతంలో విచారణ కొనసాగించింది. ఇదే మీరట్ కుట్ర కేసు విచారణగా ప్రసిద్ధి చెందింది. కార్మిక వర్గాన్ని రెచ్చగొట్టటం ద్వారా బ్రిటిష్ ప్రభుత్వాన్ని కూలదోసేందుకు కుట్ర పన్నారని వీరిపై అభియోగాలు నమోదు చేశారు. సుదూరంగానున్న మీరట్‌లో ఈ కేసుపై నాలుగున్నర సంవత్సరాలు విచారణ సాగింది.

ఈ కేసును ప్రచారానికి దూరంగా వుంచాలని ప్రభుత్వం భావించినప్పటికీ దేశ వ్యాప్తంగా భారీగా నిరసనలు వెల్లువెత్తటంతో పాటు అల్బర్ట్ ఐన్‌స్టీన్, రొమన్ రోలండ్, హెచ్‌జి వెల్స్, యార్క్ ఆర్చిబిషప్ హెరాల్డ్ లస్కీ వంటి అంతర్జాతీయప్రముఖులు దీనిని తీవ్రంగా ఖండించారు. ఈ విధంగా విఫలమైన ప్రభుత్వం అన్ని విధాలుగా దాడులకు పూనుకొని 1934 జులై 23న భారత కమ్యూనిస్టు పార్టీని నిషేధించింది. దీనితో 1926 నాటి ట్రేడ్ యూనియన్ చట్ట పరిధిలో దజనుకు పైగా కార్మికసంఘాలపై కూడా నిషేధం వేటు పడింది.

**'మార్క్సిస్టు'కు మీ సందేహాలు రాయండి!**

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రికలో సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రతినెలా పాఠకుల సందేహాలకు సమాధానాలిస్తున్న సంగతి మీకు తెలుసు. ప్రస్తుత అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై మీ సందేహాలను నివృత్తి చేసుకు నేందుకు ప్రశ్నలను రాసి పంపండి! ప్రతినెలా 20వ తేదీలోపు మీ ప్రశ్నలు మాకు చేరితే తదుపరి సంచికలో రాఘవులు సమాధానాలు లభిస్తాయి. మీ ప్రశ్నలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్, మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ఎం.బి. విజ్ఞానకేంద్రం,**
**డోర్ నెం. 27-30-3, ఆకులవారి వీధి, గవర్నర్‌పేట, విజయవాడ-520 002**

– బొంబాయిలో 1946 ఫిబ్రవరి 18న వేలాది మంది రాయల్ నేవీ నావికులు సమ్మె బాట పట్టారు. వారు బ్రిటిష్ పతాకాన్ని తీసి వేసి కాంగ్రెస్, ముస్లింలీగ్ జెండాలను పట్టి వీధుల్లోకి వచ్చారు. అనేక మంది కార్మికులు అప్పటికప్పుడు సమ్మెప్రకటించి వారితో జతకలిసారు. బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ 'జైహింద్' నినాదంతో వేలాది మంది ప్రజలు వీరితో చేతులు కలిపారు. వీరికి జత కలుస్తూ కలకత్తా, మద్రాస్, కరాచీ, విశాఖ నగరాల్లో వేలాది మంది నావికులు తిరుగుబాటు చేశారు. దీనికి ముందు రాయల్ ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో కూడా నిరసనలు మిన్నంటాయి. భారత్‌లో బ్రిటిష్ పాలనకు అంతిమ ఘడియలు సమీపించాయనిఈ రెండు సంఘటనలు సూచించాయి. నావికులకు ప్రజలు పెద్ద సంఖ్యలో మద్దతునిచ్చినప్పటికీ, వారిని సమర్థించటానికి నిరాకరించిన కాంగ్రెస్, ముస్లింలీగ్ పార్టీలు నావికులను విధి నిర్వహణకు హాజరు కావాలని కోరాయి.

(4)

భారత కార్మికోద్యమ చరిత్ర అంతా చీలిక, కలయికల కోసం జరిగిన ప్రయత్నాల సమ్మేళనమే. సామాజిక మార్పు సాధించే చారిత్రక శక్తి అయిన కార్మికవర్గ ఐక్యతకు ప్రాథమిక అవసరమైన కార్మికసంఘాల ఐక్యత కోసం కార్మికోద్యమంలోని కమ్యూనిస్టులు ఎల్లప్పుడూ పనిచేశారు. సామాజిక మార్పుకు కార్మికవర్గ ఆయుధమైన వర్గపోరాటానికి దృఢంగా కట్టుబడి ఉన్నారు. కార్మికోద్యమంలో సంస్కరణవాదంతో వారు ఏనాడూ రాజీ పడలేదు. అందువల్లే 'ఐక్యత, పోరాటం' అన్న అంశాలు కార్మికోద్యమానికి ఊపిరిగా మారాయి.

"భారత కార్మికోద్యమ చరిత్ర అంతా చీలిక, కలయికల కోసం జరిగిన ప్రయత్నాల సమ్మేళనమే. సామాజిక మార్పు సాధించే చారిత్రక శక్తి అయిన కార్మికవర్గ ఐక్యతకు ప్రాథమిక అవసరమైన కార్మికసంఘాల ఐక్యత కోసం కార్మికోద్యమంలోని కమ్యూనిస్టులు ఎల్లప్పుడూ పనిచేశారు. సామాజిక మార్పుకు కార్మికవర్గ ఆయుధమైన వర్గపోరాటానికి దృఢంగా కట్టుబడి ఉన్నారు. కార్మికోద్యమంలో సంస్కరణవాదంతో వారు ఏనాడూ రాజీ పడలేదు."




సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్న కార్మికులు

**మొదటి చీలికలు–కలయికలు 1930–40**

– కమ్యూనిస్టు, కార్మిక నేతలపై బ్రిటిష్ ప్రభుత్వం మీరట్ కుట్రకేసు ప్రారంభించిన కొద్దికాలానికే సంస్కరణవాదులు ఏఐటియుసిలో తొలి చీలికను తెచ్చారు. 1929లో జరిగిన నాగపూర్ మహాసభలో ఏఐటియుసి నుండి విడివడిన కొందరు 1930లో భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐటియుఎఫ్)ను ఏర్పాటు చేశారు.

– బ్రిటిష్ ప్రభుత్వం మీరట్ కుట్రకేసు విచారణ ప్రారంభించిన తర్వాత ఏర్పడిన ప్రత్యేక పరిస్థితులలో కార్మికోద్యమాలలో ఉన్న సంస్కరణవాదుల దృక్పథాన్ని గురించి ముజఫర్ అహ్మద్‌ను అరెస్టు చేసిన తర్వాత బెంగాల్‌లో కమ్యూనిస్టు ఉద్యమాన్ని నిర్మించటంలో ముఖ్య పాత్ర నిర్వహించిన అబ్దుల్ హలీం 1929లో ప్రచురించిన తన పుస్తకం 'భారతదేశంలో వామపక్ష కార్మికోద్యమ కర్తవ్యాలు'లో వివరించాడు. ఈ పరిస్థితులలో ఏఐటియుసి నుండి విడివడిన మరికొందరు 1931లో రెడ్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఆర్‌టియుసి) పేరుతో మరో సంఘాన్ని ఏర్పాటు చేశారు.

– తరువాత ఐటియుఎఫ్, ఏఐఆర్ఎఫ్ (ఆలిండియా రైల్వేమెన్స్ ఫెడరేషన్) విలీనమై నేషనల్ ట్రేడ్ యూనియన్ ఫెడరేషన్ (ఎన్‌టియుఎఫ్)గా ఏర్పడ్డాయి.

– తరువాత 1934లోఆర్‌టియుసి ఏఐటియుసిలో విలీనమైంది.

– 1938లో ఎన్‌టియుఎఫ్ ఏఐటియుసికి అనుబంధమైంది. తర్వాత 1940లో నాగపూర్‌లో జరిగిన మహాసభలో ఏఐటియుసిలో విలీనమైంది.

**మలి చీలికలు (1947–1970)**

– స్వాతంత్ర్యానికి మూడు నెలల ముందు కాంగ్రెస్ పార్టీ సర్దార్ వల్లభాయ్ పటేల్ ప్రోద్బలంతో ఏఐటియుసిని చీల్చి ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఐఎన్‌టియుసి)ని 1947లో ఏర్పాటు చేసింది. కమ్యూనిస్టులను ప్రధాన శత్రువుగా భావించిన కాంగ్రెస్ పార్టీ కార్మిక వర్గంలో తన పలుకుపబడిని పెంచుకునేందుకు, వర్గ సమరస్య విధానాలను అమలు చేసేందుకు ఈ చీలికను తెచ్చింది. ఐఎన్‌టియుసి తొలి మహాసభలో సర్దార్‌పటేల్ మాట్లాడుతూ 'వీరి (కమ్యూనిస్టుల) బాధ్యతా రాహిత్యం, నిర్లక్ష్యం స్పష్టమవుతున్నాయి. కార్మికుల ప్రయోజనాలతో నిమిత్తం లేకకుండా ప్రతి అంశాన్ని తీసుకొని సమ్మెలు ప్రారంభిస్తున్నారు. ఈ సమ్మెలతో గందరగోళం, బాధలు తప్ప మరేమీ సాధంచలేరు' (బిటిఆర్ రచన ఆధారంగా) అని వ్యాఖ్యానించారు.

– తరువాత 1948లో హింద్ మజ్దూర్ సభ (హెచ్ఎంఎస్) ఏర్పడింది.

– 1949లో యునైటెడ్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (యుటియుసి) ఏర్పడింది. 1958లో చీలిపోయింది.

– వేరుపడిన గ్రూపు యుటియుసి (ఎల్ఎస్) పేరుతో ఏర్పడింది. (తరువాత ఏఐయుటియుసిగా మారింది.

– ఆరెస్సెస్‌కు అనుబంధంగా భారతీయ మజ్దూర్ సంఘ్ (బిఎంఎస్) 1955లో ఏర్పడింది.

**సిఐటియు ఏర్పాటు**

ఈ పూర్వరంగంలో 'ఐక్యత–పోరాటం' నినాదంతో 1970లో సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సిఐటియు)ను ఏర్పాటు చేశాం. అది సాధించిన చారిత్రక మైలురాళ్ళను గురించి వేరేచోట చర్చించాం. ❋

**చరిత్ర**

# మానవ ఆవిర్భావానికి ముందు పరిణామాలు

**ఎంవిఎస్ శర్మ**



రచయిత
ప్రజాశక్తి సంపాదకులు

భారత ఉపఖండం భూగోళం మీద ఉన్న ప్రాంతానికి కొన్ని ప్రత్యేకతలు ఉన్నాయి. భూమధ్యరేఖకు దగ్గరగా ఇరువైపులా ఉండే భూభాగంపై సూర్యుడి కిరణాలు ఎక్కువగా పడతాయి. అదే విస్తీర్ణంగల భూభాగం ధృవాలకు దగ్గరగా ఉంటే సూర్యకిరణాలు ఆ మోతాదులో పడవు. అందుకే భూమధ్యరేఖకు దగ్గరగా ఉండే భూభాగంలో ఉష్ణోగ్రత హెచ్చుగా ఉంటుంది. అంతేగాక రోజులోని 24 గంటలలో పగలు, రాత్రి దాదాపు సమానంగా ఉంటాయి. మనం నివసించే ప్రాంతం 8 డిగ్రీల అక్షాంశం నుండి 37 డిగ్రీల అక్షాంశం మధ్య ఉంది.

హిమాలయ పర్వతశ్రేణి ఉత్తరాన ఉన్న ఎత్తైన ప్రాంతం. అందుచేత ఇక్కడ మంచు ఘనీభవించి ఉంటుంది. పైగా ఉత్తర ధృవ ప్రాంతం నుండి వీచే చల్లగాలులను హిమాలయాలు అడ్డుకుంటాయి. అందువల్ల మన దేశంలో హిమాలయాల దిగువన ఉన్న ప్రాంతం 1.5 డిగ్రీల సెల్సియస్ నుండి 3 డిగ్రీల వరకు ఎక్కువ వెచ్చగా ఉంటుంది.

దక్షిణాన ఇరువైపులా సముద్రంఉండడం వలన వాతావరణం మరీ వేడిగా గాని, మరీ చల్లగా గాని ఉండకుండా మధ్యస్తంగా ఉండడానికి వీలయింది.

ఉత్తరాన హిమాలయాలతో పాటు మనకు తూర్పు, పడమటి కనుమల పర్వతశ్రేణులు ఉత్తర– దక్షిణ దిశలలో చెరోవైపునా ఉన్నాయి. వేసవిలో భూమిమీద వాతావరణం వేడి పెరుగుతుంది. వేడెక్కిన గాలిపైకిపోతుంది. ఆ స్థానంలోకి ఆసియా భూభాగపు గాలులు రాకుండా పర్వతశ్రేణులు అడ్డుకుంటాయి. అందువలన అటు అరేబియా సముద్రం నుంచి, ఇటు బంగాళాఖాతం నుంచి నీటితో కూడిన గాలులు ప్రవేశిస్తాయి. అవి రుతుపవనాలకు కారణమవుతాయి. ఈ గాలులు హిమాలయాలవైపుగా సాగుతాయి. అక్కడికి చేరాక మళ్లీ చల్లబడి బంగాళాఖాతం మీద నుండి దక్షిణ, మధ్య భారత భూభాగాలవైపు వస్తాయి. ఈ విధంగా నైరుతీ, ఈశాన్య రుతుపవనాలు రావడం దాదాపు గత 20 లక్షల సంవత్సరాలుగా జరుగుతూనే ఉంది. ఈ రుతుపవనాల దిశ దక్షిణం నుండి ఈశాన్యానికి, మళ్లీ అటునుంచి వెనక్కి ఉంది. అందుకే వాయువ్య ప్రాంతంలో థార్ ఎడారి ఏర్పడింది.

ఇవీ మన ఉపఖండపు భౌగోళిక ప్రత్యేకతలు, ఇక్కడి వాతావరణ లక్షణాలు వర్షపాతం ఏ మోతాదులో ఉన్నదో, ఆ మోతాదులో వృక్షసంపద పెరిగింది. అడవులు ఏర్పడ్డాయి. ఈ రోజుమనం చూసే అడవులకన్నా ఎక్కువ విస్తీర్ణంలో ఉండేవి. వ్యవసాయం, పరిశ్రమలు విస్తరించిన కొద్దీ అడవులు తగ్గిపోయాయి.

ఒకప్పుడు సింధు పరివాహక ప్రాంతంలో ఏనుగులు విస్తారంగా సంచరించాయన్న ఆధారాలు ఉన్నాయి. ఇప్పుడా ప్రాంతంలోని అడవులు అంతరించిపోయాయి. ఏనుగులు సంచరించే ప్రాంతపు విస్తీర్ణం తగ్గిపోయింది.

దట్టంగా అడవులు, వృక్షసంపదఉండడం కారణంగా ఈ ఉపఖండంలో జీవజాతులు అనేకం మనగలిగాయి. 24 కోట్ల సంవత్సరాల క్రితం నుండి 6.5 కోట్ల సంవత్సరాల క్రితం వరకు ఇక్కడ డైనోసార్లు (రాక్షసబల్లులు) సంచరించిన దాఖలాలు దొరికాయి.

జీవపరిణామ క్రమంలో వైవిధ్య భరితమైన రీతిలో అనేక కొత్తరకాల జీవాలు ఆవిర్భవించాయి. ఒకప్పుడు 17 రకాల ఏనుగు జాతులుండేవట. ఇప్పుడు రేండే రెండు జాతులు మిగిలాయి. వాటిలో ఒకటి ఆఫ్రికన్ జాతి కాగా రెండవది ఇండియన్‌జాతి. హిప్పోపొటమస్ అనబడే నీటిగుర్రాలు ఒకప్పుడు గంగా, నర్మదా ప్రాంతాలలో ఎక్కువగా సంచరించాయి. పలు జాతుల అడవిగుర్రాలు కూడా ఇక్కడ ఉండేవి. తర్వాత అంతరించిపోయాయి. 8 వేల సంవత్సరాల క్రితం ఇక్కడ ఉష్ణపక్షులు సంచరించాయి.

మానవజాతి రంగ ప్రవేశం చేసి కొన్ని జంతువులను మచ్చిక చేసుకుని వ్యవసాయం కోసం భూమిని వినియోగించడం ఆరంభించాక పలురకాల జంతుజాతులు, పక్షిజాతులు అంతరించిపోవడం పెరిగింది. ఒకప్పుడు దేశమంతటా సంచరించిన సింహాలు ఇప్పుడు 'గిర్' అడవులకే పరిమితం అయ్యాయి. పెద్దపులి కూడా అంతరించిపోయే జాతుల జాబితాలో చేరింది. ఖడ్గమృగమూ అంతే. ఇంకోపక్క మచ్చిక చేసుకున్న ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలు, పందులు, గుర్రాలు, కోళ్లు, కుక్కలు, పిల్లులు, మన అవసరాలకు అనుగుణంగా పెరిగాయి.

**మరి ఈ దేశంలో మానవుడి ప్రస్థానం ఎప్పుడు మొదలైంది?**

మనువు నుంచి మానవులు వచ్చారని ఒక పురాణం చెప్తే, బ్రహ్మ ఈ సృష్టిని చేశాడని ఇంకొక పురాణం చెప్తుంది. ప్రపంచం అంతటా ఇలాంటి పుక్కిటిపురాణాలే ప్రచారంలో ఉన్నాయి. డార్విన్ 1859లో జీవజాతుల పరిణామంపై తన సిద్ధాంతాన్ని ప్రచురించి ఒకగొప్ప సంచలనం సృష్టించాడు. జీవపరిణామ క్రమం అనేది నిరంతరం సాగుతున్న ఒక ప్రక్రియ అని రుజువు చేశాడు. నిర్జీవం నుండి జీవం జీవం నుండి నిర్జీవం ఇది రెండువైపులా సాగే ప్రక్రియ. జీవపరిణామం ఏకకణ జీవి నుండి మొదలై పలుదిశలలో పలురకాలుగా మార్పులు చెందుతూ సాగుతోందని, ఈ ప్రకృతిలో జరిగే మార్పులకనుగుణంగా నిలబడి తట్టుకోగలిగినవి, అందుకనుగుణంగా మార్పులకులోనైన జీవరాశులు మనగలుగుతున్నాయని డార్విన్ రుజువు చేశాడు. ఆ క్రమంలోనే 'ఆధునిక మానవుడు' అని మన గురించి మనం చెప్పుకునే జంతువు రంగప్రవేశం చేసింది. మానవుడు పరిణామ క్రమంలో నరవానరాల నుండి వేరుపడి ఒక ప్రత్యేక జాతిగా ఆవిర్భవించాడు.


ఇది ఎప్పుడు, ఎలా జరిగింది? నరవానరాలలో అనేక జాతులున్నాయి. గొరిల్లా, చింపాంజీ, ఉరాంగుటాంగ్ వంటిరకాలు అలాంటి నరవానర జాతులనుండి వచ్చినవే. మానవజాతికి మూలంగా ఉన్న నరవానర జాతి లింకు మన పరిశోధకులకు తూర్పు ఆఫ్రికాలో దొరికింది. ఈ మూల నరవానర జాతిని 'ఆస్ట్రలో పితికస్' అన్నారు. ఇవి 41 లక్షల సంవత్సరాల క్రితం సంచరించాయి. వీటి మెదడు పరిమాణం సుమారు 400 ఘనపు సెంటీమీటర్లు మాత్రమే. అదే ఆధునిక మానవుడి మెదడు 1250 నుండి 1450 ఘనపు సెంటీమీటర్ల మేరకు వుంటుంది. ఆస్ట్రలో పితికస్ కన్నా అభివృద్ధి చెందిన జాతి (దీనిమెదడు పరిమాణం 500 ఘనపు సెంటి మీటర్లు వరకు ఉంది) 23 లక్షల సంవత్సరాల క్రితం సంచరించింది. దీనిని "ఆస్ట్రలో పితికస్ ఆఫ్రికానస్" అన్నారు. ఈ దశలోని నరవానరం కర్రపేడునో, రాయినో విసరడానికో, గోక్కోడానికో ఉపయోగించగలిగిన మేరకే పరిమితం. మానవుడు అంటేనే పనిముట్టు తయారు చేసి ఉపయోగించగలిగే జంతువు అని చెప్పుకోవాలి. అందువలన ఈ 'ఆస్ట్రలోపితికస్ ఆఫ్రికానస్'తో మానవ ప్రస్థానం మొదలైంది అనజాలం.

తూర్పు, దక్షిణా ఆఫ్రికాఖండంలోనే 26 లక్షల సంవత్సరాల నుండి 17 లక్షల సంవత్సరాల మధ్యకాలానికి చెందిన ఆధారాల్లో దొరికినది "హోమో హాబిలస్" ఈ తరహా జీవి మెదడు పరిమాణం 700 ఘనపు సెంటీమీటర్లు ఉంది. రాయిని ఇంకొక రాయితో చెక్కి పెచ్చులుగా ఎక్కదీసి పదునైన అంచులుగల పనిముట్టును తయారు చేసుకుని ఉపయోగించగలిగిన జీవి ఇది. అలాగే విభిన్న భావాలను వ్యక్తం చేసేందుకు వివిధ రకాల శబ్దాలు చేయగలిగిన సామర్థ్యం కూడా ఈ జీవికి ఉంది. ఆధునిక మానవజాతి వైపు జరిగిన ప్రయాణంలో ఇది ఒక ముఖ్యమైన మజిలీ.

ఆఫ్రికా ఖండంలోనే 18లక్షల సంవత్సరాల నుండి 2 లక్షల సంవత్సరాల మధ్యకాలానికి సంబంధించిన ఆధారాలు 'హోమోహాబిలిస్' కన్నా అభివృద్ధి చెందిన జీవి వివరాలు తెలుపుతున్నాయి. జీవిని "హోమో ఎరక్టస్" అన్నారు.

హోమో హాబిలిస్ కన్నా హోమో ఎరక్టస్ బలంగా ఉంటుంది. దీనిమెదడు పరిమాణం 1000 ఘనపు సెంటీమీటర్ల వరకు ఉంటుంది. రాతిపనిముట్లను మరింత లాఘవంగా తయారు చేయగలిగిన జీవి ఇది. రెండువైపులా పదునుగా ఉండే చేతి గొడ్డలిని తయారు చేయగలిగినది. ఇక్కడినుంచే మానవజాతి చరిత్రను కాలనిర్ధారణ చేయడం మొదలుపెట్టారు. ఇలా చేతిగొడ్డలి చేయగలిగిన కాలాన్ని పాతరాతి యుగం అన్నారు.

"హోమోఎరక్టస్‌కి ఉన్న పెద్ద సైజు మెదడు, (మెదడుకి చుట్టూ జరుగుతున్న దానిని గ్రహించేశక్తి ఉంటుంది) ధృడమైన శరీరం, నోటినుండి వివిధ స్వరాలను పలకగలగడం, వీటికి తోడు పదునైన రాతిపెచ్చులతో చేసుకున్న పరికరాలు- ఇవి ఆ జీవి అరణ్యాలలోకి విస్తరించడానికి తోడ్పడ్డాయి. రాతి పనిముట్లు తయారు చేసే క్రమంలోనే నిప్పును తయారు చేయడం కూడా పట్టుబడింది. ఇది అటవీ మృగాలను తరిమెయ్యడానికి, కొన్ని భూభాగాలలో మొక్కలను తగులబెట్టి నివాసయోగ్యంగా చేసుకోవడానికి తోడ్పడింది."


హోమోఎరక్టస్‌లు

చేతిలో ఆయుధం లాంటి పనిముట్టు ఉండడంతో హోమోఎరక్టస్ ఇతర ప్రాంతాలకు సంచరించడం పెరిగింది. అలా ఆఫ్రికా నుండి ప్రపంచం నలువైపులకూ మానవజాతి విస్తరించింది. హోమోఎరక్టస్ సంచరించిన దాఖలాలు చైనాలో (18లక్షల సంవత్సరాల క్రితం) స్పెయిన్ (18 లక్షల సంవత్సరాల క్రితం) జార్జియా, కాకసస్ ప్రాంతం (17లక్షల సంవత్సరాల క్రితం) ఇండోనేషియా (18లక్షల సంవత్సరాల క్రితం ) దొరికాయి. మన ఉపఖండంలో 20 లక్షల సంవత్స రాల క్రితం హోమోఎరక్టస్ జీవులు సంచరించిన దాఖలాలు పశ్చిమ పంజాబ్ (ప్రస్తుతం పాకిస్తాన్)లో లభించాయి. 18 లక్షల సంవత్స రాల నాటి దాఖలాలు హిమాచల్ ప్రదేశ్‌లోని శివాలిక్ కొండలలో లభించాయి.

హోమోఎరక్టస్‌కి ఉన్న పెద్ద సైజు మెదడు, (మెదడుకి చుట్టూ జరుగుతున్న దానిని గ్రహించేశక్తి ఉంటుంది) ధృడమైన శరీరం, నోటినుండి వివిధ స్వరాలను పలకగలగడం, వీటికి తోడు పదునైన రాతిపెచ్చులతో చేసుకున్న పరికరాలు– ఇవి ఆ జీవి అరణ్యాలలోకి విస్తరించడానికి తోడ్పడ్డాయి. రాతి పనిముట్లు తయారు చేసే క్రమంలోనే నిప్పును తయారు చేయడం కూడా పట్టుబడింది. ఇది అటవీ మృగాలను తరిమెయ్యడానికి, కొన్ని భూభాగాలలో మొక్కలను తగులబెట్టి నివాసయోగ్యంగా చేసుకోవడానికి తోడ్పడింది.

హోమోఎరక్టస్ జీవుల ఉనికి, సంచారం జరిగిన ఆధారాలు ఉపఖండంలో 7లక్షల సంవత్సరాల క్రితం నుండి 1,30,000 సంవత్సరాల మధ్యకాలంలో కాశ్మీర్‌లోయ, కర్నాటక, తమిళనాడు, రాజస్థాన్, మహారాష్ట్ర, నర్మద లోయలలో లభించాయి. చిన్న చిన్న జంతువులను వేటాడటం, ఇతర మృగాలు చంపి న జంతుకళేబరాలను ఆహారంగా చేసుకోవడం, అడవుల్లో దొరికేపళ్లు, దుంపలు, వేళ్లు, గింజలు తినడం హోమోఎరక్టస్ జీవనవిధానం.

వివిధ ప్రాంతాలకు విస్తరించిన తర్వాత ఆయా ప్రాంతాలలో ప్రత్యేక లక్షణాలు కల రాళ్లను ఉపయోగించి తయారు చేసుకున్న పనిముట్ల స్వభావంలో వైవిధ్యం వచ్చింది. ఆయా ప్రాంతాలలో లభించే తిండిని బట్టి కూడా వైవిధ్యం వచ్చింది. ఆయా ప్రాంతాల వారీ 'సంస్కృతి' కి ఇవే ప్రారంభం. ఐతే మార్పులు చాలా చాలా నెమ్మదిగా పదుల వేల సంవత్సరాల క్రమంలో జరిగాయన్నది దృష్టిలో ఉంచుకోవాలి. పదునుగా ఉండి చిన్న సైజులో ఉండే రాతిపెచ్చులను ఆయుధాలుగా ఉపయోగించడం వైపు మొగ్గు చూపడంతో పాతరాతియుగం ద్వితీయ దశ మొదలైంది.❊

**విశ్లేషణ**

# కులంతో అభివృద్ధి సాధ్యమేనా?



రచయిత
ప్రజాశక్తి సహాయ సంపాదకులు

**ఎ కోటిరెడ్డి**

పార్లమెంటు ఎన్నికలతో పాటే రాష్ట్ర శాసనసభకు కూడా ఏప్రిల్ 11వ తేదీన ఎన్నికలు జరిగాయి. తెలుగుదేశం, వైసిపిలతో పాటు సిపిఎం, సిపిఐ, జనసేన, బహుజన్ సమాజ్ పార్టీ కూటమి ప్రధాన పోటీదారులుగా ఎన్నికలలో పాల్గొన్నాయి. ఎన్నికలలో సిపిఎం, సిపిఐ, జనసేన, బహుజన్ సమాజ్ పార్టీల కూటమి మాత్రమే కొంతమేరకు విధాన ప్రాతిపదికగా రాజకీయ ప్రచారం చేసింది. టిడిపి, వైసిపిలు విధానాలను వదిలేసి, వ్యక్తిగత దూషణలు, కులపరమైన సమీకరణలకు పూనుకున్నాయి. ఎన్నికల ముందు సంక్షేమ పథకాలను ప్రకటించటం ద్వారా పేద ప్రజలను తమ వెనుక సమీకరించటానికి ప్రయత్నించాయి. 2014లో రాష్ట్ర శాసనసభ, లోక్‌సభకు జరిగిన ఎన్నికలలో టిడిపి, బిజెపిలు పొత్తు పెట్టుకొని ఉమ్మడిగా పోటీచేశాయి. ఆ తర్వాత నాలుగు సంవత్సరాలు టిడిపి, బిజెపితో కలిసి వ్యవహరించింది. రాష్ట్ర ప్రభుత్వంలో బిజెపి శాసనసభ్యులు మంత్రులుగా చేరటంతో ఆ పార్టీ కూడా రాష్ట్ర ప్రభుత్వంలో భాగస్వామి అయింది. టిడిపి పార్లమెంటు సభ్యులు కేంద్ర ప్రభుత్వంలో మత్రులుగా చేరటంతో ఆ పార్టీ కేంద్ర ప్రభుత్వంలో భాగస్వామి అయింది. ఆ కాలమంతా రాష్ట్ర ప్రయో జనాల కన్నా తమ రాజకీయప్రయోజనాలు, ముఖ్యమంత్రి, టిడిపిలోని ఇతర ముఖ్యనాయకుల వ్యక్తిగత ఆర్థిక ప్రయోజ నాలకే ఆ పార్టీ పెద్దపీట వేసింది. రాష్ట్రానికి ప్రత్యేకహోదా, విభజన చట్టం ప్రకారం ఇవ్వవలసిన రాయితీలను ఇవ్వకపోయినా టిడిపి బిజెపిని పల్లెత్తుమాట అనకపోగా, రాష్ట్రాన్ని గొప్పగా ఆదుకొంటున్నారని కేంద్రమంత్రులకు సన్మానాలు చేసింది. ప్రత్యేకహోదా సాధన కోసం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేస్తున్న కమ్యూనిస్టు పార్టీల కార్య కర్తలు, ప్రజలపై తీవ్ర నిర్బంధాన్ని ప్రయో గించింది. నాయకులను, కార్యకర్తలను అక్రమం గా అరెస్టులు చేయటంతో పాటు కార్యక్రమాలను విచ్ఛిన్నం చేయటానికి అధికార యంత్రాంగాన్ని ఉపయోగించింది. ప్రత్యేకహోదా కోసం నిరం తరం ఆందోళనలు చేస్తున్న ఉభయ కమ్యూనిస్టు పార్టీలు 2018 మార్చిలో నిర్వహించిన రాష్ట్రబంద్ జయప్రదం కావటంతో టిడిపి ప్లేటు ఫిరాయించి, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాన్ని వ్యతిరేకిస్తున్నట్లు ఫోజు పెట్టటానికి పూనుకున్నది. కేంద్ర ప్రభుత్వంలో మంత్రులుగా ఉన్న తమ పార్లమెంటు సభ్యులతో మంత్రివర్గానికి రాజీనామా చేయించింది. రాష్ట్ర ప్రభుత్వంలో మంత్రులుగా ఉన్న బిజెపి శాసనసభ్యులు కూడా మంత్రి పదవులకు రాజీనామాలు చేశారు. అప్పటి నుండి బిజెపికి వ్యతిరేకంగా తానే పోరాటం చేస్తున్నట్లు టిడిపి ప్రచారం చేసుకొంటున్నది.

రాష్ట్రానికి ప్రత్యేకహోదా కోసం తానే పోరాటం చేశానని చెబుతున్న వైసిపి రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నికలలో బిజెపి తన మద్దతును కోరినపుడు మాటమాత్రంగా కూడా ప్రత్యేకహోదా విషయం ప్రస్తావించలేదు. బిజెపి అడగటమే గొప్ప అన్నట్లుగా ఆ పార్టీ అభ్యర్థులకు బేషరతు మద్దతు ప్రకటించింది. రాష్ట్రానికి ప్రత్యేకహోదా ఇస్తేనే బిజెపి అభ్యర్థులకు మద్దతు ఇస్తామని మాటమాత్రంగా కూడా చెప్పలేదు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రయోజనాలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నపుడు, రైల్వేజోన్ ప్రకటించి, వాల్తేరు డివిజన్‌ను రద్దు చేసి అన్యాయంగా వ్యవహరించినపుడు ఆ పార్టీ నోరు మెదపలేదు. బిజెపితో సన్నిహిత సంబంధాలు కొనసాగించ టమే మహాభాగ్యం అన్నట్లు ఆ పార్టీ వ్యవహరించింది.

**కులతత్వాన్ని రెచ్చగొట్టారు**

రాష్ట్రంలోని రెండు ప్రధాన రాజకీయ పార్టీలైన టిడిపి, వైసిపిలు పెరుగుతున్న కులోన్మాదాన్ని తమ రాజకీయ ప్రయోజనాల కోసం వినియోగించుకోవటానికి, కుల విభజనలను మరింతగా పెంచి పోషించటానికి పూనుకున్నాయి. రెండు ప్రధాన ప్రాంతీయ రాజకీయ పార్టీలైన టిడిపి, వైసిపిలు రాష్ట్రంలో ఆర్థికంగా, సామాజికంగా బలంగా ఉన్న రెండు ప్రధాన కులాలను ఉపయోగించుకుంటూ, ఆ కులాలకు తామే ప్రతినిధుల మన్నట్లుగా అనధికారికంగా ప్రచారం చేసుకున్నాయి. అస్థిత్వవాద ఉద్యమాలు బలపడటం, జాతి, కులం, మతం, ప్రాంతం తదితర సంకుచిత భావాలు విస్తరిస్తున్న నేపథ్యంలో ఆ సంకుచిత ధోరణులను ఇక్కడా వినియోగించుకోవటానికి ఉభయులూ ప్రయత్నించారు. గతంలో ఏనాడూ లేనంత ఉధృతంగా ఈ ఎన్నికలలో కుల ప్రచారం జరిగింది. తాము అధికారంలో ఉన్నామని, ఇపుడు వేరేకులం తమను అధికారం నుండి తొలగించటానికి ప్రయత్నం చేస్తున్నదని, కాబట్టి తమ అధికారాన్ని కాపాడుకోవాలంటే కులం అంతా ఐక్యంగా ఓటు చేయాలని అధికారంలో ఉన్న టిడిపి ఒక కులం వారిలో ప్రచారం చేసింది. తమకులం అధికారానికి దూరంగా ఉందని, అవతలి కులం అధికారాన్ని అనుభవిస్తున్నదని, ఇపుడు అధికారంలోకి రాకపోతే తమకులం దశాబ్దాల కాలం

వెనక్కుపోతుందని, తమ కులానికి ప్రాతినిధ్యం వహిస్తున్న పార్టీ అధికారంలోకి రావాలంటే కులం అంతా ఐక్యంగా ఓట్లు వేయాలని ప్రతి పక్షంలో ఉన్న వైసిపి ప్రచారం చేసింది. ఉభయ పార్టీలూ చేసిన ఈ ప్రచారం ఆయా కులాల ప్రజలలోకి లోతుగా చొచ్చుకుపోయింది. తమ కులానికి ప్రతినిధిగా చెప్పుకుంటున్న పార్టీకి ఆ కులంలోని ఓటర్లు గణనీయమైన సంఖ్యలో సంఘటితంగా ఓటు చేయటానికి సన్నద్ధం కావటంతో పాటు, ఆ పార్టీకి ఓటు చేసే విధంగా ఓటర్లను సమీకరించటానికి కృషి చేశారు. పోలింగ్ రోజు తమకు వచ్చే ఓటు ఒక్కటి కూడా తప్పిపోకుండా పోల్ చేయించటం కోసం ప్రయత్నం చేయటంతో పాటు ఆయా కులాల నుండి దూరప్రాంతాలలో ఉద్యోగాలు చేస్తున్న వారిలో ఒక్కరు కూడా దిగబడకుండా అందరినీ రప్పించటానికి ప్రయత్నాలు చేశారు. హైదరాబాదు, బెంగళూరు, ఢిల్లీ తదితర నగరాలలో ఉంటున్న వారితో పాటు అమెరికా, బ్రిటన్, ఇతర దేశాలలో ఉంటున్న వారిలో కొందరు కూడా తమ సామాజిక తరగతితో పాటు ఓటు వేయటం కోసం వచ్చారు. బూర్జువా, భూస్వామ్యవర్గ రాజకీయ పార్టీల నాయకులు అధికార సాధనకోసం కులతత్వాన్ని ఎంత శక్తివంతంగా వినియోగించుకుంటారన్న విషయాన్ని ఈ ఎన్నికలు స్పష్టం చేశాయి.

> **“కులాలు, మతాలు, ప్రాంతాల పేరుతో బూర్జువా రాజకీయ పార్టీలు చేస్తున్న సమీకరణలు శ్రామికవర్గ ఐక్యతను దెబ్బతీస్తున్నాయి. కార్మికులు, కర్షకులు, ప్రభుత్వోద్యోగులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, మధ్యతరగతి మేధావులు, వృత్తులు, వ్యాపారాలు చేసుకొనే చిరు వ్యాపారులు, వృత్తిదారులు తదితర పీడిత వర్గాలు, సామాజిక తరగతుల ప్రజలు దోపిడీకి గురవుతున్నారు.”**



అస్తిత్వవాద సమీకరణలు

## చీలిపోతున్న పీడితవర్గాలు

కులాలు, మతాలు, ప్రాంతాల పేరుతో బూర్జువా రాజకీయ పార్టీలు చేస్తున్న సమీకరణలు శ్రామికవర్గ ఐక్యతను దెబ్బతీస్తున్నాయి. కార్మికులు, కర్షకులు, ప్రభుత్వోద్యోగులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, మధ్యతరగతి మేధావులు, వృత్తులు, వ్యాపారాలు చేసుకొనే చిరు వ్యాపారులు, వృత్తిదారులు తదితర పీడిత వర్గాలు, సామాజిక తరగతుల ప్రజలు దోపిడీకి గురవుతున్నారు. ఎస్‌సి, ఎస్‌టిలు పూర్తిగా, బిసి సామాజిక తరగతులలో అత్యధిక భాగం సామాజిక అణచివేతకు గురవుతున్నారు. దోపిడీ వర్గాలు కుల, మత, ప్రాంతీయ తత్వాలను రెచ్చగొట్టటంతో ఈ వర్గాలు, సామాజిక తరగతులు నిట్టనిలువునా చీలిపోతున్నాయి. రాష్ట్రంలో రెండు ప్రధాన కులాలకు ప్రాతినిధ్యం వహిస్తున్నామని చెప్పుకుంటున్న పార్టీలు రాష్ట్రాన్ని పాలించాయి. తమను ఒక కులానికి ప్రతినిధులుగా ప్రచారం చేసుకుంటున్న టిడిపి, వైసిపిలలో నాయకులుగా ఉన్నవారిలో అన్ని కులాల వారు ఉన్నారు. చంద్రబాబు కులానికి చెందిన వారు జగన్ నాయకత్వంలోని వైసిపిలో నాయకులుగా ఉండగా, జగన్ కులానికి చెందిన వారు చంద్రబాబు నాయకత్వంలోని టిడిపిలో నాయకులుగా ఉన్నారు. టిడిపి అధికారంలో ఉన్నపుడు ఆ పార్టీలోఉన్న అన్ని కులాల నాయకులు ప్రయోజనం పొందారు. వైఎస్ రాజశేఖరరెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నపుడు ఆ పార్టీ నాయకులుగా ఉన్న అన్ని కులాల నాయకులు ప్రయోజనం పొందారు. ఈ విధంగా టిడిపి అధికారంలో ఉన్నా లేదా వైసిపి అధికారంలో ఉన్నా వారు ప్రతినిధులమని చెప్పుకుంటున్న కులానికి చెందిన నాయకులతో పాటు ఆ పార్టీలో ఉన్న అన్ని కులాల నాయకులు లబ్ది పొందారు.

ఈ రెండు పార్టీల నిర్మాణతీరు, ఎన్నికలలో అభ్యర్థులను నిలబెట్టటం, గెలిచినపుడు మంత్రివర్గం ఏర్పాటు తదితరాలలో ఎక్కడా ఒక కులానికి ప్రాతినిధ్యం వహిస్తున్నామన్న ధోరణి కనిపించదు. ఉభయపార్టీలూ గ్రామస్థాయి నుండి రాష్ట్రస్థాయి వరకు తమ పార్టీ కమిటీలలో అన్ని కులాల వారిని నియమిస్తున్నారు. పంచాయితీలు, మండలాలు, జిల్లా పరిషత్, ఎంఎల్‌సి ఎన్నికలలో కూడా కుల ప్రాతిపదిక కాకుండా గెలవగలగటం ప్రధాన అర్హతగా పోటీకి దింపుతున్నారు. పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికలలో కూడా ఇదే విధంగా పోటీ పెడుతున్నారు. 2014, 2019లలో జరిగిన పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికలలో ఈ రెండు పార్టీలూ తాము ప్రాతినిధ్యం వహిస్తున్నామని చెప్పుకుంటున్న కులానికి నాలుగో వంతు స్థానాలను కూడా కేటాయించలేదు. ఎస్‌సి, ఎస్‌టిలకు కేటాయించిన రిజర్వేషన్ స్థానాలు పోనూ మిగతా నాలుగింట మూడు వంతుల స్థానాలలో తమకులం వారినే పోటీపెట్టవచుకదా! తమకులం అంతా తమకే ఓట్లు వేయాలని చెప్పుకుంటున్న వీరు అన్ని కులాల వారినీ తమ పార్టీల తరపున పోటీపెట్టారు! కులంపైనే ఆధారపడితే అధికారం రాదని కుల ప్రచారం చేస్తున్న నాయకులకు తెలుసు. అందువలన అన్ని కులాలకు చెందిన ప్రజలను ఓట్లు వేయమని కోరుతూ తమకులం మొత్తాన్ని తమవెంట తీసుకువెళ్ళటానికి ఉభయులూ ప్రయత్నం చేశారు. కాబట్టి వారు ప్రచారం చేసుకుంటున్నట్లుగా ఈ రెండు పార్టీలు రెండు కులాలకు ప్రాతినిధ్యం వహిస్తున్నా యన్న విషయం అబద్ధమని, రాష్ట్రంలో ఉన్న రెండు

> "వైఎస్ రాజ శేఖరరెడ్డి పాలనలో ఆయన సామాజిక తరగతికి చెందిన కౌలురైతులకు బ్యాంకులనుండి రుణాలు ఇప్పించలేదు. చంద్రబాబు పాలనలోనూ ఆయన సామాజిక తరగతికి చెందిన కౌలు రైతులకూ బ్యాంకుల నుండి రుణాలు ఇప్పించలేదు. వైఎస్ పాలనలో ఆయన సామాజిక తరగతికి చెందిన రైతులు అనేకమంది వ్యవసాయం గిట్టుబాటు కాక ఆత్మహత్యలు చేసుకోగా, చంద్రబాబు పాలనలో ఆయన సామాజిక తరగతికి చెందిన రైతులూ ఆత్మహత్యలు చేసుకున్నారు."



ఉద్యోగాల కోసం బారులు తీరిన నిరుద్యోగులు

బూర్జువా, భూస్వామ్య వర్గాల గ్రూపులకు ఈ పార్టీలు నాయకత్వం వహిస్తున్నాయని, తమ రాజకీయ ప్రయోజనాల కోసం కులతత్వాన్ని వినియోగించుకుంటున్నాయని స్పష్టమౌతున్నది.

రాష్ట్రంలోని బూర్జువా, భూస్వామ్య వర్గాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ రెండు పార్టీల పాలన లో ఆ పార్టీలు ప్రాతినిధ్యం వహిస్తున్నాయని చెప్పుకుంటున్న కులాలలోని పేదల పరిస్థితి ఏమిటి? చంద్రబాబు నాయకత్వంలో టిడిపి 13 సంవత్సరాలకు పైగా రాష్ట్రాన్ని పాలించింది. వైఎస్ రాజశేఖరరెడ్డి పాలనను పునరుద్ధరిస్తామని వైసిపి చెపుతున్నది. వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్య మంత్రిగా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఆరు సంవత్సరాలు రాష్ట్రాన్ని పాలించింది. చంద్ర బాబునాయుడు రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నపుడు ఆయన కులంలోని వ్యవసాయ కార్మికులు, పేద, కౌలురైతులు, నిరుద్యోగులు, ఇతర పేదలకు ఏమైనా అదనపు ప్రయోజనం కలిగిందా? లేక వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా పాలన సాగించినపుడు ఆయన కులానికి చెందిన ఈ వర్గాల ప్రజలకు ఏమైనా అదనపు ప్రయోజనం కలిగిందా? వీరుభయుల పాలనలోనూ ఆ కులాలలోని పీడిత వర్గాల ప్రజలకు ఏ మాత్రం ప్రయోజనం కలగలేదు. పని దొరకని వ్యవసా య కార్మికులు, రుణాలు అందని కౌలురైతులు, ఉద్యోగాలు దొరకని నిరుద్యోగులు, ఇతర పీడితులకు కులం ప్రాతిపదికగా పనులు చూ యించారా? ఉద్యోగాలిచ్చారా? కౌలురైతులకు బ్యాంకు రుణాలు ఇప్పించారా? వీటిలో ఏ ఒక్కటీ ఉభయులలో ఎవరూ చేయలేదు. వైఎస్ రాజ శేఖరరెడ్డి పాలనలో ఆయన సామాజిక తరగతికి చెందిన కౌలురైతులకు బ్యాంకుల నుండి రుణా లు ఇప్పించలేదు. చంద్రబాబు పాలనలోనూ ఆయన సామాజిక తరగతికి చెందిన కౌలు రైతులకూ బ్యాంకుల నుండి రుణాలు ఇప్పించ లేదు. వైఎస్ పాలనలో ఆయన సామాజిక తరగతికి చెందిన రైతులు అనేకమంది వ్యవసా యం గిట్టుబాటు కాక ఆత్మహత్యలు చేసుకోగా, చంద్రబాబు పాలనలో ఆయన సామాజిక తర గతికి చెందిన రైతులూ ఆత్మహత్యలు చేసు కున్నారు. చంద్రబాబు నాయకత్వంలోని టిడిపి, వైఎస్ నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు అమలు జరిపిన విధానాల ఫలితాలు మంచి వైనా, చెడ్డవైనా ఇతర సామాజిక తరగతులలోని తమ వర్గ సోదరులతో సమానంగా ఆ కులాల లోని పేదలు కూడా నష్టపోవటం లేదా ప్రయోజనం పొందటం జరిగింది.

కాబట్టి చంద్రబాబునాయుడు, వైఎస్ జగన్‌లు వారి కులాలకు ప్రాతినిధ్యం వహిస్తు న్నారని, వారు నాయకత్వం వహిస్తున్న రాజ కీయ పార్టీలు వారి కులాల ప్రయోజనాలను కాపాడతాయన్నది శుద్ధ అబద్ధమని పై వివరాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ రెండు పార్టీలూ దోపిడీ వర్గాలైన బూర్జువా, భూస్వాములకు ప్రాతి నిధ్యం వహిస్తున్నాయి. టిడిపి అధికారంలో ఉ న్నపుడు కులాలతో నిమిత్తం లేకుండా ఆ గ్రూపులో ఉన్న నాయకులు, కాంట్రాక్టర్లు, ఇతరులకు ఎక్కువ ప్రయోజనం చేకూరింది. వైసిపి అధికారంలో ఉన్నపుడు ఆ గ్రూపులోని వారికి ఎక్కువ ప్రయోజనం చేకూరుతుంది. కాబట్టి కులాల పేరుతో జరుగుతున్న ఈ ప్రచా రం ఫలితంగా ఆ రాజకీయ పార్టీల నాయకు లకూ, వారిని అనుసరించి ఉండే బూర్జువా, భూస్వామ్య వర్గాలకు ప్రయోజనం కలుగుతుంది మినహా పీడిత వర్గాలు, సామాన్యులకేమీ ప్రయోజనం కలుగదని ఆ పార్టీలలోని సామా జిక, వర్గ పొందిక, ఆ ప్రభుత్వాలు అమలు జరిపిన విధానాలే స్పష్టం చేస్తున్నాయి. అయితే ఈ ప్రచారం శ్రామిక ప్రజల ప్రయోజనాలకు నష్టం కలిగించటంతో పాటు కమ్యూనిస్టు పార్టీలకు కూడా నష్టం కలిగించింది. కమ్యూనిస్టు పార్టీల సభ్యులు, సానుభూతిపరులు కొందరు కూడా కులతత్వంతో ప్రభావితమై పార్టీ, అభ్యు దయ ఉద్యమాలకు దూరమయారు.

### కుల ప్రచారం ఎందుకు చేస్తున్నారు?

ఒకప్పుడు రాజకీయాల ప్రాతిపదికపై ప్రచారం చేసిన బూర్జువా రాజకీయ పార్టీలు ఇపుడు కులాలు, మతాలు, ప్రాంతాలు, ఇతర సంకుచిత అంశాల ప్రాతిపదికగా ప్రచారం చేస్తున్నారు. రాజకీయ పార్టీలు ఈ విధమైన ప్రచార పద్ధతులకు ఎందుకు దిగుతున్నాయి? గతంలో రాజకీయ పార్టీలు విధానాల ప్రాతి పదికగా తమ కార్యక్రమాలు, రాజకీయాలు సాగించేవి. బూర్జువా, భూస్వామ్య వర్గాల ప్రయోజనాల పరిధిలోనే కొన్ని భిన్నమైన సమస్యలను ముందుకుతెచ్చేవి. వాటి పరిష్కారం

కోసం కృషి చేస్తామని చెబుతూ ప్రజలను సమీకరించటానికి పూనుకొనేవి. కాని సరళీకరణ విధానాలను అమలు చేయటం ప్రారంభించిన తర్వాత బూర్జువా, భూస్వామ్య వర్గ రాజకీయ పార్టీల విధానాలలో వైవిధ్యం అంతరించింది. ఈ పార్టీలన్నీ సరళీకరణ విధానాలనే అమలు చేస్తున్నాయి. కాబట్టి ప్రతిపక్షంలో ఉండి, అధికారంలోకి రావటానికి ప్రయత్నం చేస్తున్న బూర్జువా రాజకీయ పార్టీలకు సమస్యల ప్రాతిపదికగా ప్రజలను సమీకరించే అవకాశం కుదించుకుపోయింది. అందువలన కుల, మత, ప్రాంతీయ తదితర సంకుచిత భావాలను రెచ్చ గొట్టటం ద్వారా ప్రజలను సమీకరించటానికి పూనుకుంటున్నాయి. బూర్జువా, భూస్వామ్య వర్గ పార్టీలు ఈ విధంగా సమీకరణ చేయటానికి అవసరమైన పూర్వరంగాన్ని సరళీకరణ విధానాలతో పాటు ముందుకు వచ్చిన అస్తిత్వవాద ఉద్యమాలు సమకూర్చిపెట్టాయి. కుల, మత, ప్రాంత, భాషా తదితర గుర్తింపులతో అస్తిత్వ వాద భావాలు ఆయా తరగతులలో స్థానం సంపాదించుకోవటం, కొన్ని తరగతులు, ప్రాంతాలలో ఉద్యమ రూపం తీసుకోవటంతో ఈ గ్రూపులు బలపడ్డాయి. ఆ విధంగా అస్తిత్వం ప్రాతిపదికగా చీలిపోయిన ప్రజలను బూర్జువా, భూస్వామ్య వర్గ రాజకీయ పార్టీలు తమ స్వప్రయోజనాల కోసం వినియోగించు కుంటున్నాయి.

**పీడిత వర్గాల ప్రజలకు తీరని నష్టం**

ఈ విధమైన కుల, మత విభజనలతో పీడిత వర్గాల ప్రజలు నష్టపోతుండగా, దోపిడీ వర్గాలు అత్యధికంగా ప్రయోజనం పొందు తున్నాయి. దోపిడీకి గురవుతున్న ప్రజలు అస్తిత్వం పేరుతో చీలిపోవటంతో వర్గ ఐక్యత బలహీనపడుతున్నది. కార్మికులు, ఉద్యోగులు, వ్యవసాయ కార్మికులు, రైతులు, కౌలురైతులు, వృత్తులు, వ్యాపారాలు చేసుకొనే వారిని పాలకవర్గాలు దోపిడీ చేస్తున్నాయి. కాబట్టి తమ ప్రయోజనాల సాధన కోసం ఈ వర్గాలు దోపిడీ వర్గాలు, ఆ వర్గాలకు ప్రాతినిధ్యం వహించే ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరంతరం పోరాటం చేయవలసిఉంటుంది. దోపిడీకి గురవుతున్న ప్రజలందరూ ఐక్యంగా ఉన్నపుడే ఆ విధంగా పోరాడటం సాధ్యం అవుతుంది. కానీ అస్తిత్వవాద ఉద్యమాల ప్రభావంతో చీలిపోయిన పీడిత వర్గాల ప్రజలు తమ ప్రయోజనాల సాధన కోసం పోరాటాలు చేయటం కష్టంగా మారింది. తమ ప్రయోజనాలను కాపాడుకో లేకపోతున్నారు. వారిపై దోపిడీ, సామాజిక అణచివేత తీవ్రమౌతున్నది. మరోవైపున దోపిడీ వర్గాలు ఎప్పటి కన్నా ఈనాడు సంఘటితంగా

> **"మరోవైపున దోపిడీ వర్గాలు ఎప్పటి కన్నా ఈనాడు సంఘటితంగా ఉన్నాయి. అస్తిత్వవాద ఉద్యమాలకు నాయ కత్వం వహిస్తున్న, ఒకరితో ఒకరు బద్ధ శతృవు లుగా వ్యవహరి స్తున్నట్లు కనిపించే అస్తిత్వవాద ఉద్యమాల నాయకులు తమకు వ్యక్తిగతంగా ప్రయోజనం కలుగుతుందనుకుంటే తాము అప్పటి వరకు చెప్పిన వాటిని పక్కన పెట్టి, నిన్నటి వరకు ప్రత్యర్థులుగా ఉన్న వారితో కలిసి వ్యవహరిస్తున్నారు."**




కార్మికుల పోరాటాలు

ఉన్నాయి. అస్తిత్వవాద ఉద్యమాలకు నాయ కత్వం వహిస్తున్న, ఒకరితో ఒకరు బద్ధ శతృవు లుగా వ్యవహరిస్తున్నట్లు కనిపించే అస్తిత్వవాద ఉద్యమాల నాయకులు తమకు వ్యక్తిగతంగా ప్రయోజనం కలుగుతుందనుకుంటే తాము అప్పటి వరకు చెప్పిన వాటిని పక్కన పెట్టి, నిన్నటి వరకు ప్రత్యర్థులుగా ఉన్న వారితో కలిసి వ్యవహరిస్తున్నారు. బూర్జువా, భూస్వామ్య వర్గ పార్టీల నాయకులు పార్టీలు మారటం బస్సు ఎక్కిదిగినంత తేలికగా భావిస్తున్నారు. తమకు వ్యక్తిగతంగా ప్రయోజనం కలుగుతుందనుకొంటే అన్ని పార్టీలలోని బూర్జువా, భూస్వామ్య వర్గాల నాయకులు క్షణాలలో ఒకటవుతున్నారు. వారు ఏ అస్తిత్వగ్రూపుకు లేదా రాజకీయ పార్టీకి చెందినా తమ స్వప్రయోజనాలను పరిరక్షించు కోవటం, సామాజికంగా తమ ఆధిపత్యాన్ని కాపాడుకోవటం కోసం ఏకం కావటానికి ఏ మాత్రం సందేహించటం లేదు.

ఇటువంటి పరిస్థితులలో కేంద్రంలో తిరిగి బిజెపి ప్రభుత్వం అధికారంలోకి రావటం తో పీడిత ప్రజల ప్రయోజనాలపై దాడులు తీవ్రమయే అవకాశాలు పెరిగాయి. రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వం స్థానంలో వైసిపి ప్రభుత్వం ఏర్పడినా పీడిత వర్గాల ప్రజలకు ఒరిగిపడేదేమీ లేదు. భారాలు యధాతథంగానే కొనసాగటం, కొత్తగా భారాలు విధించబడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. కాబట్టి శ్రామికప్రజలు వర్గ ప్రాతిపదికపె ఐక్యమై, సంఘటిత పోరాటాలకు సన్నద్ధం అయితేనే దోపిడీని ప్రతిఘటించటం, తమ ప్రయోజనాలను కాపాడుకోవటం సాధ్యం అవుతుంది. సామాజిక అణచివేతకు వ్యతిరేకంగా పోరాడేశక్తి పెరుగు తుంది. కాబట్టి వర్గ ఐక్యతను సాధించటం కోసం కుల, మత, ప్రాంతీయ విభేదాలను పెద్దవి చేస్తూ బూర్జువా, భూస్వామ్య వర్గాలు సామాన్య ప్రజలలో పెంచుతున్న సంకుచిత భావాలకు వ్యతిరేకంగా పోరాడాలి. శ్రామిక వర్గ ప్రజలు ఐక్యం కావటం ద్వారానే తమ కోర్కెలను సాధిం చుకోవటం, సామాజిక అణచివేతను ప్రతిఘటిం చటం సాధ్యం అవుతుంది. ❋

# పరిణామక్రమంలో భూసంబంధాలు

సి సాంబిరెడ్డి



రచయిత సుందరయ్య విజ్ఞానకేంద్రం కార్యదర్శి

**స్వయం పోషక గ్రామీణ ఆర్థిక వ్యవస్థ :**

స్వయం పోషక గ్రామాలలో స్వంత భూమి లేదు. భూమి రాజ్యానిది. గ్రామంలోని మిగులును రాజు పన్నుల రూపంలో కాజేసే వాడు. గ్రామంలోని రైతులు, వృత్తిదారులు తమ తమ ఉత్పత్తులను యిచ్చి పుచ్చుకునే పద్ధతిలో మారకం వేసుకునేవారు. వారి మధ్య హెచ్చు తగ్గులు లేవు. వర్గాలు లేవు. వర్గపోరాటం లేదు. కాబట్టే సమాజంలో మార్పులేదను కున్నారు. మార్బ్సు యీ అభిప్రాయానికి రావటానికి జె.యస్.మిల్‌లాంటి ఆనాటి బ్రిటీష్ చరిత్ర కారుల రచనలు కారణమయ్యాయి. వందల సంవత్సరాలు నిలువనీరులా కుళ్లికంపుకొడుతున్న యీ సమాజాన్ని బ్రిటీష్ వాళ్లైనాబద్దలు కొడతారని మార్బ్సు ఆశించాడు. కాని తరువాత లభించిన కొత్త సమాచారం వెలుగులో మార్బ్సు తన అభిప్రాయాన్ని మార్చుకున్నాడు.

**భూస్వామ్య విధానం :**

తరువాత మార్బ్సిస్టు చరిత్రకారులు డి.డి. కొశాంబి, ఆర్.యస్.శర్మ, ఇర్ఫాన్‌హబీబ్‌లు తమ పరిశోధనల ఆధారంగా ప్రపంచంలోని మిగతా దేశాల మాదిరిగానే ఉత్పత్తి విధానాల మార్పుతో మన దేశం కూడా మారుతూ వచ్చిందని, ఆ మార్పులకు వర్గపోరాటంతో పాటు సాంకేతిక పరిజ్ఞానంలో మార్పులు, మిగులు రాబట్టే పద్ధతులలో వచ్చిన మార్పులు కూడా కారణమని భావించారు.

గుప్తుల కాలం ముగిసే నాటికి సమాజంలో పెద్ద మార్పులు జరిగాయని వీరు అంటారు. పట్టణాలు క్షీణించాయి. డబ్బుకు కరువు యేర్పడింది. వ్యాపారం కూడా తగ్గిపోయింది. ప్రధానంగా బ్రాహ్మణులకు భూదానాలు యివ్వటం మొదలైంది. భూదానాలు యివ్వటం గుప్తుల కాలం తరువాత బాగా పెరిగి, విస్తరించింది కూడాను. వీళ్లే శిస్తులు వసూలు చేసి, ఒక భాగం ప్రభుత్వానికి యిచ్చి, మిగిలినది తాము స్వంతం చేసుకునేవారు. వారికి ద్రవ్య, న్యాయ, సైనిక పరమైన కొన్ని అధికారాలను కూడా రాజులు కట్టబెట్టారు. అట్లా రాజ్యానికి, రైతుకు మధ్య ఒక దళారి వర్గం యేర్పడింది. వాళ్ల చేతుల్లోకి భూమి వచ్చింది. దీనినే డి.డి. కొశాంబి పై నుండి రుద్దిన భూస్వా మ్య విధానం అన్నాడు.

ఈ కాలంలో సామాజికంగా కూడా పెద్ద మార్పులు జరిగాయి. శూద్రులు అంతకు ముందు అణిగిమణిగి వుండేవారు. వారికి ఎలాంటి హక్కులు వుండేవి కావు. దాదాపు వారివి బానిస బతుకులు. అలాంటి శూద్రులు యీ కాలంలో రైతులయ్యారు. అనేక పోరాటాల కారణంగా యీ మార్పు వచ్చింది. మౌర్య సామ్రాజ్యం పతనమైన తరువాత దీర్ఘకాలం పాటు సమాజంలో పెద్దకల్లోలం వ్యాపించింది. వర్ణ ధర్మాన్ని ప్రశ్నించటం, దానిని ధిక్కరించటం ప్రారంభమైంది. దీనినే కలియుగం అన్నారు. యీ కాలంలో వర్ణ ధర్మానికి యెదురు దెబ్బలు తగిలాయి. తరువాత అనేక కులాలు పుట్టుకొచ్చాయి. అవి హెచ్చు,తగ్గులతో కూడిన కులాలు. కులాలను బట్టి బ్రాహ్మణులు భూకేటాయింపులు చేశారు. రైతాంగంలో తేడాలు యేర్పడ్డాయి. అసమానతలతో కూడిన భూపంపకం అమలులోకి వచ్చింది. అట్లా యీ కాలంలో ప్రధానంగా బ్రాహ్మణులకు భూమి మీద పెత్తనం వచ్చింది. వైశ్యులతో పాటు శూద్రులు కూడా రైతులయ్యారు. రైతులు వస్తు రూపంలో పన్ను కడతారు. దానిని పాలకులతో పాటు బ్రాహ్మణ భూస్వాములు కూడా పంచుకొని అనుభవిస్తారు. ఆనాడు దోపిడీ కొనసాగిన విధానమిది. ఇదే ఆనాటి భూస్వామ్య విధానం.

ఈ పద్ధతి గుప్తుల తరువాత 6శతాబ్దాలు కొనసాగింది. ఆ కాలంలో ఆ భూస్వామ్య విధానం ఉత్తర భారతదేశంతో పాటు దక్షిణానికి కూడా వ్యాపించింది. మొగలాయి చక్రవర్తుల కాలంలో మరికొన్ని మార్పులు చోటు చేసుకున్నాయి. జమీందార్లతో పాటు కొత్తగా జాగీర్దారులు, తాలూకాదార్లు కూడా వచ్చారు. భూస్వామ్య విధానం మరింత బలపడింది. పన్ను వసూలు డబ్బు రూపంలో కొంత జరిగేది. కాని జమీందార్లకు, జాగీర్దార్లకు మధ్య వైరుధ్యం వుండేది. రైతాంగం కొన్ని సందర్భాల్లో తమ స్థితిని మెరుగుపరచుకోటానికి యీ వైరుధ్యాన్ని వాడుకునేవారు. సాంకేతిక అభివృద్ధి యేమీ లేకుండానే పాలకులు దోపిడీని పెంచారు. దానితో వ్యవసాయం సంక్షోభంలో పడింది. రైతాంగ ప్రతిఘటన విస్తరించింది. అనేక తిరుగుబాట్లు చోటు చేసుకున్నాయి. జాట్లు, సిక్కులు, మరాఠాల తిరుగుబాట్లు అలాంటివే. వాటితో మొగులాయి సామ్రాజ్యం బలహీన పడింది. ఈ పరిస్థితిని ఉపయోగించుకొని బ్రిటీషువాళ్లు అధికారాన్ని చేజిక్కించుకున్నారు.

**వలస పాలన :**

వలస పాలకులు తమ ఆదాయాన్ని పెంచుకోటానికి మన రాష్ట్రంలో రైత్వారీ చట్టాన్ని తెచ్చారు. దానితో భూమి కూడా అమ్మకపు సరుకుగా మారింది. భూమి అమ్మకాలు, కొనుగోళ్లతో రైతాంగంలో హెచ్చుతగ్గులు యింకా పెరిగాయి. ప్రభుత్వ పన్నులు భరించలేని, మార్కెట్ల ఒడిదుడుకులకు తట్టుకోలేని వాళ్లు భూములు అమ్ముకొని వ్యవసాయ కూలీలుగా మారారు. దివాళా తీసిన వృత్తుల నుండి కూడా వ్యవసాయ కూలీలు తయారయ్యారు. భూములు కొన్నవాళ్లు భూస్వాములయ్యారు.రైతాంగంలో మధ్య తరగతులు కూడా యేర్పడ్డాయి.

ఆనాటి అనంతపురం జిల్లా కలెక్టర్ మన్రో రిపోర్టు ప్రకారం అప్పటికే రాయలసీమలో వ్యవసాయం, బ్రతకటానికి వ్యవసాయంగా కాక అమ్మకానికి పంటలు పండించటంగా వున్నదని రాశారు. పత్తి, చెరకు విస్తారంగా పండేవని 30శాతం కుటుంబాలకు భూములు లేవని, రైతుల్లో 45శాతం మధ్య తరగతి రైతులని,

> "కాని దక్షిణ కోస్తాలో క్రిష్ణా, గోదావరి, పెన్నా నదుల మీద ఆనకట్టలు రావటం, సాగునీటి సౌకర్యం యేర్పడటంతో వ్యవసాయం అభివృద్ధి చెందిందని, బ్రతకటానికి మాత్రమే కాక, అమ్మకానికి పంటలు పండించేవారని రాశారు. ఈ క్రమంలో ఒక ప్రక్క భూములు పోగొట్టు కొని వ్యవసాయ కార్మికులలో కలిసే వారు కొందరైతే, మరొక ప్రక్క భూములు కొని పెద్ద పెద్ద భూస్వాములుగా మారిన మరికొంత మంది తయారయ్యారు."



కృష్ణా డెల్టాలో పంటలు

వారు కూలీలను పెట్టుకోరు, కూలికి పోరు అని, కాని ధనిక రైతులు కూలీలను ఉపయోగించారని, అంతా వర్షాధార వ్యవసాయం కాబట్టి రిస్కు నుండి బయట పడటానికి వర్తకులతో పాలు పద్ధతిలో (share croping) కాంట్రాక్టులు చేసుకునే వారని రాశారు. పత్తి, చెరకు కారణం గానే మద్రాసు, బొంబాయి రైల్వే లైను రాయల సీమ గుండా వేశారని రాశారు.

ఉత్తర కోస్తా జిల్లాలలో భూమి తక్కువ, జనాభా యెక్కువ కాబట్టి భూమి మీద వత్తిడి యెక్కువగా వుండేదని, విశాఖ జిల్లాలో కొంత ప్రాంతంలో పండే చెరకు మినహా వ్యాపార పంటలులేవని, రోడ్డు, రవాణా, విద్య, వైద్య సౌకర్యాలు మృగ్యమని, కాబట్టి అభివృది లేదని రాశారు.

కాని దక్షిణ కోస్తాలో క్రిష్ణా, గోదావరి, పెన్నా నదుల మీద ఆనకట్టలు రావటం, సాగునీటి సౌకర్యం యేర్పడటంతో వ్యవసాయం అభివృద్ధి చెందిందని, బ్రతకటానికి మాత్రమే కాక, అమ్మకానికి పంటలు పండించేవారని రాశారు. యీ క్రమంలో ఒక ప్రక్క భూములు పోగొట్టు కొని వ్యవసాయ కార్మికులలో కలిసే వారు కొందరైతే, మరొక ప్రక్క భూములు కొని పెద్ద పెద్ద భూస్వాములుగా మారిన మరికొంత మంది తయారయ్యారు. అట్లా యీ ప్రాంతంలో వ్యవసాయంలో పెట్టుబడిదారీ విధానం ప్రవేశిం చింది. అ భూస్వాములు తమ మిగులుతో (వ్యవసాయంలో మిగిలిన డబ్బుతో) భూములు కొనటంతో పాటు వడ్డీ వ్యాపారాలు చేసేవారని, వ్యవసాయాధారిత పరిశ్రమల్లో పెట్టుబడులు పెట్టేవారని రాశారు.

మరొక ప్రక్క డెల్టా జిల్లాలకు పడమటి భాగంలో వున్న ప్రాంతాలు మరియు కొన్ని ప్రాంతాలు మినహా మిగిలిన రాయలసీమలో వర్షపాతం తక్కువ, సాగునీరు లేదు. సారంలేని భూములతో ఉత్పాదకత తక్కువ. మిగులుతో కూడిన వ్యవసాయం కాదు. బ్రతకటానికి మాత్రమే వ్యవసాయంగా వుండేది. కాబట్టి అక్కడ సరుకుల ఉత్పత్తికి పెద్దగా అవకాశం వుండేది కాదు. అట్లా యీ ప్రాంతాల్లో అసమాన భూపంపిణీతో కూడిన యెదుగూ,బొదుగూ లేని వ్యవసాయం వుండేది.

కాబట్టి వలస పాలనా కాలంలో ఆంధ్ర లో రైత్వారీ పద్ధతి వచ్చిన తరువాత కూడా డెల్టా ప్రాంతంలో మినహా ప్రధానంగా భూస్వామ్య విధానమే కొనసాగింది.

**స్వతంత్రం వచ్చిన తరువాత భూసంబంధాల్లో సంభవించిన మార్పులు :**

స్వతంత్రం తరువాత వచ్చిన జమీందారీ రద్దు, జాగీర్దారీ రద్దు, కౌలుదారీ చట్టాలు, భూసంస్కరణల చట్టాల వలన తెలంగాణలో పేదలకు కొంతవరకు భూములు దక్కాయి. కాని ఆంధ్రలో అమలు జరిగిన మోసపూరిత భూసంస్కరణలు, దగాకోరు పంపిణీ పద్ధతులతో పేదలకు పెద్దగా భూములు దక్కక పోగా కౌలురైతాంగం బేదఖ్లకు గురి అయింది. పాలక వర్గాలు తమ అవసరాలకు తగినట్లు వ్యవసాయ ఉత్పత్తిని పెంచటానికి అనేక మార్పులు ప్రవేశ పెట్టాయి. అందులో ప్రధానమైనది హరిత విప్లవం. జాతీయం చేసిన బ్యాంకుల ద్వారా రైతాంగానికి రుణ సౌకర్యం కల్పించారు. సాగునీటి వసతిని విస్తరించారు. భూగర్భ జలాలు వాడకంలోకి వచ్చాయి. అధికోత్పత్తి వంగడాలు, రసాయనిక యెరువులకు సబ్సిడీ, పంటల అమ్మకానికి రక్షిత మార్కెట్టు, గిట్టుబాటు ధరలు, పరిశోధన, విస్తరణ శాఖల యేర్పాటు యిత్యాది సౌకర్యాలతో ఉత్పాదకత పెరిగింది. వ్యవసాయం లాభసాటిగా తయారయింది. అప్పటి వరకు కౌలుకు యిచ్చిన భూస్వాములు కూడా వ్యవసాయ కార్మికులను ఉపయోగించి స్వంత వ్యవసాయం ప్రారంభించారు. అట్లాగే అనేక మంది ఉద్యోగులు పెద్ద పెద్ద పెట్టుబడు లతో కౌలు భూములలో పంటలు పండించారు.

వ్యవసాయంలో వచ్చే మిగులును భూసంస్క రణలు వచ్చేంత వరకు వ్యవసాయాభివృద్ధికే వాడారు. భూములు కొన్నారు. భూగర్భ జలాలను వెలికి తీశారు. వ్యవసాయ మంతా సరుకులమయం అయింది. పెట్టుబడిదారీ విధానం బాగా అభివృద్ధి అయింది. ఆ పెట్టుబడి దారీ విధానం రైతాంగంలోని హెచ్చుతగ్గులను మరింత పెంచింది. నష్టాల పాలైన పేద రైతులు వ్యవసాయ కార్మికులలో కలిసిపోయారు. రైతాంగంలోని దిగువ తరగతుల నుండి కొందరు పై తరగతులకు ఎగబాకారు. వారే గ్రామసీమల్లో నయా ధనిక వర్గం. వారే ధనిక రైతులు. వారూ, భూస్వాములు కలిసి వ్యవ సాయంలో లాభాలు (మిగులు) పెరిగే కొద్దీ, వాటిని పట్టణాలలో వ్యవసాయ ఉత్పత్తుల ప్రోసెసింగు పరిశ్రమలు, హోటళ్లు, సినిమా హా ళ్లు, సినిమా పరిశ్రమ, యితర వ్యాపారాలలో పెట్టుబడులుగా ఉపయోగించారు. యీ అభివృద్ధి ప్రధానంగా సాగునీటి వసతిగల ప్రాంతాలలోనే జరిగింది.

**భూ సంబంధాల మార్పును గురించిన ప్రభుత్వ సమాచారం :**

స్వంతంత్రం వచ్చిన తరువాత ఆంధ్ర రాష్ట్రంలో భూసంబంధాలలో సంభవించిన

**"1980 తరువాత అవి మరింత వేగంగా తగ్గాయి. 1980 వరకు హరిత విప్లవం పేరుతో ప్రభుత్వ రాయితీలతో లాభాలు పోగేసుకున్న వీరు 1980 తరువాత వచ్చిన ఉదారవాద విధానాలతో వ్యవసాయ ఉత్పత్తుల ధరలు పడిపోవటం, ప్రభుత్వ పెట్టు బడులు, ప్రభుత్వ రాయితీలు తగ్గిపోవటంతో వారు యింత వరకు పిండుకున్న సంపదలతో యెక్కువ లాభసాటి వ్యాపారాలకు అవకాశం వున్న పట్టణాలు, నగరాలకు ఎగబాకారు."**

మార్పులను యిప్పుడు కొంత వివరంగా పరిశీలిద్దాము.

1961 నుండి 1991 వరకు జరిగిన 30సంవత్సరాల కాలంలో భూసంబంధాలలో వచ్చిన మార్పులకు సంబంధించి ప్రభుత్వ సమాచారం వుంది. దాని ప్రకారం యీ 30 సంవత్సరాల కాలంలో సన్నకారు, చిన్నకారు, మధ్య తరగతి రైతుల స్వంతభూమితో కూడిన కమతాలు 88.38శాతం నుండి 96.24 శాతానికి పెరిగాయి. వారి భూమి (స్వంతభూమి) 31.81శాతం నుండి 74.74 శాతానికి, అంటే దాదాపు 43 శాతం పెరిగింది. మరొక ప్రక్క భూస్వాములు మరియు ధనిక రైతుల స్వంత భూములతో కూడిన కమతాలు మరియు భూములు పెద్ద మొత్తంలో తగ్గాయి. వారి కమతాలు 11.62 శాతం నుండి 3.73 శాతానికి, వారి భూములు యింకా యెక్కువగా 65.2శాతం నుండి 23.46శాతానికి అంటే, 46.74శాతం తగ్గిపోయాయి. కుటుంబాల విభజన వలన పెరగవలసిన వారి కమతాలు తగ్గాయంటే అర్థం వారు పెద్ద యెత్తున గ్రామాలను వదలి పట్టణా లకు, నగరాలకు వెళ్లిపోయారు.

భూస్వాములు, ధనిక రైతుల కమతాలు గాని, భూములుగాని యీ 30 సంవత్సరాల కాలం (1961 నుండి 1991 వరకు) లో తగ్గుతూనే వచ్చాయి. కాని 1980 తరువాత అవి మరింత వేగంగా తగ్గాయి. 1980 వరకు హరిత విప్లవం పేరుతో ప్రభుత్వ రాయితీలతో లాభాలు పోగేసుకున్న వీరు 1980 తరువాత వచ్చిన ఉదారవాద విధానాలతో వ్యవసాయ ఉత్పత్తుల ధరలు పడిపోవటం, ప్రభుత్వ పెట్టుబడులు, ప్రభుత్వ రాయితీలు తగ్గిపోవటంతో వారు యింత వరకు పిండుకున్న సంపదలతో యెక్కువ లాభసాటి వ్యాపారాలకు అవకాశం వున్న పట్టణాలు, నగరాలకు ఎగబాకారు. ఉద్యోగాలు, విద్య, వైద్య రంగాలు, కాంట్రాక్టు పనులు, ఫైనాన్స్, రియల్ఎస్టేటు, పరిశ్రమలు మొదలుగా గల పెద్ద పెద్ద లాభాలు సంపాదించగల రంగాలన్నిటికి వారు వ్యాపించారు. యింతకు ముందే చెప్పినట్టు మిగిలిన 3.73 శాతం భూస్వాములు, ధనిక రైతులు గ్రామాలలో వ్యవసాయంతో పాటు (కౌలుకిచ్చిగాని, కూలీలను పెట్టుకొనిగాని) వడ్డీ వ్యాపారం, విత్తనాలు, రసాయనిక ఎరువులు, పురుగు మందుల వ్యాపారం, వ్యవసాయ పంటల కొనుగోలు వ్యాపారం చేస్తున్నారు. గ్రామాల్లో శ్రమ దోపిడీ, కౌలు దోపిడీ, వ్యాపార దోపిడీ – అన్ని రకాలుగా పేదలను దోపిడీ చేసేది వారే. అట్లా వారి సంబంధాలు, వ్యవసాయ కార్మికులు, పేద రైతాంగంతో కొనసాగుతూనే వున్నాయి. సామాజిక, రాజకీయ రంగాల్లో వారే ముఖ్యులు. సామాజికంగాను, రాజకీయంగాను యిప్పటికీ పల్లెసీమల్లో వారిదే పెత్తనం. అనేక విధాలుగా పేద ప్రజానీకం వీరికి కట్టుబడిపోయారు. అన్ని రంగాలలో వీరిదే ఆధిపత్యం. పాలకవర్గ పార్టీలకు గ్రామాలలో వీరే వెన్నుదన్నుగా వున్నారు.

మరొక ప్రక్క పేద రైతుల కమతాలు పెరగటానికి కారణం ఆ కాలంలో జరిగిన వారి కుటుంబాల విభజన. కుటుంబాల విభజన ద్వారా వారి కమతాల సంఖ్య యింకా యెక్కువగా పెరిగి వుండాలి. కాని విభజిత కుటుంబాలలో భూములకు దూరమై వ్యవసాయ కూలీలుగా మారిన కుటుంబాలూ వున్నాయి, పేద రైతులుగా కొనసాగిన కుటుంబాలూ వున్నాయి. కాబట్టి పేద రైతుల సంఖ్య పెరగటంతో పాటు, వ్యవసాయ కార్మికుల సంఖ్య కూడా పెరిగింది. కాని పేద రైతుల భూమి యీ 30 సంవత్సరాల కాలంలో పెద్ద మోతాదులో పెరిగిందని చూశాము. పట్టణాలకు చేరిన భూస్వాములు, ధనిక రైతులు అమ్మిన భూములలో కొంత వీరూ కొన్నారు. పెట్టుబడిదారీ విధానం అందరినీ దివాలా తీయించదు. కొంతమంది వున్నస్థాయిలోనే నిలదొక్కుకుంటారు. మరి కొంతమంది భూములు కొని ముందుకు పోతారు. అయినా వీరి భూములు యింతగా పెరగటానికి భూముల కొనుగోలు మాత్రమే కారణం కాదు. మన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రభుత్వం 44 లక్షల యకరాలు ఎసైన్డు భూములు పేదలకు పంచినట్లుగా లెక్కలు చెప్తూ వుంది. ఆ భూములు యిప్పుడు యెవరి అధీనంలో వున్నా, ప్రభుత్వ రికార్డుల ప్రకారం అవి పేదల భూములుగానే వుండి వుండాలి. భూసంస్కరణలు యెంత బూటకమైనా కొందరికైనా భూములు దక్కాయి. దళితుల భూమి పంపక పథకం ద్వారా కొన్ని భూములు వారికీ వచ్చాయి. యిట్లా రకరకాల కారణాలతోనే పేద రైతుల భూములు అంతగా పెరిగాయి.

కాబట్టి యీ కాలంలో భూస్వాములు, ధనిక రైతుల కమతాల శాతం మరియు వారి భూముల శాతం తగ్గింది. అట్లాగే పేద రైతుల విషయంలో వారి కమతాల శాతం పెరిగింది. వారి భూముల శాతం యింకా యెక్కువగా పెరిగింది.

**గ్రామాల అధ్యయనం :**

1974లో కా॥సుందరయ్య గారు

---

<u>పాఠకుల అభిప్రాయం</u>

## ఆమె గొప్ప విప్లవోద్యమ క్రాంతి

మార్క్స్ ద్విశతజయంతి సందర్భంగా మార్క్సిజంపై అనేక వ్యాసాలు వివిధ పత్రికలలో వస్తున్నాయి. మార్క్స్ సహచరి జెన్నీ గురించి వివరంగా వ్యాసం రాలేదు. మన 'మార్క్సిస్టు'లో ప్రచురించినందుకు అభినందనలు. ఆమె వైవాహిక జీవితం 21 యేళ్లు మాత్రమే. ఆమె రాచరికపు కుటుంబం నుండి వచ్చినప్పటికి మార్క్స్‌తో చివరి శ్వాసవరకు కన్నీళ్లు, కష్టాలు, ఎప్పుడూ ప్రవాస జీవితమే. మార్క్స్ తండ్రి మరణానంతరం వారసత్వంగా వచ్చిన ఆస్తిని ఆయుధాల కోసం విప్లవకారులకు ఇచ్చేశారు. చిన్న ఇంటికి కూడా అద్దె కట్టలేని స్థితి. ఆకలి, అనారోగ్యం పిల్లలకు పాలుకొని పెట్ట లేని స్థితి. ఆమె అండ, అప్యాయతలు లేకపోతే మార్క్స్ లేరు. ఆయన లేకపోతే "కమ్యూనిస్టు ప్రణాళిక లేదు. అని నా వ్యక్తిగత అభిప్రాయం. ఈ వ్యాసం కమ్యూనిస్టు కుటుంబ స్త్రీలు తప్పనిసరిగా చదవాలి.

– తుంపాల శ్రీరామమూర్తి , గాజువాక

గుంటూరు జిల్లాలోని అనంతవరం, కాజ గ్రామాల్లో సర్వే జరిపారు. స్వంతభూమి పరంగా యీ గ్రామాల్లో లభించిన లెక్కలు ప్రభుత్వ లెక్కలకు కొంత భిన్నంగా వున్నాయి. (ప్రక్క ప్రక్క గ్రామాలలో కూడా భూసంబంధాల్లో పెద్ద తేడాలు వుండవచ్చు.) ప్రభుత్వ లెక్కల ప్రకారం 1971-72 నాటికి భూస్వాములు, ధనిక రైతుల కమతాలు రాష్ట్రం లో 10శాతానికి, వారి భూములు 56శాతానికి పడిపోయాయి. కాని సుందరయ్యగారు సర్వే చేసిన అనంతవరం (గుంటూరు జిల్లా) గ్రామం సాగునీటి సౌకర్యం గల రెండు పంటలు పండే గ్రామం. అక్కడ భూస్వాములు, ధనిక రైతుల కమతాల మొత్తం 49శాతం, వారి భూముల మొత్తం 90శాతంగా వున్నాయి. ప్రభుత్వం యిచ్చిన లెక్కలు రాష్ట్రమంతటికి సగటు లెక్కలు. కాని యీ గ్రామంలో రెండు పంటలు పండే మాగాణి భూమి వుంది. కాబట్టి తప్పకుండా తేడా వుంటుంది. కాని అది చాలా యెక్కువగా వుంది. యీ గ్రామంలో దాదాపు సగం కుటుంబాలు భూస్వాములు, ధనిక రైతులుగా వుండటం యీ గ్రామం ప్రత్యేకతగా వుంది. ఆ జిల్లాలోనే మరొక గ్రామం-సగం మాగాణి, సగం మెట్ట భూములు కలిగిన కాజ గ్రామం. కాజ గ్రామంలో భూస్వాములు, ధనిక రైతుల కమతాలు 26శాతం వుండగా ప్రభుత్వ లెక్కల ప్రకారం రాష్ట్రంలో ఆనాటికి అవి 10శాతం మాత్రమే వున్నాయి. అట్లాగే వారి భూములు కాజ గ్రామంలో 60శాతం వుండగా, ప్రభుత్వ లెక్కల ప్రకారం అవి 56శాతం వున్నాయి. అంటే కాజ గ్రామం లెక్కలు భూమి పరంగా ప్రభుత్వ లెక్కలతో దాదాపు ఏకీభవిస్తూ వున్నా, కమతాల పరంగా పెద్ద తేడా వుంది.

2013లో సుందరయ్య విజ్ఞాన కేంద్రం, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు కలిసి జరిపిన సర్వేలో లభించిన సమాచారం ప్రభుత్వ సమాచారానికి దగ్గరగా ఉంది. దాని ప్రకారం భూస్వాములు, ధనిక రైతులవి 5.3 శాతం కమతాలు వుండగా మొత్తం భూమిలో వారి భూమి 27శాతంగా వుంది. అట్లాగే పేద రైతుల కమతాలు 94.7 శాతం వుండగా వారి భూమి 73శాతంగా వుంది. ఇవి యింతకుముందు చెప్పిన 1991-92 నాటి ప్రభుత్వ లెక్కలకు సరిపోతున్నాయి. అంటే 1991-92 నాటికే భూసంబంధాల్లో గరిష్టంగా మార్పులు వచ్చాయి. తరువాత యీ నిష్పత్తులు పెద్దగా మారలేదని, మార్పుకు అవకాశం కూడా పెద్దగా లేదని యీ వివరాలు తెలుపుతున్నాయి.

**“కొన్ని గ్రామాలలో నూటికి ఐదు కుటుంబాల అధీనంలో మొత్తం భూమిలో 80 శాతం భూములు కేంద్రీకరించబడి వున్నాయి. ఒక గ్రామంలో 300కుటుంబాలు, 1000 ఎకరాల భూమి వుందనుకుందాము. నూటికి ఐదు కుటుంబాల చొప్పున 300 కుటుంబాలున్నఆ గ్రామంలో 15 కుటుంబాలు వుంటాయి. నూటికి 80ఎకరాలు అంటే 1000ఎకరాలకు 800ఎకరాలు అవుతాయి. దీని అర్థం ఆ గ్రామంలో 15 కుటుంబాల వాళ్లు 800 ఎకరాల భూమిని కలిగి వుంటారు.”**

**భూమి కేంద్రీకరణ :**

యింతకు ముందు చెప్పినట్టు, రాష్ట్రంలో మొత్తం భూమిలో భూస్వాములు, ధనిక రైతుల భాగం తగ్గినా దక్షిణ కోస్తా డెల్టా ప్రాంతాలలోని అనేక గ్రామాలలో వారి వద్ద భూములు యిప్పటికీ విపరీతంగా కేంద్రీకరించబడి వున్నాయి. కొన్ని గ్రామాలలో నూటికి ఐదు కుటుంబాల అధీనంలో మొత్తం భూమిలో 80 శాతం భూములు కేంద్రీకరించబడి వున్నాయి. ఒక గ్రామంలో 300కుటుంబాలు, 1000 ఎకరాల భూమి వుందనుకుందాము. నూటికి ఐదు కుటుంబాల చొప్పున 300 కుటుంబాలకు ఆ గ్రామంలో 15 కుటుంబాలు వుంటాయి. నూటికి 80ఎకరాలు అంటే 1000ఎకరాలకు 800ఎకరాలు అవుతాయి. దీని అర్థం ఆ గ్రామంలో 15 కుటుంబాల వాళ్లు 800 ఎకరాల భూమిని కలిగి వుంటారు. అంతేకాదు మిగిలిన 285 కుటుంబాలకు మిగిలేది 200ఎకరాలు మాత్రమే. యిట్లా చూస్తే దక్షిణ కోస్తా డెల్టా ప్రాంతాల్లో కొన్ని గ్రామాలలో భూకేంద్రీకరణ యీ విధంగా వుంది. 1) రోళ్ల పాలెంలో (తూ.గో) 90శాతం, చేదువాడలో (తూ.గో) 80శాతం, బొబ్బనపల్లిలో (ప.గో) 71 శాతం, వెల్దిపాడులో (క్రిష్ణా) 64శాతం, చంపాడులో (గుంటూరు) 64శాతంగా వుంది. యీ జిల్లాలలోని ఎగువ ప్రాంతాల్లో కూడా భూకేంద్రీకరణ యెక్కువగానే ఉంది. అయినా డెల్టా గ్రామాలకంటే తక్కువ 1)కట్టావారిపాలెం (గుంటూరు) 50శాతం, సీతారాంపురం (క్రిష్ణా) 56శాతం, బండివారిగూడెం (ప.గో) 51శాతం, తెల్లబాడు (ప్రకాశం) 51శాతం, యస్.తిమ్మాపురం (తూ.గో) 43శాతం. అట్లాగే ఉత్తరకోస్తా గ్రామాల్లో - 1)జగ్గన్నపేట (విశాఖ) 37శాతం, 2) పట్టుపురం (శ్రీకాకుళం) 27శాతం. రాయలసీమ గ్రామాల్లో - 1)రేణుమాకులపల్లి (అనంతపురం) 36శాతం. కె.మార్కాపురం (కర్నూలు) 28శాతం, 3) రావులపల్లి (కడప) 32శాతం. మొత్తం రాష్ట్రంలో నూటికి 5 కుటుంబాలకు 30శాతం నుండి 90శాతం వరకు భూములు స్వతంగా వున్నాయి. నూటికి 5 కుటుంబాలకు 30శాతం భూములు వుండటం కూడా తక్కువ కేంద్రీకరణ యేమీకాదు.

అట్లాగే భూస్వాములు, ధనిక రైతులను కలిపి పరిశీలిస్తే దక్షిణ కోస్తా డెల్టా గ్రామాల్లో వీరు గరిష్టంగా భూములు కలిగి వున్నారు. కాని ఆ రెండు వర్గాలు కలిసి రోళ్లపాలెంలో 74శాతం, బొబ్బనపల్లిలో 65శాతం, చంపాడులో 60శాతం, కొత్తపల్లి (క్రిష్ణా)లో 55శాతం భూములు కలిగి వున్నారు.

**భూములులేని కుటుంబాలు :**

భూకేంద్రీకరణ పెరిగే కొద్దీ భూమిలేని కుటుంబాలు కూడా పెరుగుతాయి. కాబట్టి గరిష్ట భూకేంద్రీకరణ వున్న గ్రామాల్లోనే భూమిలేని కుటుంబాలు కూడా గరిష్టంగా వుంటాయి. మొత్తం కుటుంబాలలో భూమిలేని కుటుంబాలు రోళ్లపాలెంలో 90 శాతం (అంటే నూటికి 10కుటుంబాలకు మాత్రమే భూములు వుంటాయి. మిగిలిన 90 కుటుంబాలు భూమిలేని కుటుంబాలుగానే వుంటాయి.) చేదువాడ 89శాతం, చంపాడు 81శాతం, బొబ్బనపల్లి 85శాతం, జయపురం 72శాతం. కాని భూకేంద్రీకరణ తక్కువగా వున్న ప్రాంతాలలో గాని , జిల్లాలలో గాని భూమిలేని కుటుంబాలు కూడా తక్కువగానే వుంటాయి.

భూమిలేని కుటుంబాలు సగటున దక్షిణ కోస్తా గ్రామాల్లో 70 శాతం, ఉత్తరకోస్తా గ్రామాల్లో 40 శాతం, రాయలసీమ గ్రామాల్లో 33 శాతం వున్నాయి. రాష్ట్రం మొత్తం మీద సర్వే చేసిన గ్రామాల్లో భూమిలేని కుటుంబాల సగటు 57శాతం. అంటే రాష్ట్రంలో భూమిలేని కుటుంబాలు సగానికి పైగానే వున్నాయి. అంతేకాదు, భూమిలేని కుటుంబాలు మూడవ వంతుకంటే తక్కువగా యే ప్రాంతంలోను లేవు.

భూకేంద్రీకరణ పెరిగే కొద్దీ భూస్వాములు, ధనిక రైతుల ఆధిపత్యం పెరుగుతూ వుంటుంది. ఆధిపత్యం బహిరంగంగానే చలా

**"తెలంగాణాలో స్వంతభూమిపరంగా అసమానతలు ఆంధ్రకంటే తక్కువగా వున్నాయి. ఓ.సిలకంటే తక్కువవైనా తెలంగాణలో బి.సి.లకు కూడా భూములున్నాయి. వారిలో కూడా భూస్వాములు, ధనిక రైతులు తగిన సంఖ్యలో వున్నారు. కాబట్టే వారు రాష్ట్రస్థాయిలో కూడా తెలంగాణలో రాజకీయ ఆధిపత్యం కొరకు పోటీ పడగలుగుతున్నారు. అట్లాగే రాయలసీమలో కూడా కొంత వరకు అసమానతలు తక్కువగానే వున్నాయి."**

మణి అవుతూ వుంటుంది. ఉదాహరణకు నెల్లూరు జిల్లా ముత్తుకూరు మండలంలో తాళ్లపూడి, కర్నూలు జిల్లా ఆలూరు మండలంలో ముద్దనగెరే, కడప జిల్లా సుండుపల్లి మండలంలో సొంతంవారిపల్లి, గుంటూరు జిల్లా చుండూరు మండలంలో చిన్నగాదెలవర్రు గ్రామాలలో యీ ఆధిపత్యం, పెత్తందారీతనం కొట్టవచ్చినట్లుగా కనిపిస్తుంది.

**సామాజిక తరగతులు – స్వంతభూమి**

సామాజిక తరగతుల మధ్య కూడా భూపంపిణి తీవ్ర అసమానతలతో కూడుకొని వుంది. రాష్ట్రంలోని మొత్తం 37గ్రామాలలో పరిస్థితిని పరిశీలిస్తే 33 శాతం కుటుంబాలు గల యస్.సి. సామాజిక తరగతికి వున్నభూమి మొత్తం భూమిలో 7శాతం మాత్రమే. మరొక పక్క అగ్రకులాల కుటుంబాలు 22 శాతం మాత్రమే వున్నాయి. అయినా వారు స్వంతం చేసుకున్న భూమి మొత్తం భూమిలో సగానికి పైగా, అంటే 52శాతం వుంది. కాని బి.సి. తరగతికి భూములు తక్కువగా వున్నాయి. వారివి 41శాతం కుటుంబాలు. కాని వారికున్న భూమి 37శాతం మాత్రమే. బి.సి.లతో సమానంగా యస్.టి.లకు కూడా భూములు వున్నాయి. కాని అవి నిస్సారమైన పోడు భూములు.

కాని తెలంగాణాలో స్వంతభూమి పరంగా అసమానతలు ఆంధ్రకంటే తక్కువగా వున్నాయి. ఓ.సిలకంటే తక్కువవైనా తెలంగాణలో బి.సి. లకు కూడా భూములున్నాయి. వారిలో కూడా భూస్వాములు, ధనిక రైతులు తగిన సంఖ్యలో వున్నారు. కాబట్టే వారు రాష్ట్రస్థాయిలో కూడా తెలంగాణలో రాజకీయ ఆధిపత్యం కొరకు పోటీ పడగలుగుతున్నారు. అట్లాగే రాయలసీమలో కూడా కొంత వరకు అసమానతలు తక్కువగానే వున్నాయి. అక్కడ ఓ.సి. కుటుంబాలు 22శాతం వుంటే భూములు 44శాతం వున్నాయి అంటే, రాష్ట్రస్థాయి కంటే భూకేంద్రీకరణ కొద్దిగా తక్కువైనా యిక్కడ కూడా భూకేంద్రీకరణ వుంది. ఉత్తరకోస్తాలో 70 నుండి 80శాతం బి.సి. కుటుంబాలే. కాబట్టి అక్కడ భూ పంపకంలో అసమానతలు తక్కువగా కనిపిస్తాయి. కాని బి.సి. కులాల మధ్య భూపంపిణీలో తీవ్ర అసమానతలు వున్నాయి. వారిలో కాళింగులు, తూర్పు కాపులు, కొప్పుల వెలమలకు భూములు యెక్కువగా వున్నాయి. ఇవే అక్కడ ఆధిపత్య కులాలు. ఆర్థిక సామాజిక, రాజకీయ – అన్ని రంగాల్లో వారిదే ఆధిక్యత.

కాని దక్షిణ కోస్తా జిల్లాలలోని గ్రామాలు, అక్కడ వున్న భూపంపకం మిగిలిన ప్రాంతాల గ్రామాలకంటే చాలా భిన్నంగా వుంది. భూకేంద్రీకరణ చాలా యెక్కువ. 26 శాతంగా వున్న ఓ.సి. కుటుంబాలకు (ముఖ్యంగా కమ్మ, రెడ్డి, క్షత్రియ, కొంత వరకు కాపు) మొత్తం భూమిలో దాదాపు మూడు వంతుల భూమి, అంటే 72 శాతం వుంది. మిగిలిన అన్ని కులాలకు చెందిన 74శాతం కుటుంబాలకు 28శాతం భూమి మాత్రమే వున్నది. అంటే నూటికి 72శాతం భూములు అగ్ర కులాలకు వుంటే, మిగిలిన అన్ని కులాలకు కలిసి 28 శాతం భూమి మాత్రమే వుంది. ఈ ప్రాంతంలో యస్.సి.ల పరిస్థితి మరీ దారుణం. వారి కుటుంబాలు మొత్తం కుటుంబాలలో 44 శాతం ఉంటే వారికి మొత్తం భూమిలో 8శాతం మాత్రమే ఉన్నది. వీరికి కుటుంబానికి సగటున వున్నభూమి 18 సెంట్లు మాత్రమే. అది కూడా యెక్కువ యిళ్ల స్థలాల రూపంలో వుంది. అగ్రకులాల చేతిలో యింత పెద్ద యెత్తున భూమి కేంద్రీకరించబడి వుంది కాబట్టి, యీ ప్రాంతంలోనూ, రాష్ట్రస్థాయిలోనూ వారి ఆధిపత్యానికి తిరుగు లేకుండా వుంది.

**భూస్వాములు,**
**రైతులు అగ్ర కులాలవారే**

భూమి అగ్ర కులాల చేతిలో కేంద్రీకృతమై వుంది కాబట్టి దాదాపు భూస్వాములు, ధనిక రైతులు అంతా అగ్ర కులాలకు సంబంధించిన వారే వుంటారు. భూస్వాములలో ఓ.సి.లు 78 శాతం వుంటే బి.సి.లు 22శాతం మాత్రమే వున్నారు. ధనిక రైతులు కూడా ఓ.సిలలోనే యెక్కువగా వున్నారు. ఓ.సి.లలో వారు 72శాతం వుంటే, బి.సి.లలో వారు 26శాతం మాత్రమే వున్నారు. భూస్వాములలో యస్.సి, యస్.టిలు మచ్చుకైనా లేరు. కాని ధనిక రైతుల్లో మాత్రం యీ రెండు సామాజిక తరగతులు ఒక్కొక్క శాతం చొప్పున వున్నాయి. అగ్ర కులాలు మధ్య తరగతి రైతాంగాన్ని కూడా వదిలి పెట్టలేదు. వారిలో కూడా అగ్ర కులాలదే పైచేయి. మధ్య తరగతి రైతుల్లో ఓ.సి.లవి 59 శాతం కుటుంబాలు వుంటే బి.సి.లవి 35 శాతం కుటుంబాలు, యస్.సి,యస్.టిలవి మూడు శాతం కుటుంబాలు చొప్పున వున్నాయి. చిన్నకారు రైతులలో సైతం బి.సి.లకంటే ఓ.సిలే యెక్కువగా వున్నారు. బి.సి.లు 41 శాతం వుంటే ఓ.సీ.లు 45శాతం వున్నారు. అంటే ప్రధానంగా యస్.సి.లు, యస్.టి, బి.సిలలో సింహభాగం సన్నకారు రైతులు, వ్యవసాయ కార్మికులుగానే వున్నారు.

వ్యవసాయ రంగంలో ప్రవేశించిన పెట్టుబడిదారీ విధానం ఓ.సి.లకు సంబంధించిన రైతాంగంలో తీవ్రమైన అసమానతలు సృష్టించింది. వారు భూస్వాములు, ధనిక రైతులుగానే కాక మధ్య తరగతి రైతుల్లో 59 శాతం, చిన్నకారు రైతుల్లో 45 శాతం, సన్నకారు రైతుల్లో 27 శాతం వున్నారు. అంతేకాదు. వారు వ్యవసాయ కార్మికుల్లో కూడా 15 శాతం వున్నారు. బి.సి.లలో భూస్వాముల నుండి వ్యవసాయ కార్మికుల వరకు అన్ని తరగతులు వున్నాయి. వీరిలో కూడా వర్గ వ్యత్యాసాలు ఏర్పడ్డాయి. కాని అవి ఓ.సి.లలో వున్నంత తీవ్రంగా లేవు. యస్.సి,యస్.టిలలో కొద్దిగా మధ్య తరగతి, యెక్కువగా దిగువ తరగతుల రైతులు వున్నారు. వారిలో అత్యధికంగా వ్యవసాయ కార్మికులే వున్నారు.బి.సిలలో కూడా వ్యవసాయ కార్మికులే అధికం. వ్యవసాయ కార్మికులలో వారు దాదాపు40 శాతం వున్నారు. యస్.సిలు 43 శాతం వున్నారు. యస్.టి.లు 3 శాతం వున్నారు.

**నందివాడ :**

గ్రామ సర్వే మరియు సెటిల్‌మెంట్ రిపోర్టులను ఉపయోగించి ఆ గ్రామాల్లో భూసంబంధాలలో వచ్చిన మార్పులను కొందరు అధ్యయనం చేశారు. క్రిష్ణా జిల్లా నందివాడ అలాంటి గ్రామాల్లో ఒకటి. ఆ గ్రామానికి సంబంధించి 1866 నుండి 1999 వరకు లభించిన రిపోర్టులను శ్రీ యస్.యస్.దాసరి అధ్యయనం చేసి ఆ కాలంలో భూసంబంధాల్లో వచ్చిన మార్పులను గూర్చి వివరించారు. వారి

> “చారిత్రకంగా ఆ గ్రామంలోని భూముల లో యెక్కువ భాగం బ్రాహ్మణులవే. ఆ భూములను వారు రెడ్లు, పల్లె కాపులకు కౌలుకు యిస్తూ వుండేవారు. తరువాత విద్య,ఉద్యోగాల కొరకు బ్రాహ్మణులు పట్టణాలకు చేరారు. కాని దూరంగా వున్న తమ గ్రామంలోని కౌలు రైతులను అదుపులో పెట్టి కౌళ్లు వసూలు చేసుకోవటం వారికి కష్టమైంది. కాబట్టి క్రమంగా తమ భూములను కౌలురైతులకు, ముఖ్యంగా రెడ్లకు అమ్మారు.”

అధ్యయనం ప్రకారం 19వ శతాబ్దపు రెండవ భాగంలో ఆ గ్రామంలోని మొత్తం భూములలో సింహభాగం బ్రాహ్మణులకే వున్నాయి. కమ్మ,రెడ్డి కులాలకు కూడా కొద్దిగా భూములు వుండేవి. ఈ రెండు కులాలకు బ్రాహ్మణులు తమ భూములను కౌలుకు యిచ్చేవారు. వలస పాలనలో విద్య,ఉద్యోగ అవకాశాలు రావటంతో బ్రాహ్మణులు గ్రామాలను వదిలిపెట్టటం ప్రారంభమైంది. తరువాత కొంత కాలానికి కౌళ్లు సక్రమంగా వసూలు చేసుకోలేక తమ భూములను కౌలురైతులకు అమ్మటం ప్రారంభించారు. అట్లా క్రమంగా ఆ గ్రామంలోని భూములు బ్రాహ్మణుల నుండి కమ్మ, రెడ్డి కులాలకు రావటం జరిగింది.

స్వాతంత్ర్యం తరువాత 1960, 1970 దశకాల్లో భూసంస్కరణల చట్టాలు వచ్చాయి. తరువాత యీ రెండు కులాలు, ముఖ్యంగా కమ్మ కులస్తులు భూములను కొనటం మానుకున్నారు. అయినా హరిత విప్లవ ఫలాలను మాత్రం అనుభవించారు. దానితో వ్యవసాయంలో పెద్ద యెత్తున లాభాలు సంపాదించారు. వచ్చిన లాభాలను వ్యవసాయ అభివృద్ధికి ఉపయోగించకుండా పిల్లల చదువులకు, సినిమా హాళ్లకు, సినిమాలు తీయటానికి, రైస్ మిల్లుల ఏర్పాటుకు, హోటళ్లు పెట్టటానికి, రియల్ఎస్టేటు రంగంలో పెట్టుబడులుగా మార్చారు. ఆ విధంగా వారు ఆర్థిక నిచ్చెనలో పైకి చేరగలిగారు. ఈ కాలంలో తమ భూములను బి.సిలకు, కొంత వరకు యస్.సిలకు కూడా కౌలుకు యిచ్చారు. క్రమంగా వారిలో చాలామంది భూములు అమ్ముకొని పట్టణాలు, నగరాల్లో స్థిరపడ్డారు. అమ్మిన మేరకు ఆ భూములను యింత వరకు కౌలురైతులుగా ఉన్న బి.సిలు కొన్నారు. యస్.సిలు కూడా కొద్దిగా కొన్నారు.

అట్లా ప్రారంభంలో భూములన్ని ప్రధానంగా బ్రాహ్మణులవే. వారు విద్య,ఉద్యో గాల వెంటబడి తమ భూములు అమ్ముకున్నారు. అవి అప్పటి వరకు కౌలు రైతులుగా వున్న కమ్మ,రెడ్డి కులాలకు దక్కాయి. తరువాత వారు మరింత లాభసాటి వ్యాపారాల కొరకు పట్టణా లకు చేరి, తమ వద్ద కౌలురైతులుగా వున్న బి.సిలు, యస్.సిలకు తమ భూములు కొంత మేరకు అమ్మారు. ఆ విధంగా బి.సిలు, యస్. సి.లకు కొంత మేరకైనా భూములు దక్కాయి.

**అన్నారెడ్డిపాలెం :**

1960 నుండి 2000ల వరకు నెల్లూరు జిల్లాలోని అన్నారెడ్డిపల్లె గ్రామంలో వచ్చిన భూసంబంధాల్లోని మార్పుల గురించి ప్రొ॥అచ్చిరెడ్డి అధ్యయనం చేశారు.



విస్తరిస్తున్న రియల్ ఎస్టేట్ వ్యాపారం

చారిత్రకంగా ఆ గ్రామంలోని భూముల లో యెక్కువ భాగం బ్రాహ్మణులవే. ఆ భూములను వారు రెడ్లు, పల్లె కాపులకు కౌలుకు యిస్తూ వుండేవారు. తరువాత విద్య,ఉద్యోగాల కొరకు బ్రాహ్మణులు పట్టణాలకు చేరారు. కాని దూరంగా వున్న తమ గ్రామంలోని కౌలు రైతులను అదుపులో పెట్టి కౌళ్లు వసూలు చేసుకోవటం వారికి కష్టమైంది. కాబట్టి క్రమంగా తమ భూములను కౌలురైతులకు, ముఖ్యంగా రెడ్లకు అమ్మారు. 1970 తరువాత సంపాదనకు పట్టణాల్లో మంచి అవకాశాలు వచ్చాయి. బ్రాహ్మణుల భూములు కొన్న రెడ్లు తమ పిల్లల చదువులు, ఉద్యోగాలు, వ్యాపారాల కొరకు పట్టణాలకు చేరారు. వ్యాపారాలు ప్రారంభించారు. రవాణా రంగంలో ప్రవేశించారు. తమ భూములు పల్లె కాపులు, మాలలకు కౌలుకు యిచ్చారు. కౌలుసేద్యంలో మిగిలిన డబ్బుతో పల్లె కాపులు, మాల కులస్థులు కొద్దిగా రెడ్ల భూములు కొన్నారు. ఈ క్రమం కొనసాగి 2000 సంవత్సరానికి పల్లె కాపుల వద్ద గ్రామంలోని పెద్ద భాగం భూములు పోగు పడ్డాయి. మాలల్లో కొందరు కూడా చిన్న,చిన్న రైతులుగా మారారు. అంతకు ముందు యీ రెండు కులాల వారూ భూమిలేనివారే. తరువాత జరిగిన మార్పులతో యీ రెండు కులాల్లో కూడా భూమిలేని తనం తగ్గింది.

కాబట్టి యీ పరిణామం కూడా నందివాడలో జరిగిన పరిణామం మాదిరిగానే వుంది. ప్రారంభంలో భూమి బ్రాహ్మణులది. తరువాత శూద్రులలోని అగ్రకులాలకు (కమ్మ, రెడ్డి, కొంత వరకు కాపు) భూములు మారాయి. తరువాత పూర్తిగా కాకున్నా కొంత మేరకైనా వీరి నుండి బి.సిలకు భూములు దక్కాయి. యస్.సిలకు దక్కింది చాలా తక్కువ.

**ముగింపు :**

భూస్వాములు, ధనిక రైతులు కోట్లు సంపాదించడానికి పట్టణాలు, నగరాలకు వలస పోయిన కుటుంబాలు పోగా యింకా మిగిలిన కుటుంబాలు గ్రామాల్లోనే వున్నాయి. వారి భూములను కౌలుకిచ్చి గాని, కూలీలతో గాని సాగు చేస్తున్నారు. గ్రామాల్లో అన్ని రకాల వ్యాపారాలు వీరివే. మిగిలిన ప్రజానీకాన్ని అన్ని రకాలుగా దోపిడీ చేసేదివారే. అన్ని రంగాల్లో ఆధిపత్యం వీరిదే. వీరికి పాలక వర్గాలతో బలమైన లింకులు వున్నాయి. స్థానికంగా రాజకీయ అధికారం వీరిదే. వర్గాల పరంగా భూస్వాములు, ధనిక రైతులు ఆధిపత్య వర్గాల యితే సామాజికంగా వారే కమ్మ,రెడ్డి, కాపు కులాల రూపంలో దర్శనమిస్తారు. అగ్ర కులాలలో కూడా 27శాతం కుటుంబాలు వీరి దోపిడీకి గురి అవుతూ వుంటాయి. వీరి ఆధి పత్యాన్ని తొలగించకుండా పేదలకు విముక్తి లేదు.

ఈ మాసం ప్రత్యేకం

# మార్క్సిజం, జాతీయవాదం, అస్తిత్వ రాజకీయాలు


రచయిత
జెఎన్‌యు ప్రొఫెసర్

అర్చనా ప్రసాద్

ఇరవైయ్యవ శతాబ్దంలోని మంచి గుర్తింపు పొందిన పెట్టుబడిదారీ విధానపు చరిత్ర కారులలో ఒకరైన ఎరిక్ జె.హాబ్స్‌బామ్ శత జయంతి వేడుకలలో నేను పాల్గనే అవకాశం రావడం నా అదృష్టంగా భావిస్తున్నాను. కేరళ సాహిత్య అకాడెమీ హాబ్స్‌బామ్ శత జయంతిని, ఆయన రచనలను, జీవితానికి సంబంధించిన విషయాలను ఒక ప్రజా ఉత్సవం గా ఇంత పెద్ద ఎత్తున జరపడం ఆయన కృషికి తగిన నీరాజనంగా నేను భావిస్తున్నాను. ఎందుకంటే హాబ్సబామ్ కేవలం ఒక చరిత్ర కారుడు మాత్రమే కాదు. ఆయనొక ప్రజా చరిత్రకారుడు. ప్రపంచంలోని నలుమూలలలో ఉన్న కార్మికుల హక్కులను గొంతెత్తిచాటినవాడు, వాటికోసం పోరాడినవాడు. అన్నిదేశాలలో, సామ్రాజ్యవాదదేశాలలోని ఉద్యమాలలో, సమకాలీన సమాజంలో జరుగుతున్న మార్పులను తన ఆర్థిక, రాజకీయ అధ్యయనాల ద్వారా పరిశీలించినవాడు. విశ్లేషించినవాడు. ఉపజాతీయత, వర్గ స్వభావం లేని అస్తిత్వ ఉద్యమాలు, ప్రస్తుత సంక్షోభం, వివిధ రూపాలలో జరుగుతున్న అలజడులను,నిరసనలను విశ్లేషించడానికి హాబ్సబామ్‌లాంటి సమకాలీన మార్క్సిస్టు సిద్ధాంతవేత్తలు రూపొందించిన పద్ధతులను నా ఈ ఉపన్యాసంలో ఉపయోగించుకుంటాను. ఈ ఉద్యమాలలో అత్యధిక శాతం మెజారిటీ జాతీయవాదం సామాజిక గ్రూపులపై ఆధిపత్యం చలాయించడానికి, రాజకీయంగా మైనారిటీలను ఒంటరిపాటు చేసే ప్రయత్నాలకు వ్యతిరేకం గాను ఏర్పడ్డవే. పైగా నయా ఉదారవాద విధానాల ఫలితంగా పెరిగిన అసమానతలు ఎన్నో రకాల నిరసనలు వ్యక్తపరచడానికి కారణాలయ్యాయి. అందులో కొన్ని సాంస్కృతిక రూపం ధరించాయి. అంటే సంస్కృతి కూడా రాజకీయాలలో భాగమే. అది అంతర్గతంగా ఉండి, విభిన్న తరగతులను ఉద్యమాలలోకి సమీకరించటం ద్వారా వ్యక్తమవుతుంది. ఈ ఉపన్యాసంలో సమకాలీన రాజకీయ సంస్కృతిలో వర్గానికి, జాతీయతకు, అస్తిత్వ రాజకీయాలకు ఉన్న సంబంధాన్ని మార్క్సిస్టు దృక్పథంలో వివరించడానికి, దానికి పెట్టుబడిదారీ విధానానికి ఉన్న సంబంధాన్ని విశ్లేషించడానికి ప్రయత్నిస్తాను.

(1)

సంస్కృతి యొక్క రాజకీయ వ్యక్తీకరణ సమాజంలోని సామాజిక నిర్మాణంపై ఆధారపడి ఉంటుంది. ఆంటోనియో గ్రాంసి, ఎరిక్ హాబ్సబామ్, బెనెడిక్ట్ ఆండర్సన్ లాంటి మార్క్సిస్టు సైద్ధాంతికవేత్తలు పెట్టుబడిదారీ సమాజంలో జరుగుతున్న మార్పులను, రాజకీయఉద్యమాలలో సాంస్క అతిక వ్యక్తీకరణలను ఉపయోగించుకోవడాన్ని గురించి వివరించారు. ఉదాహరణకు హాబ్సబామ్ 'జాతుల పై' రాసిన తన రచనలో 1917 అక్టోబర్ విప్లవం తర్వాత రాజకీయాలు, సంస్కఅతుల స్వభావాల వ్యక్తీకరణలలో వచ్చిన మార్పులను వివరించారు. అందువలన రాజకీయ, సాంస్కఅతిక రూపాలు కేవలం బూర్జువా సమాజానికి మాత్రమే పరిమితమైనవిగా అనుకోలేము. గ్రాంసి తన ఆధిపత్యం, ప్రత్యాధిపత్యం సిద్ధాంతంలో సంస్కఅతికి, అధికారానికి, వర్గానికి మధ్య ఉన్న సంబంధాన్ని వివరించాడు. ఆ వెలుగులోనే హాబ్సబామ్, ఆండర్సన్ జాతీయత అంటే వేర్వేరు తరగతులకి భిన్నమైన అవవగాహన ఉంటుందని, అవి వారి రాజకీయ సంస్కఅతులలో వ్యక్తమవుతాయని అన్నారు. పశ్చిమ దేశాల పెట్టుబడిదారీ విధాన విస్తరణని అక్టోబర్ విప్లవం నిలవరించడం, ప్రతి జాతికీ 'నిర్ణయాధికార హక్కు' ఉన్నదనే సిద్ధాంతం ఆధారంగా రష్యా అనేక దేశాల సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాలకు లేదా వలస దేశాల నుండి జాతులు రాజకీయంగా విడిపోవడానికి మద్దత్తు నివ్వడం ఇందుకు ఉదాహరణగా చూపారు. బలహీన, అణచివేయబడిన దేశాల విముక్తి ఉద్యమాలకు ఊతం ఇవ్వడం ద్వారా బలమైన ఐక్య అంతర్జాతీయ పెట్టుబడిని బలహీన పరచవచ్చని, తద్వారా దానికి అంతర్జాతీయ కార్మికవర్గానికి మధ్య ఉన్న వైరుధ్యాన్ని తీవ్రం చేయవచ్చునన్న లెనిన్ ఆలోచనలతో వారు ఏకీభవించారు.

జాతీయవాదం యొక్క ఈ అవగాహనే పెట్టుబడిదారీ విధానాన్ని, రష్యా విప్లవానికి ముందు, ఆ తర్వాత అనే రెండు భాగాలుగా విడదీసింది. తద్వారా 'జాతి ,జాతీయవాదం ' అనేవి చారిత్రికంగా ఏర్పడ్డ రాజకీయ అంశాలే కానీ అనాదిగా బీజాలున్న, చారిత్రికంగా స్థిరపడిన సాంస్కృతిక అంశం కాదనే అవగాహన ఏర్పడింది. దీంతో లెనినిస్టు దఅక్పథాన్ని అధిగమించి విభిన్న వర్గాలు జాతి అన్న భావాలను ఎన్ని రకాలుగా వ్యక్తీకరిస్తారో తెలుసుకోవటం సాధ్యమైంది. జాతీయత, దేశం ఒకటే అని అత్యధికులు అనుకున్నా, అణచివేయబడిన తరగతులకు జాతంటే భిన్నమైన అభిప్రాయం ఉండవచ్చు. చాలాసార్లు ఈ రకమైన సాంస్కృతిక భావ ప్రకటన నిరసనల రూపం తీసుకుంటుంది. ఇవి అధిపత్యానికి వ్యతిరేక రూపు తీసుకోవచ్చు. కానీ తప్పనిసరిగా ప్రత్యేక జాతిగా రూపొందుతుందని చెప్పలేం. ఇవి సర్వసాధారణంగా 'అస్తిత్వవాద ఉద్యమాలుగా' పిలవబడుతుంటాయి. సామాజిక పరిస్థితుల ఆధారంగా ఇవి వివిధ రూపాలు తీసుకుంటూ ఉంటాయి. ఇలా చూసినప్పుడు 'జాతీయత' గాని 'అస్తిత్వ రాజకీయాలు' గాని ఒకే రకంగా ఉంటాయని అనలేము. పాలక వర్గాల అంతర్గత కుట్ర అనికూడా అనలేము. అక్టోబర్ విప్లవం తదనంతర కాలంలో ఈ రెండు రకాల ఉద్యమాలలో బూర్జువా వర్గంతో కార్మిక వర్గం ఆఖరి పోరాటం చేయ

డానికి చేసే సన్నాహాలైన పాక్షిక పోరాటాలలో ఈ రెండూ కార్మికవర్గానికి ఉపయోగపడతాయి. అంటే సైద్ధాంతికంగా ఆధిపత్య వ్యతిరేక ఉద్యమాలలో ఉపజాతీయత ఉండవచ్చు. కమ్యూనిటీ ఆధారంగా ఉన్న రాజకీయాలు ఉండవచ్చు. అయితే స్టాలిన్ రాసిన 'మార్క్సిజం జాతుల సమస్య'లో చెప్పినట్లు కార్మికవర్గం ఎంతవరకు ఐక్యమైందనే దానిపైనే ఆ ఉద్యమాల ఫలితం కార్మిక వర్గానికి దక్కటం ఆధారపడి ఉంటుంది. ఈ అవగాహనతో చూస్తే , జాతుల సమస్య చివరికి కార్మికవర్గ చైతన్యంపై ఆధారపడి ఉంటుందని తెలుతుంది. కార్మికవర్గ చైతన్యం సోవియట్స్ పై, అంటే సోవియెట్ యూనియన్ లోని కమ్యూనిస్టు పార్టీ చేసిన కృషిపై ఆధారపడి ఉంటుంది.

అక్టోబర్ విప్లవం తర్వాతి కాలంలో రాజకీయ సంస్కృతి యొక్క ఈ అవగాహన సమకాలీన పాలక వర్గం యొక్క జాతీయవాదం, అస్తిత్వ రాజకీయాల అవగాహనను ప్రశ్నిస్తున్నది. దేశం, అస్తిత్వం అన్నవి ఆధిపత్య బూర్జువా నియంత్రణలు అన్న ఆలోచనను కూడా ఒప్పు కోదు. రాజకీయ చైతన్యాన్ని భిన్నమైన మార్గాల ద్వారా విభిన్నమైన పద్ధతుల్లో అర్థం చేసుకోవ డానికి అవకాశాన్నిచ్చింది. జాతీయవాదం, అస్తిత్వం సామాజిక సాంస్కృతిక చైతన్యంగా పొరపడకూడదు. అవి అభివృద్ధి చెందుతున్న రాజకీయ చైతన్యం వ్యక్తీకరణలు. వాటి పరిధులు సాంస్కృతిక రూపాలు తన వర్గ ప్రయోజనాల పరిధిలో ఆ అస్తిత్వ ఉద్యమాలను నడుపుతున్న వర్గం నిర్ణయిస్తుంది. అందువలన ఈ ఉద్యమాలలో పాల్గనే సామాజిక తరగతులలోని శ్రమజీవుల వర్గ చైతన్యం, జాతీయత, అస్తిత్వ వాద ఉద్యమాల యొక్క రాజకీయ అభివ్యక్త స్వరూపంపై ఆధారపడి ఉంటుంది. గ్రాంసి అన్నట్టు ఈ ఉద్యమాలు విప్లవానికి అవసరమైన వర్గ పొందికను సమూలంగా మార్చలేకపోవచ్చు కానీ వర్గ వైరుధ్యాలను పెంచడానికి దోహద పడతాయి.

(2)

'భారతదేశం' అనే ఆధునిక ఆలోచన సామ్రాజ్యవాద వ్యతిరేక జాతీయోద్యమకాలం లోనే రూపు దిద్దుకుంది. గాంధీ రంగ ప్రవేశం చేయక ముందు జాతీయోద్యమం కొద్దిమంది మేధావులకే పరిమిత మయింది. గాంధీ ఉద్యమంలో అడుగు పెట్టిన తరువాత స్వతంత్ర పోరాటంలో రైతులు, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గనడం మొదలయింది. కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ ఉనికితో చర్చల క్రమంలో భారతదేశం భావన ఆవిర్భవించింది. వర్గ పోరాటాన్ని

> **❝జాతీయోద్యమాన్ని అసలైన సామ్రాజ్య వాద వ్యతిరేక ఉద్యమంగా మలచడమే మన ముందున్న తక్షణ కర్తవ్యం- విదేశీ శక్తుల కబంధ హస్తాల నుండి, దేశీయ దోపిడీ వ్యవస్థ నుండి విముక్తి చేయాలి. ఇందుకు ప్రస్తుతం ఉన్న బూర్జువా నాయకత్వా న్ని తప్పించి సోషలిస్టు విప్లవ నాయకత్వం కిందికి ఉద్యమాన్ని తేవాలి. ఇందుకు కాంగ్రెస్‌లోనే సంఘటితమైన మార్క్సిస్టు సోషలిస్టులు ఉండాలి. అంటే కేవలం మన పార్టీ మాత్రమే, ఇప్పు డున్న పరిస్థితులలో ఈ పని చేయగలదు.❞**

మరింత తీవ్రం చేయటానికి రాజకీయ స్వతంత్ర్యం పొందటాన్ని తొలిమెట్టుగా కార్మికవర్గం భావించింది.

"జాతీయోద్యమాన్ని అసలైన సామ్రాజ్య వాద వ్యతిరేక ఉద్యమంగా మలచడమే మన ముందున్న తక్షణ కర్తవ్యం– విదేశీ శక్తుల కబంధ హస్తాల నుండి, దేశీయ దోపిడీ వ్యవస్థ నుండి విముక్తి చేయాలి. ఇందుకు ప్రస్తుతం ఉన్న బూర్జువా నాయకత్వాన్ని తప్పించి సోషలిస్టు విప్లవ నాయకత్వం కిందికి ఉద్యమాన్ని తేవాలి. ఇందుకు కాంగ్రెస్‌లోనే సంఘటితమైన మార్క్సిస్టు సోషలిస్టులు ఉండాలి. అంటే కేవలం మన పార్టీ మాత్రమే, ఇప్పుడున్న పరిస్థితులలో ఈ పని చేయగలదు. ఈ పార్టీ పని చేయడానికి దేశంలోని సామ్రాజ్య వాదవ్యతిరేక శక్తులన్నిటిని కూడ గట్టాలి". కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ ప్రారంభమైన 50 వ వార్షికోత్సవం సందర్భంగా ఇ.ఎం.ఎస్ నంబూద్రిపాద్ మార్క్సిస్టు కు రాసిన వ్యాసం నుండి ఉటంకింపు :

కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ ఏర్పాటు చేయడం వలన కాంగ్రెస్‌ను మరింత తీవ్రవాద సంస్థగా మార్చటంలో మొదటి అడుగని, ముఖ్యమైన ప్రజలు భాగస్వాములయే రాజకీయాలను కాంగ్రెస్ వెలుపలనే నిర్వహించుకోవచ్చునని నంబూద్రిపాద్ భావించారు. కాంగ్రెస్ కార్యక్రమాన్ని మరింత తీవ్రంగా మార్చటానికి, ఆ పార్టీపై ఒత్తిడి పెంచటానికి సిఎస్‌పిలో చురుకుగా ఉన్న కమ్యూనిస్టులు కార్మిక సంఘాలు, రైతు సంఘాలు నిర్మించటం ద్వారా కృషిచేశారు. బ్రిటిష్ సామ్రాజ్యం నుండి వైదొలగి సంపూర్ణ స్వతంత్రం పొందటం, సోషలిస్టు సమాజాన్ని ఏర్పాటు చేయటం సి.ఎస్.పి లక్ష్యంగా పెట్టుకుంది. కాంగ్రెస్ లోపల సోషలిస్టు కార్యక్రమాన్ని ఆమోదింపజేసుకోవాలని లక్ష్యంగా పెట్టుకుని రైతులను, కార్మికులను సంఘటితం చేయటానికి ప్రణాళిక వేసుకుంది. ఆ రకంగా స్వాతంత్రం కోసం ఒక శక్తివంతమైన ప్రజా ఉద్యమం నిర్మించాలనుకుంది.

హిందూస్తాన్ సోషలిస్టు రిపబ్లికన్ అసోసియేషన్ కార్మిక వర్గ దృక్పథం నుండి జాతీయతకు మరో నిర్వచనం చెప్పింది.' విప్లవం కోసం పని చేయడం అంటే విదేశీ ప్రభుత్వాలతో సాయుధ పోరాటం కోసం పనిచేయడం, వారికి వ్యతిరేకంగా ప్రజలను, మద్దతుదారులను కూడగట్టడం మాత్రమే కాదు. ఒక కొత్త సమాజం కోసం కృషి చేయడం. పెట్టుబడిదారీ సమాజానికి గోరీ కట్టడం. వర్గ విభేధాలను, ప్రత్యేకహక్కులను విప్లవం అంతం చేయాలి. వీటన్నింటికంటే ముఖ్యమైనది కార్మికవర్గ నియంతృత్వాన్ని స్థాపిచడం. సామాజిక పీడకులను అధికార పీఠం నుండి తరిమి కొట్టడం. 'హిందూస్తాన్ సోషలిస్టు రిపబ్లికన్ అసోసియేషన్ సిఎస్‌పి, గాంధీ ఎత్తుగడలపై అసంతృప్తితో ఉన్నప్పటికీ, కమ్యూనిస్టులు కాంగ్రెస్ బూర్జువా నాయకత్వం పై సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా జరుగుతున్న ప్రజా ఉద్యమాలకు మద్దతు ఇచ్చేవిధంగా కాంగ్రెస్‌పై రాజకీయ ఒత్తిడిని పెట్టగలిగారు. కాన్స్టిట్యూషన్ అసెంబ్లీ ఏర్పడటం, రాజ్యాంగాన్ని రూపొందించే సూత్రాలను ప్రభావితం చేయటం ఈ పరిణామాల వలన సాధ్యమైంది.

విశాల దృక్పథంతో చూస్తే ఉదారవాద బూర్జువా ప్రజాతంత్రవాద మౌలిక తాత్వికత రాజ్యాంగంలో ప్రతిఫలించినా దాని మౌలిక స్వరూపం మాత్రం సాంస్కృతిక జాతీయవాదం కాదు. నిజానికి ఏళ్లు గడుస్తున్నా కొద్దీ అది విశ్వజనీన స్వభావాన్ని సంతరించుకుంది. కార్మిక వర్గానికి పోరాడేందుకు కొన్ని ఆయుధాలను సమకూర్చి పెట్టింది. ముఖ్యంగా ఉమ్మడి బేరసారాల హక్కుల లాంటి కొన్ని మార్గదర్శక సూత్రాలను ఏర్పరచింది. సాంస్కృతిక భిన్నత్వాన్ని గుర్తించింది. అదే సమయంలో రాజ్యాంగ అసెంబ్లీ లో చెప్పుకోదగ్గ స్థాయిలో కమ్యూనిస్టులు లేకపోవడం వలన బయటికి సోషల్ డెమోక్రాటిక్ భావాలు వ్యక్తమౌతున్నప్పటికీ బూర్జువావర్గానికి అనుకూలమైన పత్రం తయారయింది. ఏ మేరకైనా రాజ్యాంగంలో

> **"దీర్ఘ కాలంలో అధికార నిర్మాణంలోని చివర అంచుల్లో అణగారిన తరగతులలోని అత్యధికులు చేరిపోయారు. అంతేకాక పెట్టుబడిదారీ వ్యవస్థలోని వివిధ స్థాయిలలో కూడా చేరారు. దీని ప్రభావం ఆ తరగతులపై పడడం, వారు వర్గ రాజకీయాలకు దూర మవడం జరిగింది. వారిలోని చదువుకున్న ఉన్నత వర్గాల వారు 'ఆదివాసీ' 'దళిత అస్తిత్వాలకి' వేదికలను నిర్మించారు. ఈ రాజకీ యాలు ప్రత్యర్థులుగా ఉన్నట్టు పైకి కనిపించినా వాస్తవంలో ఆధి పత్య వర్గానికి ప్రత్యర్థులుగా ఉండవు."**

కార్మిక వర్గ అనుకూల విధానాలు రూపొందా యంటే దానికి కారణం కమ్యూనిస్టులు.

అయితే దాని ప్రభావం అసమతుల్యంగా ఉండడానికి అనేక సెక్షన్ల ప్రయోజనాలు ఇందులో చేర్చబడక పోవడమే కారణం. ఇది సాంస్కృతిక లేక అస్తిత్వ రూపాలలో నిరసనలు తెలియజేయటానికి దారితీసింది. ఈ సాంస్కృతిక అభివ్యక్తీకరణలే 20వ శతాబ్దం మొదటి భాగంలో దళితుల, ఆదివాసీల లేదా అనేక ఇతర తరగతుల ప్రయోజనాల కొరకు వారిని ఆధునిక రూపాలలో కదిలించగలిగిన ప్రబల మైన శక్తులు. ఆ తరువాత కాలంలో అవి రాజకీయ గుర్తింపులను అభివృద్ధి చేసుకుని పాలక వర్గాల రాజకీయాలను, ముఖ్యంగా వారిపై రుద్దబడుతున్న మెజారిటీ అస్తిత్వ ప్రయోజనాలను వ్యతిరేకించడం మొదలు పెట్టాయి. హిందూ జాతీయవాదులు వారి రాజకీయ నిర్మాణాలను బీహార్, గుజరాత్ వంటి రాష్ట్రాలలో 1970 దశకం తరువాతి కాలంలో పునరుద్ధరించుకున్న తర్వాత, ఇది మరింత ముందుకొచ్చింది. అస్తిత్వ రాజకీయాలు ముఖ్యంగా భారతదేశ కేంద్రభాగంలో, మెజారిటీ సంస్కృతికి వ్యతిరేకంగా జరిగినవే. వెనుకబడిన తరగతులలో ఉన్నతస్థాయికి చేరిన వారిని తమ లో ఇముడ్చు కోవడానికి ప్రయత్నం చేశారు. సమాజంలో పెరుగుతున్న అసమానతలకు వ్యతి రేకంగాను, ఆధిపత్య శక్తులు ఈ తరగతులలోని ఉన్నత వర్గాన్ని తమ ఆధిపత్య నిర్మాణంలో ఇముడ్చుకునేందుకు చేసిన ప్రయత్నాలకు వ్యతిరేకంగా జార్ఖండ్ ఆదివాసీలు ఆందోళనలు జరిపారు. ఇందుకు వ్యతిరేకంగా ఏర్పడ్డదే దళిత్ పాంథర్ పార్టీ.

అస్తిత్వాలలోని భిన్నత్వమే కాక, ఆయా తరగతుల ప్రయోజనాలు కాపాడుకోవడంలో వారి రాజకీయ చైతన్యం, వివిధ తరగతుల కార్మికవర్గ డిమాండ్లకు బూర్జువా రాజ్యం ప్రతిస్పందిస్తున్న తీరుని బట్టి వారి ఉద్యమాలు ఉంటాయి. వెనుకబడిన వారి పోరాటాల ఫలితంగా వచ్చిన కొన్ని ప్రయోజనాలను ఈ సందర్భంలో మనం చెప్పుకోవచ్చు. దీర్ఘ కాలంలో అధికార నిర్మాణంలోని చివర అంచు ల్లో అణగారిన తరగతులలోని అత్యధికులు చేరిపోయారు. అంతేకాక పెట్టుబడిదారీ వ్యవస్థలోని వివిధ స్థాయిలలో కూడా చేరారు. దీని ప్రభావం ఆ తరగతులపై పడడం, వారు వర్గ రాజకీయాలకు దూరమవడం జరిగింది. వారిలోని చదువుకున్న ఉన్నత వర్గాల వారు 'ఆదివాసీ' 'దళిత అస్తిత్వాలకి' వేదికలను నిర్మించారు. ఈ రాజకీయాలు ప్రత్యర్థులుగా ఉన్నట్టు పైకి కనిపించినా వాస్తవంలో ఆధిపత్య వర్గానికి ప్రత్యర్థులుగా ఉండవు. వారికి వర్గ దృష్టి లేకపోగా నయా సాంప్రదాయాల ప్రభావంలో ఉంటారు. అన్ని రకాల ఆధునిక భావాలకి వ్యతిరేకంగా ఉంటారు. మార్క్సిస్టు విశ్లేషణ ఈ దళిత ఆదివాసీ అస్తిత్వ వాదులకి లేకపోవడం వలననే వారు అసమానతలను రూపుమాపలేకపోతున్నారు. పైగా ఆయా తరగతులలో కూడా అసమానతలు పెరిగిపోతు న్నాయి. నేటి పెట్టుబడిదారీ విధానంలో 'కార్మిక సైన్యం' పెరుగుతూ పోతున్నది. అంటే అస్తిత్వ ఉద్యమాలు వర్గ వైరుధ్యాన్ని పరిగణించక పోవడం వలన ఆ తరగతులలో కొందరు మాత్రమే ప్రయోజనం పొందగలుగుతున్నారు. రాజకీయంగా సామాజికంగా సమాజంలో మౌలిక మార్పులను తీసుకు వచ్చే చైతన్యాన్ని ఈ ఉద్యమాలు పెంచలేక పోతున్నాయి.

పైగా ఈ అస్తిత్వాలు ఆదిమ సమాజం లోని 'సమానత్వానికి' ప్రాతినిధ్యం వహించేవి కూడా కావు. ఇవి కేవలం పెట్టుబడిదారీ వ్యవస్థలోని సామాజిక సాంస్కృతిక రూపాల వ్యక్తీకరణలు. దీనిని ప్రస్తుత వామపక్ష, ప్రజా తంత్ర ఉద్యమాలు గమనించాలి. ఈ ఉద్యమాలు ఎన్నో సంవత్సరాల ప్రజాతంత్ర పోరాట ఫలితాలు అయినందువలన వామపక్షాలు వారి యెడల సదభిప్రాయం కలిగి ఉండాలి. చదువు, ఉద్యోగాలలో అణగారిన తరగతులకు సమాన అవకాశాలు ఉండాలన్న డిమాండ్లు వామపక్ష ప్రజాతంత్ర శక్తులు నిర్వహించే పోరాటాలలో ప్రధానంగా ప్రతిధ్వనించాలి.

(3)

ఇటువంటి సంక్లిష్ట రాజకీయ పరిస్థితు లలో వామపక్షాలు జరుపుతున్న పోరాటాలు, వారు వివిధ రాష్ట్రాలలో అధికారంలోకి రావడం, వర్గ ప్రాతిపదికపై జరుగుతున్న పోరాటాలకు, ఆయా సామాజిక గ్రూపుల ఆధ్వర్యంలో జరిగే పోరాటాలకు మధ్య గల సంబంధాన్ని పునః పరిశీలించుకునేటట్టు చేసింది. ఇందుకు ఉదాహరణలు రెండో ప్రపంచ యుద్ధ కాలంలోనూ ఆ తర్వాత 1950, 60 లలో జరిగిన పోరాటాలు, ముఖ్యంగా తెలంగా ణా పోరాటం, తెబాగా. వర్లి పోరాటాలను చెప్పుకోవచ్చు. ఇందులో కూడా వర్లి తిరుగు బాటు, స్వాతంత్రం తరువాత త్రిపురలో సంఘా ల నిర్మాణం గనక పరిశీలించటం వర్గం, సామా జిక గ్రూపుల మధ్య సంబంధాన్ని అధ్యయనం చేయడానికి ఉపయోగకరంగా ఉంటుంది.

దళిత, ఆదివాసీల సంఘ నిర్మాణం వారి ఉమ్మడి అవగాహన పెరగటానికి, రైతు,


## 'మార్క్సిస్టు' పై మీ అభిప్రాయాలు తెలపండి!

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్దిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తున్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించాల్సిన అంశాలున్నా, అదనపు సమాచారమున్నా క్లుప్తంగా రాసి పంపండి.

మీ లేఖలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్, మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ఎం.బి. విజ్ఞానకేంద్రం,**

**డోర్ నెం. 27-30-3, ఆకులవారి వీధి, గవర్నర్‌పేట, విజయవాడ-520 002**

**"1982లో వ్యవసాయ కార్మిక సంఘం ఏర్పడి తన విధాన ప్రకటనలో 'వ్యవసాయ కార్మికులు వ్యవసాయోద్యమంలో అత్యంతకీలక పాత్ర పోషిస్తారు. రాజకీయంగా ఆర్థికంగా వారు అత్యంత దారుణంగా దోచుకోబడు తున్నారు. పట్టణాలలోని కార్మిక వర్గానికి రైతాంగానికి మధ్య వారు వారధుల్లా ఉంటారు. అందులో అత్యధికులు సామాజికంగా వెనుకబడిన తరగతులైన దళితులూ, గిరిజనులే కావడం గమనార్హం."**

కార్మికవర్గాల మధ్య ఐక్యత పెరగడానికి దోహద పడుతుంది. అందువలన కొన్ని తరగతుల ప్రయోజనాలను విస్తృతస్థాయిలో జరిగే వర్గ పోరాటాలలో చేర్చటం వామపక్ష, రైతు ఉద్యమాలలో ముఖ్యాంశం అయింది. ఈ అవగాహనతోనే చారిత్రికంగా అణచి వేయబడిన ఆదివాసీలలో ప్రజాతంత్ర చైతన్యం పెంపొందించడానికి 1970ల తర్వాత కమ్యూనిస్టు ఉద్యమం కృషి చేసింది. సాంప్రదాయకంగా ఉన్న జాతి చైతన్యంఆధునిక రాజకీయ ఉద్యమంగా మలచబడాలి. ఈ ఉద్యమంలో మిగిలిన వారిని వేరు చేయాల్సిన పని లేదు. ఆరవ షెడ్యూలు అమలు చేయాలని సమరశీలంగా సాగించిన గణ ముక్తి పరిషత్ పోరాటాన్ని ఇందుకు ఉదాహరణగా చెప్పుకోవచ్చు. ఇందులో బెంగాలీలు ఆదివాసీలు కలిసి పోరాడారు. అలాగే ఆదివాసీ ప్రగతి మండల్ థానేలో కొన్ని విద్యాసంస్థలు నడుపుతూ ఆదివాసీలను ఆధునిక జన జీవనంలో మిళితం చేసేందుకు నిర్మాణాత్మక క అషి చేస్తున్నది. ఈ రెంటి మధ్య నున్న వైరుధ్యం రెండు రకాలుగా ఉపయోగపడుతుంది. మొదటిది, ఇవి ఆయా తరగతులలో వారి ప్రయోజనాలను గుర్తించడానికి ఉపయోగపడతాయి. రెండు అనేక శతాబ్దాలుగా అణచివేయబడుతున్న వారిలో వర్గ చైతన్యం కలిగిన స్థాయి. ఆదివాసీ ప్రగతి మండల్ ట్రస్ట్ స్థాపించినది థానేలోని కిసాన్ సభ. వారి పోరాటాలను కూడా కిసాన్ సభ ద్వారానే నిర్వహించారు. అయితే దీనిలోని సభ్యత్వానికి ఆదివాసీలు, ఆదివాసీలు కానీ వారు కూడా అర్హులే. కానీ ఈ రెండు సంఘాల మధ్య సయోధ్య ఇంకా ఏర్పడవలసి ఉంది. అందుకు కారణం కిసాన్ సభ ఆ ప్రాంతంలోని కష్టకారి సంఘటన అనే ఆదివాసీల సంఘంతో పోటీ పడుతున్నది. త్రిపురలో కూడా వామపక్షాలు మద్దతిచ్చే గణ ముక్తి పరిషత్,త్రిపుర ఉపజాతి యువ సమితి పోటీకి దిగాయి. త్రిపుర ఉపజాతి యువ సమితి ఆదివాసీ అస్తిత్వ వాదానికి మద్దతు పలుకుతూ, ప్రత్యేక రాష్ట్రం కోరే సంస్థ. మరో వైపు పరిషత్ బెంగాలీలు, ఆదివాసీల మధ్య ఐక్యత కోరే సంస్థ. ఆదివాసీలలో ప్రజాతంత్ర చైతన్యం పెరగడానికి క అషి చేస్తున్న సంస్థ.

1980లతరువాత ఏర్పడిన వ్యవసాయ కార్మిక సంఘం దళితులను, ఆదివాసీలను గ్రామీణ కార్మికులుగా గుర్తించింది. కార్మిక, కర్షక ఐక్యతలో జటిలతను అర్థం చేసుకునే ప్రయత్నం చేసింది. 1982లో వ్యవసాయ కార్మిక సంఘం ఏర్పడి తన విధాన ప్రకటనలో 'వ్యవసాయ కార్మికులు వ్యవసాయోద్యమంలో అత్యంతకీలక పాత్ర పోషిస్తారు. రాజకీయంగా ఆర్థికంగా



వ్యవసాయ కార్మికులు

వారు అత్యంత దారుణంగా దోచుకోబడు తున్నారు. పట్టణాలలోని కార్మిక వర్గానికి రైతాంగానికి మధ్య వారు వారధుల్లా ఉంటారు. అందులో అత్యధికులు సామాజికంగా వెనుకబడిన తరగతులైన దళితులూ, గిరిజనులే. 'వ్యవసాయ కార్మికులు ప్రత్యేక వర్గం అయినందువలన వారిని ప్రత్యేకంగా సంఘటిత పరచవలసిన అవసరం ఉన్నదని చెప్పింది. దళిత, ఆదివాసీ వ్యవసాయ కార్మికులను రైతాంగంతో ఐక్య పరిచేందుకు ఈ పోరాటాలు ఉపయోగ పడతాయి. భూ సంస్కరణలు, సార్వజనీన సామాజిక రక్షణ వంటి డిమాండ్లు గ్రామీణ, పట్టణ కార్మికులందరి ఉమ్మడి డిమాండ్లే.

(4)

గత రెండు దశాబ్దాలలో హిందూ సాంస్కృతిక జాతీయవాదం వేగంగా పెరగడంతో, ఆధిపత్య పాలక వర్గ జాతీయవాదం కమ్యూనిస్టులకు ఒక పెద్ద సవాలుగా మారింది. మొదటిది, హిందూ రాష్ట్రం అన్నది చారిత్రికంగా ఒక సాంస్కృతిక భావం. చరిత్రకారులు అనేక చారిత్రిక పరిశోధనలు చేసి, హిందూ సమాజం లేదా హిందూ జీవన విధానం అంటూ ప్రత్యేకమైనది ఏదీ మౌర్య సామ్రాజ్యానికి ముందు కూడా లేదని తేల్చారు. ఒకరి తర్వాత ఒకరు పాలకులందరు మతం పేరుతో పంటలో మిగిలిన ధాన్యాన్ని, నగదుని వసూలు చేసుకున్నారు. సైనిక సేవలకు పనిచేయగల ప్రజలను బానిసలుగా చేసుకున్నారు. ఈ అణచివేతలో మతాన్ని సైద్ధాంతిక శక్తిగా ఉపయోగించుకున్నారు. మతాన్ని రాజ్యం భౌతిక సాధనంగా ఉపయోగించుకున్న విషయాన్ని ఒప్పుకోక పోవడం వలన హిందుత్వ వాదులు తమ స్వార్థం కోసం చరిత్రను తప్పుదోవ పట్టిస్తున్నారు. తప్పుగా ఉపయోగించుకుంటున్నారు.

రెండో వాదన, ఆధ్యాత్మిక ప్రజాస్వామ్యం, అందరిని ఇముడ్చుకోవడం హిందుత్వ జాతీయ వాదంలో ఉన్నదని చెప్పడం. 1980ల నుండి హిందుత్వవాదులు వారి సామాజిక పునాదిని పెంచుకోకుండా అధికారాన్ని హస్తగతం చేసుకోలేమన్న వాస్తవాన్ని గుర్తించారు. అందుకనే ఆర్ఎస్ఎస్ దాని అనుబంధ సంఘాలు దళితులు ఆదివాసీలలో పనిచేయడం ప్రారంభించాయి. ఉదాహరణకి ఉత్తర భారతదేశంలోని దళితులను తిరిగి హిందూమతంలోకి మారమని, తద్వారా జనజీవనంలోకి రమ్మని ఒత్తిడి చేయడం ప్రారంభమయింది. 2015లో ఆర్ఎస్ఎస్ మరో ముందడుగు వేసి స్థానికస్థాయిలో వర్ణ వివక్షను రూపు మాపాలని పిలుపునిచ్చింది. ఆర్ఎస్ఎస్ చరిత్రలోనే మొట్ట మొదటి సారిగా జిల్లా స్థాయిలో మీటింగులు పెట్టి 75,000 గ్రామాల వలం టీర్లకు శిక్షణ ఇచ్చింది. ఇందులో అత్యధిక భాగం ఎన్నికలు జరగనున్న పంజాబ్, ఉత్తరప్రదేశ్ లలోనే కేంద్రీకరించబడ్డాయి. మన కొచ్చిన వార్తల ప్రకారం ఈ కమిటీలు గ్రామాలలో ఉన్న ఉన్నత కులాలతో ఏర్పాటుచేసి వారితోనే 'ఒక గ్రామం ఒక బావి, ఒక స్మశానం' అనే నినాదాన్ని ఇప్పించాయి. అంటే తాము వర్ణ వ్యవస్థకి వ్యతిరేకమనే భావన ప్రజలలో కలగాలి. తమ కార్యక్రమాన్ని న్యాయబద్ధం చేసుకోవడానికి సంఘ్ సైద్ధాంతిక వేత్తలు అంబేద్కర్‌ని కమ్యూనిస్టు, ముస్లిం వ్యతిరేకిగా పునర్వ్యాఖ్యానించడానికి పూనుకున్నారు.

> **"ఆదివాసీల అస్తిత్వ రాజకీయాలకు సంబంధించి కూడా ఇదే తరహా కార్యక్రమాలు జరిగాయి. గిరిజన ప్రాంతంలో ఆర్‌ఎస్‌ఎస్ కార్యక్రమం, విధానాలు స్థూలంగా మూడు స్థాయిలలో జరిగాయి. ప్రతిస్థాయి తర్వాతి స్థాయికి పునాదిగా పనిచేసింది. ప్రస్తుతం ఆర్‌ఎస్‌ఎస్ గిరిజన రాజకీయాలను తీవ్ర మితవాదం వైపు మళ్లిస్తున్నది."**

అంబేద్కర్ 125 వ జయంతి ఉత్సవ సందర్భంగా అంటరాని తనం, వర్ణ వివక్ష ఉన్న హిందూ సమాజ నిర్మాణమే అనర్థాలకు మూలమనుకునే దళిత ఉద్యమాన్ని నీరుగార్చడానికి, ఆర్‌ఎస్‌ఎస్ అంబేద్కర్ని సామాజిక సామరస్యానికి, ఐక్య హిందూ సమాజానికి ప్రతీకగా చిత్రించే ప్రయత్నం చేసింది. ఉన్నత వర్గాలు చూపుతున్న బాటలో దళితులు నడుస్తారని వారి నీతి సూత్రాలు పాటిస్తారని ఉన్నత వర్గాలకిఆర్‌ఎస్‌ఎస్ మాటిచ్చింది. ఇందుకుగాను ఆర్‌ఎస్‌ఎస్ 2016 లో తన 40 అనుబంధ సంఘాలను సమన్వయం చేసే కమిటీని వేసి రాజకీయ, సామాజిక అంశాలపై ప్రచారం నిర్వహించింది. ఇది జాతవ్‌లు లేని బహుజన్ సమాజ్ పార్టీని లక్ష్యంగా చేసుకుని పని చేసింది. 2016లో ఉత్తర్‌ప్రదేశ్ ఎన్నికలలో దీని ఫలితాలను చూశాం.

ఆదివాసీల అస్తిత్వ రాజకీయాలకు సంబంధించి కూడా ఇదే తరహా కార్యక్రమాలు జరిగాయి. గిరిజన ప్రాంతంలో ఆర్‌ఎస్‌ఎస్ కార్యక్రమం విధానాలు స్థూలంగా మూడు స్థాయిలలో జరిగాయి. ప్రతిస్థాయి తర్వాతి స్థాయికి పునాదిగా పనిచేసింది. ప్రస్తుతం ఆర్‌ఎస్‌ఎస్ గిరిజన రాజకీయాలను తీవ్ర మితవాదం వైపు మళ్లిస్తున్నది. గిరిజన సంస్థలను, నిర్మాణాన్ని ఆర్‌ఎస్‌ఎస్ అనుబంధ సంఘాలు కబళించే ప్రయత్నంలో ఉన్నాయి. గిరిజన ప్రాంతాలలో హిందూ జాతీయవాద ప్రభావం 1940 లలోనే ప్రారంభమయింది. 1930 లోనే హిందూ మహాసభ ప్రభావంతో అనేక హిందూ రాజ్యాలు మత మార్పిడులకు వ్యతిరేకంగా చట్టాలు చేశాయి. 1940 ల మధ్యకి వచ్చేసరికి కాంగ్రెస్ లోను, బయట కూడా క్రిస్టియన్ మిషనరీల మతమార్పిడులను నిలువరించాలన్న ఒత్తిడి పెరిగింది. ఫలితంగా నియోగి_కమిటీ అయిదవ షెడ్యూల్ ప్రాంతాలలో మతమార్పిడులను నిషేధించింది. ఆర్‌ఎస్‌ఎస్



భారత్‌లో గిరిజనులు

యొక్క వనవాసి కళ్యాణ్ పరిషద్ 1950 లలో భారతదేశంలో అడుగు పెట్టడానికి ఇదే నాంది అయింది. 1970,80లలో ఘర్ వాపసీ కార్యక్రమానికి ఇది పునాదిగా పనిచేసింది. ఇది భారతదేశంలోని అన్ని కులాలు, ఆదివాసీలు ఒక హిందూ జాతి అనే భ్రమ కల్పించడానికి రాజకీయ హిందూ జాతీయవాదం తెరపైకి వచ్చింది. బీజేపీ రాజకీయ పునాది విస్తరించి అందులో దళితులూ, ఆదివాసీలు, ఓబిసిలు చేరడానికి ఇదే ప్రాతిపదిక అయింది. ఈ రకంగా తన సామాజిక పునాదిని విస్తరించుకోడం ద్వారా ఆర్‌ఎస్‌ఎస్ గిరిజనుల దళితుల సంస్థల్లోకి చొచ్చుకునిపోయి వారిలో కేంద్రీకరణలకి అడ్డుపడగలుగుతున్నది. ఇది 2008లో జరిగిన కంధమాల్ అల్లర్లలో చూడవచ్చు. అక్కడ సంఘ్ మతమార్పిడులు చేసుకున్న గోండులకు షెడ్యూల్ తెగల ప్రయోజనాలు అందకూడదని సమీకరణాలు చేసింది. ఆ తరువాత 2012లో కోక్రాఝూర్‌లో బంగ్లాదేశ్ ముస్లిం శరణార్థులపై బోడో ఉగ్రవాదులు దాడి చేసారు. ఈ విధంగా ఆర్‌ఎస్‌ఎస్ గిరిజన అస్తిత్వ రాజకీయాలకు అనుగుణంగా తన విధానాలు మార్చుకోగలిగింది . క్రిస్టియన్లు కానివారు ముందు ఆర్ ఎస్‌ఎస్‌తో కలిశారు. ఆ తరువాత క్రిస్టియన్‌ల ప్రభావంలో ఉన్న నాయకులకు కూడా ఆర్‌ఎస్‌ఎస్ చెంతకి చేరక తప్పలేదు. ఆవిధంగా "ముస్లింలకు, క్రిష్టియన్లకు," 'వేర్పాటువాద 'రాజకీయాలకు, అస్తిత్వ రాజకీయాలకు వ్యతిరేకమంటూ హిందుజాతీయ వాదాన్ని తమకు అనుగుణంగా ఆర్‌ఎస్‌ఎస్ మలుచుకుంటున్నది.

ఈ వాదనను కార్పొరేట్ల మద్దత్తు ఉన్న హిందూ జాతీయవాదులు, పాలక పార్టీ పదే పదే చేస్తున్నది. ఇది బెనెడిక్ట్ ఆండర్సన్, హాబ్సబౌమ్ చేస్తున్న వాదనలకు సరిపోతున్నది. నిజానికి పశ్చిమ యూరప్ దేశాలలో కూడా జాతీయవాదం మొదట్లో జాతి రాజ్యాల నాయకత్వంలోనే పెట్టుబడిదారుల ప్రయోజనాలు కాపాడడం కోసం జరిగింది. అక్టోబర్ విప్లవం తరువాతే ఈరోజు మనకు తెలిసిన జాతీయ బూర్జువాజి అనే భావన ఆచరణలోకి వచ్చింది. సోవియెట్ యూనియన్ లో కార్మికుల అధీనంలో రాజ్యం ఉండడం కార్మికోద్యమాలను సోషలిస్టు ప్రత్యామ్నాయం కోసం ఉత్తేజపరిచింది. సోషలిస్టు సంస్కరణలు కలిగిన పెట్టుబడి రాజ్యం రెంటికి ఒక రాజీ మార్గంగా ముందుకొచ్చింది. ఇటువంటి నాయకత్వం అన్ని ఖండాలలోను, అలీన దేశాలలోను ఉన్నది. అయితే సోవియెట్ అనుభవం తోనూ, చైనా మార్కెట్ వ్యవస్థలోకి వెళ్లిన తరువాత ఉత్తర అమెరికా, పశ్చిమ యూరప్ మాత్రమే జాతీయ పెట్టుబడిదారులకు నమూనాలుగా మిగిలాయి. ఈ దోపిడీ జాతి రాజ్యాలే ప్రపంచానికి సామాజికంగా మితవాద రాజకీయ సాంస్కృతిక నమూనాలు అయ్యాయి. ఇందులో భాగంగానే కార్పొరేట్ పెట్టుబడి సామాజికంగా మితవాద పాలనలకు మద్దతునివ్వడం జరిగింది. తద్వారా హిందుత్వ జాతీయవాదం పెద్ద ఎత్తున పెరగడానికి మౌలిక కారణం అయింది. పాలక వర్గాలు అనుసరిస్తున్న ఈ జాతి రాజ్యాల విధానానికి మూలం 'సంప్రదాయం'. ఈ 'సంప్రదాయం' స్వేచ్ఛాయుత ప్రజాతంత్ర రాజ్యాలలోని ఏ రకమైన సామాజికంగా ప్రగతిశీల భావాల చర్చలను పొసగనివ్వదు. ఇది ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా- అది అమెరికా అయినా, కేంద్ర యూరప్ అయినా యూరప్ అయినా భారత దేశమయినా- జరుగుతున్న ధోరణే. అందువలన భారతదేశంలో 'జాతి' అన్నదానిని పునర్నిర్వచించడం సమకాలీన ప్రపంచంలో అంతర్జాతీయ, జాతీయ బూర్జువాజి, హాబీస్ బౌమ్ తన ఏజ్‌అఫ్‌ఎక్స్‌ట్రీమ్స్ పుస్తకంలో చెప్పినట్టు, మితవాద జాతీయవాదాన్ని ప్రపంచమంతటా వ్యాపింపజేయడంలో భాగంగానే చూడాలి.

(5)

"గాంధీ, నెహ్రూ, అంబేద్కర్, భగత్‌సింగ్‌లు సామాజిక సంస్కరణల ద్వారానే శాస్త్రీయ విజ్ఞానానికి మతానికి ఉన్న సంబంధం మారుతుందని నమ్మారు. వారందరు గతం రెండు అంశాలను కలిగిఉందని నమ్మారు. కొన్ని వారసత్వంగా వచ్చినవి. కుల ప్రాతిపదికన సాంస్కృతిక విభజన ఒకవైపు. సంప్రదాయ కంగా ఉన్న భావ ప్రకటన స్వేచ్ఛ, సహనం మరోవైపు. శాస్త్రం, శాస్త్రీయ విధానాలు, శాస్త్రీయ స్వభావం సామాజిక ఉత్పత్తి సంబంధా లలో ఇమిడి ఉంటాయి."

పైన చెప్పిన విధంగా పెట్టుబడి పోగు పడడం, అది నయా మితవాద అజెండాకి మద్దతు నివ్వడం హిందుత్వ సాంస్క అతిక జాతీయవాద ఆధిపత్యం పెరగడానికి దోహద పడింది. కార్మికుల పై దాని ప్రభావం చాలా ఎక్కువగా పడింది. కార్మికవర్గంలో అసంఘటిత కార్మికుల సంఖ్య పెరిగి కార్మిక వర్గం చీలిపోయింది. సాంప్రదాయ కార్మిక సంఘాల నిర్మాణం ఒక సవాలుగా మారింది. అదే సమయంలో ఈ చీలిక అస్తిత్వ రాజకీయాలకు అవకాశం కల్పించింది. అయితే ఈ అస్తిత్వ రాజకీయాలన్నిటికీ పాలక వర్గాలే నాయకత్వం వహించడం లేదు. చీలికలు పేలికలైన కార్మిక వర్గం ప్రబల మైన జాతీయవాద రాజకీయ వ్యక్తీకరణలకు అవకాశం కల్పిస్తున్నది. కానీ వాటికి వర్గ సంబంధాలను సవాలు చేసే ఇటువంటి జాతీయ వాదాన్ని సైద్ధాంతికంగా ఎదుర్కొనే నిర్మాణం లేదు. అందువలన ప్రస్తుతం వర్గ ఆధారిత ఉద్యమాలు కార్మికవర్గాన్ని ఐక్యపరిచే ప్రత్యామ్నాయ వ్యూహాలను కనుగొనవలసి ఉంది. ఇవి భిన్న సాంస్కృతిక సంప్రదాయాలకు అవకాశాలు కల్పించగలగాలి. అప్పుడే భిన్న రాజకీయ గుర్తింపులను వ్యక్తపరిచే అవకాశాలు ఏర్పడతాయి. ఈ విధంగా సోషలిస్టు ఉద్యమంలో ఉన్నటువంటి ప్రత్యామ్నాయ జాతీయత విధానం రూపుదిద్దుకునే అవకాశం ఉంటుంది.

ఈ జాతీయత ఏఏ సూత్రాలపై ఆధారపడి ఉండాలో వివరించవచ్చు. శాస్త్రీయ ఆలోచనను అభివ అద్ధి పరచుకోవడం, ప్రస్తుతం ప్రపంచంలో తెలియని విషయాలు తెలుసుకోవడం జాతీయతకు, జాతి నిర్మాణానికి కేంద్ర బిందువుగా ఉండాలి. భారతదేశం దాని గత సాంప్రదాయాల ఆధారంగానే నిర్వచించబడుతున్నది. పాత భావాలను మారుతున్న పరిస్థితులకు అన్వయించడం నిరంతరంగా జరుగుతున్నది. దీనివలన చారిత్రికంగా సంస్కృతిలో ఉన్న అడ్డుగోడలను వ్యతిరేకించడం కొనసాగిస్తున్నది. ఫలితంగా సహనం, మార్పును ఆహ్వానించే గుణాన్ని కలిగి ఉంటున్నది. గాంధీ, నెహ్రూ, అంబేద్కర్, భగత్‌సింగ్‌లు సామాజిక సంస్కరణల ద్వారానే శాస్త్రీయ విజ్ఞానానికి మతానికి ఉన్న సంబంధం మారుతుందని నమ్మారు. వారందరు గతం రెండు అంశాలను కలిగిఉందని నమ్మారు. కొన్ని వారసత్వంగా వచ్చినవి. కుల ప్రాతిపదికన సాంస్కృతిక విభజన ఒకవైపు. సంప్రదాయ కంగా ఉన్న భావ ప్రకటన స్వేచ్ఛ, సహనం మరో వైపు. శాస్త్రం, శాస్త్రీయ విధానాలు, శాస్త్రీయ స్వభావం సామాజిక ఉత్పత్తి సంబంధా లలో ఇమిడి ఉంటాయి.

స్వతంత్ర భారతదేశంలోని కమ్యూనిస్టులు సామ్రాజ్యవాద వ్యతిరేకత, పునర్నిర్మాణం ద్వారా సామాజిక ఆర్థిక సమానత్వం సాధించడం అన్న రెండు మౌలిక ఆలోచనలను కలిగి ఉన్నారు. భగత్‌సింగ్ తన చివరి లేఖలో "కార్మికులకు కర్షకులకు రాజకీయ స్వతంత్రం లేకుండా ఆర్థిక స్వతంత్రం సాధ్యం కాదని" స్పష్టంగా రాసారు. రాజకీయ స్వాతంత్ర్యం అంటే భారత దేశపాలనను బ్రిటిష్ వారి చేతుల్లో నుంచి భారతీయుల చేతుల్లోకి మార్చుకోవడం. అంటే భారత సమాజాన్ని సోషలిస్టు మూలస్థంభాలపై నిలిపేందుకు నిజాయితీగా కృషి చేసే వారి ఆధీనంలోకి మారడం. కార్మిక వర్గ కర్తవ్యాలు రెండు రకాలుగా ఉంటాయని 1925లో హెచ్‌ఎస్‌ఆర్‌ఏ తన మేనిఫెస్టోలో చెప్పింది. మొదటిది భారతదేశ పెట్టుబడిదారి వర్గ అవిర్భావాన్ని, విదేశీ పెట్టుబడి దారులతోను, రాజ్యంతోను దాని మిలాఖత్‌ను నిలువరించడం రెండు, రాజ్యాధికారం కొందరి ఆధిపత్యంలో కొనసాగనీయకుండా కార్మికులను సంఘటితం చేసి సామాజిక పునర్నిర్మాణానానికి కఅషి చేయడం. ఆ విధంగా స్వాతంత్ర్యం '98 శాతం భారతీయులకు" స్వరాజ్యాన్ని తెచ్చిపెట్టాలని, 'భారతదేశ స్వాతంత్ర్యం అన్ని వలస దేశాల స్వాతంత్ర్యానికి కారణం' కావాలని, ఆ రకంగా సోషలిజానికి బీజం కావాలని చెప్పారు. 1926లో నౌజవాన్ భారత్ సభ 'హిం దువుల మితవాదం సనాతనవాదం' 'ముస్లింల మితిమీరిన భక్తి'ని విదేశీయులు తమకు అనుకూలంగా వినిమోగించుకుంటున్నారని ప్రకటించింది. ఇప్పుడు నరేంద్ర మోడీకి ఇదే అన్వయించవచ్చు. రాజకీయంగా, ఆర్థికంగా సామ్రాజ్యవాద ఏజెంటు అయిన నరేంద్రమోడీకి, ఇతర మితవాద సామ్రాజ్యవాద ఏజెంట్లకు ఇదే వర్తిస్తుంది. వారు అనుసరించే హిందూ ముస్లిం విభజన విధానం కేవలం సామ్రాజ్యవాదుల ఆర్థిక, రాజకీయ ప్రయోజనాలనే కాపాడుతుంది.

కమ్యూనిస్టులు నిర్మించ తలపెట్టిన వర్గ ఐక్యతలో కార్మికవర్గ సామాజిక హక్కులు కూడా ఇమిడి ఉన్నాయి. ఇందుకు ఉదాహరణగా ఈ మధ్యే గిరిజనులను కూడా అఖిల భారత కిసాన్ సభ పోరాటాలలో భాగస్వాములను చేయడం చూడవచ్చు. అదేసమయంలో ఆదివాసీ రైతుల భిన్నమైన డిమాండ్ల కోసం కూడా కిసాన్ సభ పోరాటాలను చేసింది. ఈ పోరాటాల ఫలితంగానే మార్చి నెలలో అందరి మన్ననలను అందుకున్న రైతుల సుదీర్ఘ పాదయాత్ర సాధ్యమైంది. అణగారిన తరగతులలో ప్రజాతంత్ర చైతన్యాన్ని నింపగలగడం ఈ యాత్ర విజయంలో ఒక ముఖ్యమైన అంశంగా చెప్పుకోవచ్చు. అంటే ఆర్థిక, సామాజిక పునర్నిర్మాణ కార్యక్రమం, జాతి, మత, కుల బేధాలు లేని కార్మిక–కర్షక ఐక్యతకు పాటుపడడం ద్వారానే మితవాద బూర్జువా జాతీయవాదాన్ని ఎదుర్కోవడం సాధ్యపడుతుందని అర్థం చేసుకో వాలి. జాతీయవాదానికి వరస్పర వ్యతిరేకమైన – మితవాద, సోషలిస్టు–రెండు వివరణలు ముందుకు వచ్చిన పరిస్థితుల్లో ఇప్పుడు కమ్యూనిస్టులు రెండు రకాల సవాళ్ళను ఎదుర్కోవాలి. ఒకటి అణగారిన ప్రజలను తమవారిగా చేసుకునేందుకు వారి ఊహలకి అనుగుణమైన పెట్టుబడి దారీయేతర, లౌకిక, సోషలిస్టు ప్రత్యామ్నాయం రూపొందించడం ద్వారా దోపిడీకి గురవుతున్న ప్రజలందరినీ తనలోకి చేర్చుకోవటం, రెండు ఫాసిస్ట్ శక్తుల ఎదుగుదలను నిరోధించడం. ఆ విధంగా మార్క్సిస్టు దృక్పథంతో అస్తిత్వవాద రాజకీయాలను అర్థం చేసుకుని శ్రామికప్రజలను సమీకరించటానికి పూనుకోవాలి.

**అనువాదం: కె ఉషారాణి**

చర్చ

# కమ్యూనిజాన్నా.. నిషేధించాల్సింది...?

టిఎన్‌వి రమణ



రచయిత పాత్రికేయుడు

"కమ్యూనిస్టులను నిషేధించమనటానికి ప్రాతిపదిక ఇదే" అనే శీర్షికతో ఆర్ఎస్ఎస్ అధికార పత్రిక ది ఆర్గనైజర్ ఏప్రిల్ 17 సంచిక లో ఒక వ్యాసం ప్రచురించింది. అందులో కమ్యూనిజం చనిపోయిన గుర్రం అని, ప్రపంచం మొత్తంలో అంతరించిపోతుంటే భారత దేశంలో వారికి ఆశ్రయం దొరికిందని, ప్రజాస్వామ్యాన్ని ఆసరా చేసుకొని పునరుజ్జీవం పొందేందుకు కమ్యూనిస్టులు చేసే ప్రయత్నంలో బొటనవేలు పెట్టేంత స్థలం సాధించారని చెప్పడంలో ప్రజాస్వామ్యం పట్ల బిజెపి ఆర్ఎస్ఎస్‌కు ఎంత వ్యతిరేకత ఉందో బయటపడుతున్నది.

కమ్యూనిజం అనేది చనిపోయిన గుర్రం లాంటిదని, కొంతమంది దాన్ని పునర్జీవింప చేయాలనే వృధా ప్రయాస చేస్తున్నారని. గుర్రపు కళేబరాన్ని దాని తాలూకూ స్మృతులను కూడా పూడ్చివేస్తే శాశ్వతంగా పనైపోతుందని అభిప్రాయపడ్డారు. అయితే చనిపోయినదాన్ని గురించి ఇంత రాద్ధాంతం ఎందుకు అంటే రచయిత వద్ద సమాధానం లేదు.

కమ్యూనిస్టు సిద్ధాంతం వెలుగులో ప్రపంచంలో మొట్టమొదటిసారి దోపిడీలేని సోషలిస్టు సమాజం 1917లో రష్యాలో ఏర్పాటు అయింది. రెండో ప్రపంచయుద్ధంలో హిట్లర్ ఫాసిజాన్ని మట్టికరిపించారు. చైనాలో 1949 లో మావో నాయకత్వంలో కమ్యూనిస్టులు అధికారంలోకి వచ్చారు. ఈ మూడు ఘటనలు ప్రపంచగతినే మార్చివేశాయి.

ఫిబ్రవరిలో తన "స్టేట్ ఆఫ్ ది హెూమ్" ఉపన్యాసంలో అమెరికా అధ్యక్షులు డోనాల్డ్ ట్రంప్ అమెరికాలో సోషలిజంను స్థాపిస్తామని కొత్తగా నినాదాలు వినబడుతున్నాయి అవి ప్రమాదఘంటికలను మోగిస్తున్నట్లు వినిపిస్తున్నది. అయితే అమెరికా ఎన్నటికీ సోషలిజంను ఆమోదించదని ఈ రాత్రికి మనం ఏకగ్రీవంగా తీర్మానించాల్సి ఉందని" ప్రకటించారు. క్యూబాలో 58 సంవత్సరాల క్రితం క్యాస్ట్రో నాయకత్వంలో జరిగిన తిరుగుబాటు సమయంలో దాన్ని అణిచివేయడానికి ప్రయత్నించిన సైనికుల బ్రిగేడ్ 2506 తో గత ఫిబ్రవరిలో అమెరికా జాతీయ భద్రతా సలహాదారు బోల్టన్ మాట్లాడుతూ " అమెరికాలో, ఈ అర్ధగోళంలో కమ్యూనిజం మరియు సోషలిజంను ముందుకు తేవాలని ప్రయత్నిస్తున్న శక్తులను తిప్పి కొట్టడానికి రాబోయే రోజుల్లో మీ సహాయం అవసరమవుతుందని, దానికి మీరు సర్వసన్నద్ధంగా ఉండాలని ప్రకటించారు". క్యూబా, వెనిజులా, నికరాగ్వాలలోని మూడు వామపక్ష ప్రభుత్వాలను మట్టి కరిపించాలని కూడా పిలుపునిచ్చారు. అమెరికాలో బెర్నీశాండర్స్, ఇంగ్లాండ్‌లో జెరెమి కార్బిన్ సోషలిజం గురించి చేస్తున్న ప్రచారం ప్రజల్లో మంచి స్పందన కలిగిస్తున్నది. కమ్యూనిస్టు భావజాలం ముందుకు తెచ్చే ప్రశ్నలకు సమాధానం ఇవ్వలేని పాలక వర్గం ఇటువంటి ప్రతిపాదనలు మాత్రమే చేస్తుంది.

"కమ్యూనిజం అనేది అపారమైన సంపద సృష్టి గురించి మాట్లాడదు. అది ప్రధానంగా అసమానతలు,వర్గపోరాటం, పెట్టుబడిదారులతో సహా పెట్టుబడిదారీ విధానాన్ని పూడ్చిపెట్టాలని, అధికారం అనేది కార్మిక వర్గానికి, రైతులకు మాత్రమే దక్కాలని రాజ్యం అంతరించిపోవాలని మాట్లాడుతుందని" ఆరోపించారు.

ఈరోజు చైనా కమ్యూనిస్టు పార్టీ ఆ దేశంలో సోషలిస్టు సమాజాన్ని నిర్మిస్తున్నది. అక్కడ జిడిపి 14.2 ట్రిలియన్ డాలర్లు. (భారతదేశంలో 2.716 ట్రిలియన్ డాలర్లు) చైనాలో తలసరి జిడిపి 10153 డాలర్లు. (భారతదేశంలో 2036 డాలర్లు) చైనా చేసే ఎగుమతులు 2.48 ట్రిలియన్ డాలర్లు (భారత్ – 303.4 బిలియన్ డాలర్లు) చైనా దిగుమతులు 2.13 ట్రిలియన్ డాలర్లు (భారత్ 456.6బిలియన్ డాలర్లు). విదేశీ మారక నిల్వలు చైనాలో 3.6 ట్రిలియన్ డాలర్లు ఉంటే భారతదేశం 414.886బిలియన్ డాలర్లు మాత్రమే. అమెరికాతో చైనా జరిపే వాణిజ్యంలో చైనాదే పైచేయి. సోషలిజంలో ప్రజలు అన్ని సౌకర్యాలతో కూడిన నాణ్యమైన జీవనం గడపాలంటే సంపద సృష్టి అనేది అత్యంత కీలకమైన అంశం అని కమ్యూనిస్టులకు తెలుసు. అందుకే చైనా ఆచరించి చూపిస్తున్నది.

నేటి చైనాయేకాదు నాటి రష్యా కూడా అద్భుత సంపద సృష్టించింది. గిబ్సన్ జార్వీ బ్రిటీష్ పెట్టుబడిదారుడు యునైటెడ్ డొమినియన్ ట్రస్టు అనే సంస్థకు అధ్యక్షుడు. అతను 1932లో రష్యాలో పర్యటించాడు. మొదటి పంచవర్ష ప్రణాళిక గురించి ఇలా చెప్పాడు. నేను కమ్యూనిస్టును కాను, బోల్షివిక్‌ని కాను, అనే విషయం స్పష్టంగా అర్థం చేసుకోమని కోరుతున్నాను. నేను కేపిటలిస్టుని, వ్యక్తి వాదిని, పంచవర్ష ప్రణాళిక గురించి ఎన్నో జోకులు ఉన్నాయి. ఇది విఫలమవుతుందన్న జోస్యాలు చెప్పారు. పంచవర్ష ప్రణాళికలో ఉద్దేశించిన దానికంటే ఎక్కువే సాధించడం జరిగిందన్నది నిర్వివాదాంశం. నేను చూసిన పారిశ్రామిక నగరంలో స్పష్టమైన ప్లానుతో కొత్త నగరాలు నిర్మించబడుతున్నాయి. విశాలమైన వీధులు, పార్కులు, దొడ్లకిరువైపులా చెట్లు అత్యంత ఆధునికమైన గృహాలు, స్కూళ్ళు, వైద్యాలయాలు, కార్మికుల క్లబ్బులు, పనిచేసే తల్లుల పిల్లలను చూడడానికి క్రెష్‌లు, నిర్మించబడుతున్నాయి. ఈ నాటి రష్యా ఒక ఆదర్శం. ఆత్మగల రష్యా. అద్భుతమైన కార్యక్రమాలు అమలు జరుపుతున్న దేశం. అన్నింటికంటే ముఖ్యమైన విషయం ఏమిటంటే రష్యన్ కార్మికవర్గం, యువత ఒక గుణం కలిగి ఉన్నాయి. అదేమిటంటే

భవిష్యత్తుపై విశ్వాసం... కేపిటలిస్టు దేశాలలో యువతలో లోపించిన గుణం కూడా అదే.

కమ్యూనిస్టు ఆర్థిక సూత్రాలకు కాలం చెల్లిపోయింది. ప్రస్తుత యుగం మార్కెట్ ఎకానమిదే. ఇందులో వారికి పనిలేదు అంటున్నారు. ఇప్పటి చైనా మోడల్ అప్పటి రష్యా మోడల్ ఏమి చెప్పుతున్నాయి? మన దేశంలో మోదీ విధానాలు సంవత్సరానికి 2 కోట్ల ఉద్యోగాలు కల్పించలేదు, రైతుకు కనీస మద్దతు ధర ఇవ్వలేదు. జిఎస్‌టి పెద్దనోట్ల రద్దుతో లక్షలాది మందికి ఉన్న ఉద్యోగాలు పోయినాయి. నల్ల డబ్బు తెల్లడబ్బు అయింది. ఆత్మహత్యలు పెరుగుతున్నాయి. ధనవంతులు మరింత ధనవంతులౌతున్నారు. ఈ ఐదు సంవత్సరాల కాలంలో 72 శాతం ఆదాయం 1శాతంగా ఉన్న ధనికుల జేబుల్లోకి వెళ్ళింది. ఇదా ఆదర్శం. భారతదేశంలో ఆర్ఎస్ఎస్ రిమోట్ కంట్రోల్‌తో పనిచేసే బిజెపి ప్రభుత్వం సంపద సృష్టిలో చైనాకంటే ఎందుకు వెనకబడిపోయిందో మరి. సృష్టించిన సంపదలో కూడా 80 శాతం 200 కుటుంబాలకే చెందేలా అధికారంలో ఉన్న బిజెపి విధానాలు సహకరిస్తున్న విషయాన్ని ప్రజలు పసిగడుతున్నారు. బిజెపి అమెరికా అడుగుజాడల్లోని పార్టీ. అక్కడ ట్రంప్ సోషలిజంపై విరుచుకుపడుతుంటే, ఇక్కడ కమ్యూనిజాన్ని నిషేధించాలని మరో అడుగు ముందుకు వేసి గురువుని మించిన శిష్యులమనిపించుకుంటున్నారు.

భారతదేశ సంస్కృతి చాలా పురాతనమైనది, గొప్పదని చెప్పుతున్నారు. అందుకు ఎవ్వరికి అభ్యంతరం ఉండదు. భారతదేశం గొప్ప సంస్కృతి కలిగిన దేశం అని, ఇందులో హిందూయిజం అనేది ప్రజలను మతం, కులం, ప్రాంతం అనే బేధం లేకుండా ఐక్యపరిచే సిద్ధాంతం అని, హిందూయిజాన్ని కమ్యూనిజం అంగీకరించనందున దానికి దేశంలో స్థానం లేదని అంటున్నారు. ఆర్.ఎస్.ఎస్.కు "పాంచజన్యం" అనేది సిద్ధాంత గ్రంథం, దానిలో భారత దేశానికి అంతర్గత శత్రువులు ఉన్నారని, వారు (1) ముస్లింలు, (2) క్రిస్టియన్స్, (3) కమ్యూనిస్టులని స్పష్టంగా వ్రాసుకున్నారు. ప్రజలను ఎవ్వరూ విడగొట్టు తున్నారో ఆలోచించండి. మరీ ఈ రోజు సంగతేంటి ఇతర మతస్థుల వంట గదుల ను తనిఖీ చేసి గొడ్డుమాంసం తింటున్నారని అబద్దాలు పుట్టించి హత్యలు చేయడం సరైందా? ఇంద్రుడు అనే దేవుడు గొడ్డుమాంసం ఇష్టంగా తినేవాడు మరి ఆయన హిందూ దేవుడు కాదా? బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా హిందు ముస్లీంలు ఐక్యంగా

❝ ఆర్.ఎస్.ఎస్.కు "పాంచజన్యం" అనేది సిద్ధాంతగ్రంథం, దానిలో భారత దేశానికి అంతర్గత శత్రువులు ఉన్నారని, వారు (1) ముస్లింలు, (2) క్రిస్టియన్స్, (3) కమ్యూనిస్టులని స్పష్టంగా వ్రాసుకున్నారు. ప్రజలను ఎవ్వరూ విడగొట్టు తున్నారో ఆలోచించండి. మరీ ఈ రోజు సంగతేంటి ఇతర మతస్థుల వంట గదుల ను తనిఖీ చేసి గొడ్డుమాంసం తింటున్నారని అబద్దాలు పుట్టించి హత్యలు చేయడం సరైందా? ఇంద్రుడు అనే దేవుడు గొడ్డు మాంసం ఇష్టంగా తినేవాడు మరి ఆయన హిందూ దేవుడు కాదా? ❞



ఆర్ఎస్ఎస్ హిందువాహిని గూండాలు

పోరాడితే, ఆ ఐక్యతను చీల్చడానికి విభజించు, పాలించు అనే సిద్ధాంతాన్ని పాలకులు ముందుకుతెచ్చారు. గంగా జమునా తెహజీబ్ అనేది మన సంస్కృతి, మరి ఆర్ఎస్ఎస్ దానికి అంగీకరిస్తుందా? తాము చెప్పిన దానికి వంతపాడటమే దేశభక్తి అని ప్రశ్నించడాన్ని దేశద్రోహమని ముద్రవేయడమేకాక సోషల్ మీడియా ద్వారా వెంటాడుతున్నారు. ప్రజలకు వాస్తవాలు చెప్పి చైతన్య పరుస్తున్న వారిని భౌతికంగా అంతమొందించే మూకలను దించుతున్నారు. ఆర్.ఎస్.ఎస్. బిజెపి, హిందూ వాహిని వంటివి ఆరాచక శక్తులు కాదా అని ఈ రోజు మేధావులు లేవనెత్తు తున్న ప్రశ్న. విశ్వగురు కాబోతున్నామనే ఆర్ఎస్ఎస్ ఆర్భాటపు నినాదానికి ఏమన్నా అర్థం ఉందా? ప్రజలు శాంతియుతంగా బ్రతకడానికి ఉపయోగపడే సంస్కృతే ఈనాటి తక్షణ అవసరం. దానికోసం కమ్యూనిస్టులు పనిచేస్తున్నారు. ఇది ఆర్ఎస్ఎస్‌కు గిట్టదు.

కేరళలో అక్షరాస్యత ఎక్కువ ఉన్నచోట ప్రజలు పనికిమాలిన కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని పట్టుకు వేలాడుతున్నారంటున్నారు. ఇలా అనడం అంటే కేరళ ప్రజల విజ్ఞతను అపహాస్యం చేయడంకాదా? కేరళలో కమ్యూనిస్టుల నాయకత్వంలో వామపక్ష ప్రజాతంత్ర ప్రభుత్వం ఉంది. నాణ్యమైన విద్య, వైద్యం, ప్రభుత్వమే అక్కడ అందిస్తున్నది. ఎంఎల్ఎలు కూడా ప్రభుత్వ ఆసుపత్రులలోనే వైద్యం చేయించుకుంటున్నారు. వారి పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుతారు. దేశంలోనే సుపరిపాలనలో మొదటి ర్యాంక్ కేరళదే. ప్రజారంజక పాలనను అందిస్తున్నందువల్లే ప్రజలు ఆదరిస్తున్నారు. దేశంలో ఏకైక కమ్యూనిస్టు ప్రభుత్వం కేరళలో ఉంటూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వాన్ని ఢీకొంటోంది. అక్కడ బిజెపి పప్పులు ఉడకటం లేదు. శబరిమల విషయంలో కూడా అక్కడ ప్రభుత్వం కోర్టు ఆర్డరుని అమలు చేస్తే వీరు గగ్గోలు పెడుతున్నారు. బహుశా ప్రజలు విజ్ఞానవంతులు అయితే మార్క్సిస్టుల పట్ల ఆకర్షితులవుతారన్న సూత్రం అర్థం చేసుకున్న బి.జె.పి. పాలిత రాష్ట్రాలు ప్రజలను నిరక్షరాస్యతలో మగ్గేలా చేస్తున్నాయి.

కమ్యూనిస్టులు అధికారంలోకి వస్తే అన్ని శాఖలలోకి జొరబడి విద్రోహం చేస్తారు అనేది ఆర్.ఎస్.ఎస్. నైజం. కమ్యూనిస్టుల నైజం కాదు. బిజెపి అధికారం చేపట్టినప్పటి నుండి ఆర్ఎస్ఎస్

> ❝కమ్యూనిస్టులు ఉగ్రవాదులను ప్రోత్సహిస్తూ ఆయుధాలు అందిస్తున్నారని తప్పుడు ఆరోపణలు చేస్తూ జాతి వ్యతిరేకులని ముద్రవేయటానికి ప్రయత్నించటం అర్ధరహితం. రెండో వైపు ఆర్‌ఎస్‌ఎస్ శ్రేణుల్లోనే హిందూత్వ టెర్రరిస్టులు బయట పడ్డారు. స్వామి అసిమానంద, కుమారి ప్రగ్యా సింగ్‌ఠాకూర్ మాలేగాంలో 2006 బాంబు దాడిలో ప్రధాన సూత్రధారులు. ఆమె మోటార్ సైకిల్‌కే బాంబులు అమర్చి పేల్చారు.❞

మనుషులను ప్రతి సంస్థలో కూర్చోబెట్టింది. రిజర్వు బ్యాంక్ బోర్డ్ ఆఫ్ డైరెక్టరుగా గురుమూర్తిని నియమించింది. ఉర్జిత్ పటేల్‌ను గవర్నరుగా నియమించింది. కొంతకాలానికే ఆయన రాజీనామా చేయాల్సి వచ్చింది. ప్లానింగ్ కమీషన్‌ను రద్దు చేసి నీతి అయోగ్‌ని ఏర్పాటు చేసి అరవింద్ పనగారియాని నియమించింది. ఆర్‌ఎస్‌ఎస్ వారితో చర్చించే నిర్ణయాలు చేయాలని చేతులు కట్టేసింది. దానితో ఆయన నిష్క్రమించారు. పాఠ్యపుస్తకాలలో పాఠ్యాంశాలు కొత్తగా రాయించేందుకు ఆర్‌ఎస్‌ఎస్ మూలాలు ఉన్న వారినే నియమించారు. వారు ప్రజాస్వామ్యం గురించి ఉన్న పాఠ్యాంశాలను తొలగిం చారు. హిందుత్వ సిద్ధాంతాన్ని ప్రవేశపెడు తున్నారు. అనేక విశ్వవిద్యాలయాలకు ఆర్.ఎస్. ఎస్. అనుబంధం ఉన్నవారినే వైస్‌చాన్స్‌లర్లుగా నియమించి క్యాంపస్‌లలో వామపక్ష భావాలు గల విద్యార్థులు, ఉపాధ్యాయులను వేటాడు తున్నారు. అనేక విశ్వవిద్యాలయాలలో 'శాకా' హారం మాత్రమే ఇస్తున్నారు. ఇవి ఫాసిస్టు లక్షణాలు. వాటినే మోదీ ప్రభుత్వం పాటిస్తున్నది.

కమ్యూనిస్టులు ఉగ్రవాదులను ప్రోత్సహిస్తూ ఆయుధాలు అందిస్తున్నారని తప్పుడు ఆరోపణలు చేస్తూ జాతి వ్యతిరేకులని ముద్రవేయటానికి ప్రయత్నించటం అర్ధరహితం. రెండోవైపు ఆర్‌ఎస్‌ఎస్ శ్రేణుల్లోనే హిందూత్వ టెర్రరిస్టులు బయటపడ్డారు. స్వామి అసిమానంద, కుమారి ప్రగ్యా సింగ్‌ఠాకూర్ మాలేగాంలో 2006 బాంబు దాడిలో ప్రధాన సూత్రధారులు. ఆమె మోటార్ సైకిల్‌కే బాంబులు అమర్చి పేల్చారు. ఆమె ఆ కేసు విచారణలో భాగంగా జైల్లో ఉంటే బెయిల్‌పై విడుదల చేయించి భోపాల్ నుండి పార్లమెంటు అభ్యర్థిగా బిజెపి, నిలబెట్టడమే కాకుండా ఆమెను అభ్యర్థిగా పెట్టటంలో తప్పులేదని, మన నాగరిక వారసత్వానికి ప్రతీకని మోదీ సమర్ధించటం శోచనీయం. 2008 సంవత్సరంలో మాలెగావ్, 2007లో సంజౌతా ఎక్స్‌ప్రెస్, హైదరాబాద్ మక్కా మసీదు, అజ్మీర్ దర్గా దగ్గర జరిగిన బాంబు దాడుల్లో స్వామి అసిమానంద పాత్ర ఉన్నది. అభినవ భారత్ అనే హిందూ మతోన్మాద సంస్థ ఈ దాడులు చేసినట్లు బయటపడింది. ఇదికూడా ఆర్‌ఎస్‌ఎస్ అనుబంధ సంస్థే. దాని కనుసైగలతో నడిచేదే. హిందూత్వ ఉగ్రవాదులను తయారుచేసే కర్మాగారంగా ఆర్.ఎస్.ఎస్. మారుతున్నదన్న వాస్తవాన్ని ఈ వివరాలు రుజువు చేస్తున్నాయి.

ఈ వ్యాసంలో రచయిత గుడ్డి కమ్యూనిస్టు వ్యతిరేకతనువెల్లడించుకున్నాడు. ఆర్.ఎస్.ఎస్. ప్రవచనాలు, నిజలక్ష్యాలు వేరువేరని, వాటి మధ్య హస్తిమశకాంతరం ఉందని ఈ వ్యాసం మరోసారి రుజువు చేస్తోంది. దేశంలో ప్రశ్నించే శక్తులకు నాయకత్వం వహించే కమ్యూనిస్టుల పట్ల, ప్రత్యేకించి సిపిఎం పట్ల వ్యతిరేకతను పెంచే ప్రయత్నమే పాంచజన్య వ్యాసం లక్ష్యం..

---

# ఎన్నికల క్యాం'పే'యిన్

(5వ పేజీ తరువాయి)

కల్పించాడు. 'దేశం కోల్పోయిన ప్రభావాన్ని తిరిగి తేగలిగిన మొనగాడిగా, రక్షించే వానిగా తనని తాను చూపించుకున్నాడు'.

మనదేశంలో కూడా ఈ రకమైన 'రాజ కీయ మానసిక ప్రభావాలు' ఎన్నికల ప్రచారంలో కీలకంగా శరవేగంగా చేరిపోతున్నాయి. ఈ ఆటల కోసమే కన్సల్టెంట్‌లను కుదుర్చుకుం టున్నారు. అందువలనే వామపక్షాల ప్రచారంలో తప్ప మిగిలిన వారి ప్రచారాలలో పెద్ద తేడాలు ఉండడం లేదు. హిందూస్తాన్ టైమ్స్ బిజెపి, కాంగ్రెస్ ఎన్నికల ప్రచారానికి సంబంధించి విశ్లేషిస్తూ " బిజెపి తన ఎన్నికల సారాంశాన్ని సంక్షిప్తీకరించింది, ముందు 'జాతీయత'తో ఆరంభించి, మోడీ ఏ విధంగా బలమైన ప్రభు త్వాన్ని అందించగలిగాడో, మిగిలిన బలహీనమైన ప్రభుత్వాలకన్నా పాకిస్తాన్‌కి ఏ విధంగా జవాబు చెప్పగలిగాడో వివరించింది. ప్రచారం ఉపందుకోగానే బిజెపి ప్రచారం వ్యక్తిగతంగానూ, దూషణలతోనూ నిండిపోయింది. దాని గొంతు మెజారిటేరియనిజం వైపు మళ్లింది. 'మరో వైపు అది కాంగ్రెస్ గురించి ఇలా చెప్పింది'. కాంగ్రెస్ చాలా జాగ్రత్తగా లౌకిక తత్వానికి– మతతత్వా నికి జరిగిన వాదనల నుండి దూరంగా ఉంది – హిందూ వ్యతిరేకిగా ముద్ర వేస్తారని భయ పడింది. అది మొదట్లో "జాతీయత "సమస్యని కూడా దూరంగా పెట్టింది. జాతి వ్యతిరేకం, పాకిస్తాన్‌కి అనుకూలంగా ముద్ర వేస్తారని భయ పడింది. ఆఖరికి మన్మోహన్ సింగ్ ద్వారా తామూ అనేక సర్జికల్ స్ట్రైక్స్‌కి పాల్పడ్డామని చెప్పించింది".

బిజెపి, కాంగ్రెస్ రెండు పాలక పక్ష పార్టీలు ఒకే రకమైనవి. తేడా అల్లా ఆర్ ఎస్‌ఎస్ మార్గ దర్శకత్వంలో నడుస్తున్న మరింత మతతత్వ పార్టీ బిజెపి. పాలక వర్గాలకి రెండు పార్టీలు ఎన్నికలైన తర్వాత క్రియాశీలంగా పనిచేయవలసిన అవసరం ఉంది. అప్పుడే వారి ప్రయోజనాలు కాపాడ బడతాయి. ఈ రెండింటి భావాలూ ఒకటే అయినందువలననే నయాఉదారవాద విధానాలు అంతరాయం లేకుండా అమలు జరుగుతున్నాయన్న విషయాన్ని మనం గమనించాలి.

ఇందుకు భిన్నమైన విధానాలు అమలు కావాలంటే సిపిఎం, ఇతర వామపక్ష, ప్రజా తంత్ర శక్తులను బలపరచడం మినహా మార్గం లేదు. వారు మాత్రమే బిజెపిని రాజకీయం గాను, సామాజికంగానూ, సైద్ధాంతికంగాను, సాంస్కృతికంగాను, ఆర్థికరంగంలోనూ, ఎన్నికల రంగంలోనూ ఓడించగలుగుతారు. అది అసంభవంగా కనిపించవచ్చు. కానీ మన బలంపై విశ్వాసం కలిగి ఉంటే ఇది సాధ్యమే. ఎన్నికలు సజావుగా జరగాలన్నా, ప్రజాతంత్రం గా పరిపాలించబడాలన్నా వామపక్ష ప్రజా తంత్ర శక్తులు గెలవాలి. ఎక్కువమంది ప్రతిఘటించక పోవడంవలన, మౌనంగా ఉండడం వలనే అల్పసంఖ్య కలవారు పాలించ గలరని, అణచివేయగలరని మనం మరిచిపోకూడదు. ఏదేమైనా అణచివేయబడిన వారి గొంతుకలనే మనం సదా వినిపిద్దాం.

**అనువాదం: కె ఉషారాణి**

# పాత్రికేయునిగా ఏంగెల్స్

ఎం శివరామకృష్ణన్

**1842,** అక్టోబరులో బెర్లిన్‌లో సైనిక శిక్షణ పూర్తి చేసుకొని ఏంగెల్స్ బర్మెన్ తిరిగి చేరుకున్నాడు. కుటుంబంతో కొన్ని రోజులు గడిపిన తరువాత, మాంచెస్టర్ వెళ్లి విక్టోరియా మిల్లు కార్యాలయంలో చేరాలని తండ్రి ఏంగెల్స్‌ని కోరారు. కొన్ని వారాలు గడిచిన తర్వాత ఏంగెల్స్ బర్మెన్‌ను విడిచి పెట్టి ఇంగ్లండ్‌లోని మాంచెస్టర్ పట్టణానికి చేరుకున్నాడు. ఆ కాలంలోనే ప్రపంచంలోనే అత్యంత ఆధునికంగా అభివృద్ధి చెందిన పారిశ్రామిక దేశంగా ఇంగ్లాండ్ గుర్తింపు పొందింది. బ్రిటిష్ దీవులలో భారీ పరిశ్రమలన్నీ పట్టణాలలో కేంద్రీకరించ బడ్డాయి. భారీ పరిశ్రమల ఏర్పాటుతో లండన్ జనాభా 35లక్షలను మించి పోయింది. మూడు లక్షల మంది కార్మిక కుటుంబాలు గ్లాస్గోలో నివాసితులుగా ఉన్నారు. ప్రపంచ పారిశ్రామిక ఉత్పత్తిలో దాదాపు సగభాగం ఇంగ్లాండ్ యొక్క పారిశ్రామిక కేంద్రాలలో ఉత్పత్తి అవుతూ ప్రధాన ఓడరేవులు, కాలువలు, రైల్వేలతో ఇంగ్లాండ్ అనుసంధానించబడి ఉంది.

పెట్టుబడిదారీ వ్యవస్థకు మాతఅభూమిగా, ప్రపంచంలోని కర్మాగారాలకు నిర్వహణా కేంద్రంగా ఇంగ్లండ్ అభివఅద్ధి అయింది. ఏంగెల్స్ మాంచెస్టర్ చేరుకుని తన తండ్రి చెప్పినట్లు విక్టోరియల్ మిల్ ఆఫీసు కార్యాలయంలో చేరాడు. విక్టోరియా మిల్ ఏంగెల్స్ సీనియర్ భాగస్వామిగా ఉన్న ఎర్మెన్, ఏంగెల్స్ కంపెనీకి చెందినది. మాంచెస్టర్ శివార్లలో నెలకొల్పిన ఈ మిల్లులో పత్తి, అల్లికకు ఉపయోగించే నూలుతోపాటు కుట్టు దారాలను కూడా తయారు చేస్తారు. ఆవిరి శక్తితో నడిచే యంత్రాలను మిల్లులో ఉపయోగించారు. ఏంగెల్స్ పని చేస్తున్న మిల్‌కు దగ్గరగా ఇంటిని అద్దెకు తీసుకున్నారు. ఆ సమయంలో మాంచెస్టర్ జనాభా సుమారు నాలుగు లక్షలకు చేరింది. ఏంగెల్స్ తన జీవితంలో మొట్టమొదటిసారిగా ఏడు అంతస్తుల కర్మాగారాల్లో పనిచేశాడు. కర్మాగారాల్లో వేలాది మంది పురుషులు, మహిళలు ఘోరమైన పని పరిస్థితుల్లో రోజుకు16 గంటలు పని చేయాల్సిన స్థితి ఉన్నది.

కార్మికులు తమ ఆర్థిక, రాజకీయ డిమాండ్స్ సాధన కోసం పెట్టుబడిదారులపై తీవ్రమైన పోరాటాలు చేయడాన్ని ఏంగెల్స్ చూశాడు. పని గంటలు తగ్గించాలని, వేతనాలు పెంచాలనే డిమాండ్లతో కార్మికులు ఉద్యమాలు చేశారు. పెట్టుబడిదారులు, కార్మికులకు మధ్య ఉన్న వర్గ వైరుధ్యాన్ని ఏంగెల్స్ గుర్తించారు. బార్మెన్లో ఉన్న ఏంగెల్స్ మాంచెస్టర్‌లో అణిచి వేయబడుతున్న పేదలపై జరుగుతున్న పీడనను, దోపిడీకి గురవుతున్న కార్మికుల రాజకీయ కోర్కెలను తెలుసుకోవడం పైన ఆసక్తిని చూపించాడు. సెలవు రోజుల్లో కార్మికులు తీరికగా ఉన్న విశ్రాంతి సమయాల్లో ఏంగెల్స్ కార్మికులను కలుసుకొని నివాసప్రాంతాల్లో వారు అనుభవిస్తున్న కష్టతరమైన జీవన పరిస్థితులను తెలుసుకునేవాడు. కార్మికుల మొదటి ప్రాధాన్యత వారి ఆర్థిక డిమాండ్లను సాధించుకోవడం. ఆ తర్వాతనే రాజకీయ డిమాండ్లను సాధించుకోవడంపై ఆసక్తి చూయిస్తారనే రెండు విషయాలను ఏంగెల్స్ గమనించాడు. ఆర్థిక పరమైన డిమాండ్లపై ఆందోళనలు చేయటం ద్వారానే కార్మికులను రాజకీయ ఉద్యమాలలోకి తీసుకురాగలమని ఏంగెల్స్ భావించాడు. పరిశ్రమల ద్వారా పెట్టుబడిదారులు పొందుతున్న లాభాలను, నివాసప్రాంతాల్లో కార్మికులు అనుభవిస్తున్న భయానక, దౌర్భాగ్య పరిస్థితుల గురించి ఏంగెల్స్ అధ్యయనం చేయడం ప్రారంభించాడు. కంపెనీకి వ్యాపార భాగస్వామిగా ఉన్న ఎర్మెన్ తన కుమారుడి ఉల్లాస కార్యకలాపాల్లో భాగస్వామి కావాల్సిందిగా ఫెడరిక్ ఏంగెల్స్‌ని కోరగా తిరస్కరించాడు.

యాజమాన్యం నిర్వహించే విందు పార్టీలను నేను విడిచి పెట్టాను. మధ్య తరగతి ప్రజలు నిర్వహించే వైన్-ఛాంపైన్ పార్టీకి నేను సమయం కేటాయించలేను. తన విశ్రాంతి సమయమంతా అతి సాధారణమైన జీవితాన్ని గడుపుతున్న ప్రజలతో మమేకం కావాలని ఆశిస్తున్నట్లు ఏంగెల్స్ చెప్పాడు.

కార్మికుల నివాస ప్రాంతాల్లో తరచూ జరిగే సమావేశాలకు ఏంగెల్స్ హాజరయ్యేవారు. మొదట్లో అనేక పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులు రాజకీయ, మతపరమైన అంశాలపై చర్చలు చేస్తూ, సామాజికంగా వారు ఎదుర్కొంటున్న సమస్యలపై తెలివిగా ప్రశ్నలను అడగడమే గాకుండా, సమతుల్యమైన వాదనలతో విమర్శించడాన్ని చూసి ఏంగెల్స్ ఆశ్చర్యపోయాడు. కార్మికుల్లో ఉన్న దృఢమైన విశ్వాసాన్ని ఏంగెల్స్ ముందుగానే గుర్తించారు. వాళ్లకున్న విద్యా సామర్థ్యాలను ఏంగెల్స్ అభినందించారు. స్ట్రాస్ వంటి ఫ్రెంచ్ భౌతికవాదులు, ఊహాజనిత కమ్యూనిస్టులు చేసిన రచనలు, వ్యాసాలు, కరపత్రాలు చదివి అర్థం చేసుకోగల కార్మికుల సామర్థ్యాన్ని, విజ్ఞానతృష్ణను ఆయన గమనిం చారు. శాస్త్రీయ, ఆర్థిక సౌందర్య శాస్త్రం వంటి అనేక అంశాలపై కార్మిక సంస్థలు ఇచ్చే ఉపన్యాసాలకు కార్మికులు హాజరయ్యేవారు. బాగా కష్టపడే వాళ్లు, చీలికలైన జాకెట్లు వేసుకున్నవాళ్లు ఖగోళశాస్త్రం, గణిత శాస్త్రం వంటి అంశాలపై జర్మనీ బూర్జువా మేధావుల రచనలు అలవోకగా చర్చించి తప్పొప్పులు నిర్ధారించగల సామర్థ్యం సంపాదించుకోవటం ఏంగెల్స్‌ను ఆశ్చర్యపరిచింది.

మాంచెస్టర్‌లోని ఒక పత్తి మిల్లులో నూలు వడికే పని చేస్తున్న మేరీ బర్న్స్‌ని ఏంగెల్స్ కలుసుకున్నాడు. ఆమె తండ్రి మైఖేల్ బర్న్స్ అద్దకం వ్యాపారం చేస్తాడు. మేరీ బర్న్ ఐరిష్ సంతతికి చెందిన మహిళ. ఐర్లెండ్‌కు స్వేచ్ఛను ఇవ్వకుండా ఇంగ్లండ్ నిరాకరించింది. ఇంగ్లండ్ స్వాధీనంలోనే ఐర్లెండ్‌ను ఉంచుకోవడాన్ని మేరీ బర్న్ ద్వేషించింది. ఐర్లాండ్ స్వేచ్ఛ కోసం జరుగుతున్న స్వాతంత్ర్య ఉద్యమానికి ఆమె పూర్తిగా మద్దతునిచ్చింది. ఆమెలో ఉన్న విప్లవాత్మక ఆలోచనలు, కార్మిక తరగతి పట్ల ఆమెకున్న ఆసక్తి ఏంగెల్స్‌ని ఆకర్షించింది. అనతికాలంలోనే వారివురూ మంచి మిత్రులయ్యారు. కార్మికుల నివాసప్రాంతాల్లో జరిగే సమావేశాలకు ఏంగెల్స్‌తో పాటు మేరీ బర్న్ కూడా హాజరయ్యారు. ఇరువురూ కలిసి కార్మికుల సమావేశాలకు వెళుతున్న సందర్భం లో ఏంగెల్స్ ఆమె ప్రేమలో పడ్డాడు. చివరికి ఇద్దరూ భార్యాభర్తలుగా కలిసి జీవించాలని నిర్ణయించుకున్నారు. శ్రామికవర్గ విప్లవకారుడుగా, సిద్ధాంతకర్తగా ఎదగడానికి, శ్రామికుల జీవన పరిస్థితులను అర్థం చేసుకొని శాస్త్రీయంగా పరిశోధన చేయడానికి ఏంగెల్స్‌కి మేరీ ప్రేమ, తోడ్పాటు ఉపయోగపడ్డాయి.

మాంచెస్టర్‌లోని కార్మికులపై ఊహాజనిత సోషలిస్టులు, ఛార్టిస్టుల ప్రభావం గణనీయంగా ఉందని ఏంగెల్స్ గుర్తించారు. మాంచెస్టర్లోని చార్టిస్ట్ ఉద్యమంలో ప్రముఖ నాయకుడైన జేమ్స్

**"బూర్జువా సమాజంలో పెట్టుబడిదారుల కున్న ప్రైవేటు ఆస్తే వర్గాల ఉనికికి, వర్గ దోపిడీకి, వర్గపోరాటాలకి అసలైన కారణమని ఈ వ్యాసంలో ఏంగెల్స్ నొక్కిచెప్పాడు. పెట్టుబడి దారులకు వ్యతిరేకంగా వ్యక్తులుగా పోరాడుతున్న కార్మికులు ఏక మవుతారని, పెట్టుబడి దారులకు వ్యతిరేకంగా జరిగే పోరాటంలో కార్మికులు విజయం సాధించి అధికారాన్ని హస్తగతం చేసు కుంటారని ఏంగెల్స్ విశ్వాసాన్ని వ్యక్తపరుస్తాడు."**

లీచ్ యొక్క ప్రసంగాలు ఏంగెల్స్‌ని ఉత్సాహ పర్చాయి. చేనేత కార్మిక కుటుంబంలో పుట్టిన జేమ్స్ లీచ్ చార్టిస్టు ఉద్యమ నాయకుడిగా ఎదిగాడు. చాలా తక్కువ సమయంలోనే లీచ్ ఏంగెల్స్‌కి మంచి స్నేహితుడయ్యాడు. చార్టిస్ట్ ఉద్యమానికి అనుబంధంగా ఉన్న "న్యూ మోరల్ వరల్డ్, నార్తరన్ స్టార్ పత్రికలను ఏంగెల్స్ క్రమం తప్పకుండా కొనుగోలు చేసేవారు. చార్టిస్ట్ ఉద్యమాన్ని అవగాహన చేసుకోవడానికి వారి కార్యకలాపాలను, విధానాలను తెలుసుకునే ప్రయత్నం చేశాడు ఏంగెల్స్. కొంతకాలం తర్వాత ఏంగెల్స్ పత్రికల కొరకు వ్యాసాలు రాయడం ప్రారంభించారు. ఏంగెల్స్ తన కార్యకలాపాలను మాంచెస్టర్‌కు మాత్రమే పరిమితం చేయలేదు. అతను లీడ్స్, బ్రాడ్‌పోర్డ్, లండన్‌లాంటి ప్రాంతాలను కూడా సందర్శించాడు. ఏంగెల్స్ లండన్ వెళ్ళినప్పుడు అక్కడ నివసిస్తున్న వలసదారులను కలుసుకున్నాడు. ఏంగెల్స్ మాంచెస్టర్లో ఉన్న సమయంలో రాబర్ట్ ఓవెన్, చార్లెస్ ఫోరియర్, సెయింట్ సైమన్ వంటి గొప్ప ఇంగ్లీష్, ఫ్రెంచ్ ఉహాజనిత సోషలిస్టులు రాసిన పుస్తకాలు చదివాడు. అదేవిధంగా ప్రముఖ ఆర్థికవేత్తలైన ఆడమ్ స్మిత్, డేవిడ్ రికార్డో, ఇతరులు రాసిన పుస్తకాలను అధ్యయనం చేశాడు. అన్నిరకాల పుస్తకాలను అధ్యయనం చేసిన తరువాత ఏంగెల్స్ పెట్టుబడిదారీ వ్యవస్థలో రాజకీయ మార్పును తీసుకురావడం ద్వారా మాత్రమే కార్మికవర్గ పని పరిస్థితులు, సామాజిక పరిస్థితిని మార్చవచ్చుని, సోషలిజమే ప్రజలకు నిజమైన స్వాతంత్ర్యం-సమానత్వం తీసుకు రావడానికి హామీ ఇస్తుందనినిర్ధారణకు వచ్చాడు.

బూర్జువా అర్థశాస్త్రం గురించి, ఆర్థిక వ్యవస్థ నిర్మాణం గురించి, దోపిడీ వ్యవస్థలో వచ్చే అంతర్గత వైరుధ్యాల గురించి దాదాపు రెండు సంవత్సరాల పాటు సోషలిస్టు అవగాహనతో ఏంగెల్స్ అధ్యయనం చేశాడు. కారల్ మార్క్స్ సంపాదకుడుగా ఉన్న జర్మన్ - ఫ్రెంచ్ ప్రత్యేక సంచిక కోసం ఒక వ్యాసం రాసి ఇవ్వమని కారల్ మార్క్స్ ఏంగెల్స్‌ని కోరగా, ఏంగెల్స్ వెంటనే బూర్జువా రాజకీయ ఆర్థిక వ్యవస్థలో ఉన్న లోపాలపై కీలక విశ్లేషణ అనే శీర్షిక కింద ఒక వ్యాసం రాశాడు. ఈ వ్యాసం 1844 ఫిబ్రవరిలో ప్రత్యేక సంచికలో ప్రచురించబడింది. మానవ సమాజ అభివృద్ధిని ఆర్థిక పరిస్థితులు ఏవిధంగా ప్రభావితం చేస్తాయనే ప్రాథమిక ప్రశ్నకు ఏంగెల్స్ తన వ్యాసంలో సమాధానం ఇచ్చాడు.

బూర్జువా సమాజంలో పెట్టుబడిదారుల కున్న ప్రైవేటు ఆస్తే వర్గాల ఉనికికి, వర్గ దోపిడీకి, వర్గపోరాటాలకి అసలైన కారణమని ఈ వ్యాసంలో ఏంగెల్స్ నొక్కిచెప్పాడు. పెట్టుబడి దారులకు వ్యతిరేకంగా వ్యక్తులుగా పోరాడుతున్న కార్మికులు ఏకమవుతారని, పెట్టుబడు దారులకు వ్యతిరేకంగా జరిగే పోరాటంలో కార్మికులు విజయం సాధించి అధికారాన్ని హస్తగతం చేసుకుంటారని ఏంగెల్స్ విశ్వాసాన్ని వ్యక్తపరుస్తాడు.

పెట్టుబడిదారీ వ్యవస్థలో కార్మికులు పని చేయవలసిన్న అత్యంత క్లిష్ట పరిస్థితుల గురించి ఏంగెల్స్ స్పష్టంగా వివరిస్తాడు. కార్మికులు జీవించడానికి క్రమం తప్పకుండా పనిచేయవలసి ఉంది. భూస్వామి తన భూమి ఆధారంగా గానీ, భూమిని పెట్టుబడిగా మార్చటం ద్వారా గానీ ఎదుగుతాడు. దీని ఫలితంగా శ్రమ చేసే కార్మికులకు కేవలం బతకటానికి సరిపోయినంత మాత్రమే చెల్లించి ఉత్పత్తిలో ప్రధానవాటా భూయజమానులకు, పెట్టుబడిదారులకు స్వంతమవుతుంది. వ్యక్తిగత ఆస్తి కారణంగానే కార్మికులు ఇంతటి దయనీయ స్థితిలో ఉన్నారని ఏంగెల్స్ అభిప్రాయపడ్డారు. పెట్టుబడి నుండి శ్రమ వేరు కావటంతో పాటు ఈ క్రమంలో జరుగుతున్న పోటీ మొత్తం మానవాళిని కార్మికులు, పెట్టుబడి దారులుగా చీలుస్తుంది. ఈ చీలిక రానురాను మరింత తీవ్రమవుతుంది అని ఆయన గుర్తించారు. కార్మికులను ఈ దయనీయ స్థితి నుండి కాపాడి బయటపడేసేది ఎవరు అన్న ప్రశ్నకు కూడా ఆయన సమాధానం ఇస్తారు.

చరిత్రలో కార్మిక వర్గం యొక్క చారిత్రాత్మక పాత్రే చాలా కీలకమైందని ఏంగెల్స్ కనుగొన్నాడు. ఏంగెల్స్ వాదనలను ప్రగతిశీల మేధావులు, మానవతావాదులు, ఉహాజనిత సోషలిస్టులు పూర్తిగా తిరస్కరించారు. మానవ జాతి చరిత్రలో కార్మికులకు చరిత్ర సఅష్టించే శక్తి ఉందన్న వాదనను వారు అంగీకరించలేదు. దానికి విరుద్ధంగా శ్రామికుల విప్లవ దఅక్పథం పై, కార్యాచరణపై ఏంగెల్స్ విశ్వాసం వ్యక్తం చేశాడు. వారి హక్కుల కోసం సమ్మెలు, ప్రదర్శనలు, తిరుగుబాట్లు చేసి బూర్జువాలతో పోరాడే క్రమంలో అనేకసార్లు కార్మికులు నికరంగా నిలబడినట్లు ఏంగెల్స్ గుర్తించాడు. కార్మికులు బూర్జువాల యొక్క అధికారాన్ని వ్యతిరేకించి దృఢంగా నిలబడగలరన్న పూర్తి విశ్వాసాన్ని ఏంగెల్స్ వ్యక్తం చేశాడు.

జీవితంలో సైన్స్ పాత్ర, తత్వశాస్త్రం యొక్క చరిత్రతో సైన్స్ కున్న సంబంధాన్నిఏంగెల్స్ అధ్యయనం చేయడం ప్రారంభించాడు. ఫ్రాన్సిస్ బేకన్, థామస్ హాబ్స్, జాన్ లాకే, డిడెరో, హెూల్బ్, హెల్వెటియస్ వంటి ప్రసిద్ధ తత్వవేత్తల రచనలను అధ్యయనం చేశాడు. ఇదే సందర్భంలో గణితశాస్త్రం, ప్రకఅతిశాస్త్రాలను కూడా ఏంగెల్స్ అభ్యసించాడు. ఏంగెల్స్ తన నిర్ధారణలు మరింత ముందుకు తీసుకెళ్తూ " మానవుల అవసరాలు తీర్చటానికి అనుగుణంగా ప్రకఅతి శక్తిని మార్చటంలో శాస్త్ర విజ్ఞానం నిరంతరం దోహదం చేస్తుంది. యాంత్రిక ఉపకరణాలు, వాటికి సంబంధించిన శాస్త్రీయ సూత్రాల ఆవిష్కరణ ఈ పురోగతి యొక్క నిజమైన పర్యవసానాలు. ఇంగ్లాండ్ పారిశ్రామిక వ్యవస్థను విప్లవీకరించటం యావత్ సామాజిక పరిణామంలో కీలక సన్నివేశం అని నిర్ధారిస్తాడు.

మాంచెస్టర్, ఇంగ్లండ్‌లోని ఇతర నగరాల్లో శ్రామికవర్గ ప్రజలు అనుభవిస్తున్న అధ్వాన్న పరిస్థితులను గమనించిన ఏంగెల్స్ రైనిష్ జీటుంగ్ పత్రిక కోసం వ్యాసాలు రాశాడు. కారల్ మార్క్స్ కోరిన మేరకు జర్మన్ - ఫ్రెంచ్ ప్రత్యేక సంచిక కోసం ఒక కథనాన్ని ఏంగెల్స్ రాశాడు. ఏంగెల్స్ రాసిన కథనానికి మార్క్స్ చాలా ప్రాధాన్యత ఇచ్చారు. మార్క్స్ రచనలను ప్రశంసించిన ఏంగెల్స్ గౌరవపూర్వకంగా అతనిని కలవాలనుకున్నాడు. 1844 ఆగస్టు చివరి నాటికి ఏంగెల్స్ పారిస్‌ని సందర్శించి కారల్ మార్క్స్‌ని కలుసుకొని బర్మెన్ తిరిగి వెళ్లాలని నిర్ణయించుకున్నాడు.

# సిరియాను ధ్వంసం చేసిన అమెరికా

**విజయ ప్రసాద్**



రచయిత పాత్రికేయుడు

సిరియా దేశంలోని రక్కా నగరంపై అమెరికా చేసిన యుద్ధనేరాలు ఎంత ఘోరమైనవో, ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ ఓ నివేదికలో వెల్లడించింది. గతంలో సైతం, ఇదే యుద్ధనేరాలు చేసిన చరిత్ర అమెరికా ఉంది. కాబట్టి తదుపరి దర్యాప్తును ఏ విధంగానైనా నాశనం చేస్తుందన్న అంచనాలున్నాయి.

న్యూయార్క్ సిటీలోని యునైటెడ్ నేషన్స్ భవంతి ముందు కార్యకర్త ఒకరు ఓ బోర్డుతో నిలబడ్డాడు. గత కొన్ని దశాబ్దాలుగా అమెరికా ఎక్కడెక్కడ తన దుష్కృత్యాలను కొనసాగించిందో ఆ చిట్టా అది. సుదీర్ఘమైన ఆ జాబితా మొదటగా ఆఫ్ఘనిస్తాన్‌తో ఆరంభమవుతుంది. 17 యేళ్లు కొనసాగిన యుద్ధం వలన ప్రాణాలు కోల్పోయిన సాధారణ ప్రజల సంఖ్య అపరిమితంగా ఉంది. ఆఫ్ఘనిస్తాన్ తర్వాత సిరియా, ఇరాన్ వెనిజులా జాబితాలో ఉన్నాయి. వాటి పక్కన "ఎంత మంది"? అన్న ప్రశ్న యునైటెడ్ స్టేట్స్ తన యుద్ధ నేరాలను కొనసాగిస్తూ ప్రభుత్వాలను కూలదోస్తూనే ఉంటుందా? చిట్టాతో నిలబడ్డ కార్యకర్త ఓ పెద్దమనిషి. సమాజం పట్ల ఆలోచన, యుద్ధం వలన మానవజాతి ఎదుర్కొంటున్న పరిణామాల పట్ల వివేచనతో పాటు, బాధ,ఉన్న వ్యక్తి ఆయన. ఆయన ఉనికి ఆ మార్గాన వెళుతున్న వారి దృష్టిని ఆకర్షించింది. కాని ఐక్యరాజ్యసమితికి మాత్రం ఆ రోజు ఖాళీ లేదు. ఎంతగా అంటే కనీసం ఆ వారం మొత్తం అతన్నీ గమనించేంత సమయం లేనంత. ఆ కార్యకర్త ఎవరిని చైతన్యవంతం చేయటానికి ప్రయత్నం చేస్తున్నాడన్నవిషయాన్ని ఎవ్వరూ పట్టించుకోలేదు.

జాబితాలోని విషయాలను పరిశీలిస్తే వెన్నులో వణుకు పుడుతుంది. నాశనం చేయబడ్డ దేశాల చిట్టా అగ్రభాగాన ఆఫ్ఘనిస్తాన్, తర్వాత ఇరాక్ ఉన్నాయి. 1990 దశకంలో ఇరాక్‌కు వ్యతిరేకంగా అమలు జరిపిన ఆంక్షల వలన ఎంతమంది ప్రజానీకం ఆదేశాలలో మరణించారో లెక్కలేదు. ఒక సంవత్సరం క్రిందట ఈ వ్యాసరచయిత ఇరాక్ ప్రభుత్వం లోని కీలక సభ్యుడు ఒకరిని, "యుద్ధం వలన ఎంతమంది మరణించారో తెలుసా? అని ప్రశ్నించగా, ఆయన మొహంలో ఓ భాదాకర భావన. నాకే కాదు. ఆ మాటకొస్తే ప్రభుత్వం వద్ద కూడా లెక్కలుంటాయని నేననుకోను'.అని జవాబిచ్చారు.

1995వ సంవత్సరంలో "ఫుడ్ అండ్ అగ్రికల్చరల్ ఆర్గనైజేషన్" (ఎఫ్ఎఒ) అందించిన నివేదిక ప్రకారం అమెరికా విధించిన ఆంక్షల వలన, 5,67,000 మంది చిన్నారులు ఆకలితో మరణించారు. అమెరికాలోని టెలివిజన్ న్యూస్ మ్యాగజైన్ వారు నిర్వహించే "60 నిమిషాలు" కార్యక్రమంలో పై నివేదికలో " అర్థ మిలియన్ బాలలు చనిపోయారని మేము విన్నాం. ఈ సంఖ్య హిరోషిమాలో మృతుల సంఖ్య కన్నా ఎక్కువ. ఇదంతా అవసరమా?" అని అమెరికా విదేశాంగశాఖ కార్యదర్శి మెడలిన్ ఆల్ బ్రైట్‌ను జర్నలిసు లెస్లీస్టాల్ ప్రశ్నించింది. దానికామె "ఇది చాలా క్లిష్టమైన ఎంపిక. కానీ మా దృష్టిలో ఇది అవసరమైనదే" అని జవాబిచ్చింది. ఈ నివేదిక ఇరాక్‌పై 2003లో జరిగిన దాడులకు దశాబ్దం ముందే విడుదలయిన విషయం గమనార్హం. మృతుల సంఖ్య చాలా ఎక్కువ. ఈ సంఖ్య. అత్యంత దారుణంగా పెరుగుతున్నది. ఎవ్వరికీ అసలైన సంఖ్య తెలీదు. ఇది కేవలం ఇరాక్ విషయంలో మాత్రమే. ఆఫ్ఘనిస్తాన్ కూడా కలిపి మిగిలిన సంఖ్యను కూడా పెంచితే "అంతర్జాతీయ యుద్ధ భేరీల" వలన మరణించిన వారి సంఖ్య ఎంత దారుణంగా పెరుగుతుందో అర్థమవుతుంది.

ఈ దిశగా యుద్ధం ప్రభావం, దుష్పలితాల పట్ల అమెరికా నిర్వహించిన, నిర్వహిస్తున్న దర్యాప్తుల వివరాలు ప్రపంచం ముందుకు రావడం లేదు. యుద్ధం పట్ల నడుస్తున్న చర్చల గురించి, ముఖ్యంగా ఇరాక్‌పై యుద్ధం తర్వాత ప్రపంచవ్యాప్తంగా యుద్ధ వ్యతిరేకత పట్ల వెలువడుతున్న నిరసనలు, ధిక్కారస్వరాల పట్ల ఎలాంటి ఆలోచనలు చేయడంలేదు. మృతుల సంఖ్య ఏ స్థాయిలో ఉంటుందో, అధికారిక లెక్కలు తెలుపటం లేదు. మరీ ముఖ్యంగా యుద్ధం ఫలితంగా సాధారణ ప్రజానీకం ఎందరు మరణిస్తున్న లెక్కలను వెల్లడించటం లేదు. చెదురుమదురుగా, అక్కడక్కడా "వ్యక్తులు"గా దర్యాప్తు చేస్తున్నారు. కానీ ఆ లెక్కలు సంపూర్ణంగా ఉండడం లేదు. దర్యాప్తుపై ప్రభుత్వం విధిస్తున్న ఆంక్షలు ఇందుకు ప్రధాన కారణం. ఏయే దేశాలలో, ఎంతమంది మరణిస్తున్నారు అన్న లెక్కలు ఎక్కడా సంపూర్ణంగా లభించటం లేదు.

అమెరికా మిలటరీలో జరిగిన తప్పిదాలలో ముఖ్యమైన వాటిపై 439 పేజీల నివేదికను అతి కష్టం మీద "ది న్యూయార్క్ టైమ్స్" సంపాదించింది. తమ విషయాలను బైటకు రాకుండా "ఏడు నేవీసీల్స్" చేసిన రిమార్కులను తొక్కిపట్టింది. అందులో ప్రధానమైనది." తమ ఛీఫ్ స్పెషల్ వెల్ఫేర్ ఆపరేటర్" ఎడ్డీ గల్లాగర్ చేసిన తప్పిదం. 2017వ సంవత్సరంలో చేతిలో ఆయుధం లేని ఓ ఇస్లామిక్ యుద్ధ సైనికుడిని గల్లాగర్ వేట కత్తితో వేటాడి చంపేశాడు. అంతేగాక, ఇరాక్‌లోని సాధారణ ప్రజలను సైతం తన తుపాకి తూటాలకు బలిచేశాడు. అతను చేస్తున్నది తప్పని అభ్యంతరం వెల్లడించిన స్వంత బృంద సభ్యులను సైతం నోరు విప్పితే చంపేస్తానని బెదిరించాడు. 2018 సంవత్సరం సెప్టెంబర్‌లోఅతను అరెస్టుఅవ్వగా, శాండియాగోలోని నేవల్‌బ్రిగ్‌లో అతనిని బంధించారు. నేవల్ మిలటరీ వారి ప్రత్యేక జైలు అయిన నేవల్ బ్రిగ్‌లో అతన్ని బంధించిన సమయంలో, అతని బృంద సభ్యులు,సీల్ టీమ్ 7 ఆల్ఫా ప్లైటూన్ సభ్యులు, తమ ట్రూప్ కమాండర్‌కు గల్లాఘర్ దుష్కృత్యాలను వివరించారు. అయితే "ఈ విషయాల గూర్చి నోరు విప్పడానికి వీల్లేదని" వారికి ఆదేశాలివ్వబడ్డాయి. యుద్ధ సమయంలో అతను చేసిన తప్పిదాలను/ఘోరాలను నిరా

> **“ నిరాయుధులైన సామాన్య ప్రజలను తన స్నైఫర్ రైఫిల్‌తో “ఎడ్డీ” ఎలా తెగమార్చాడో స్పష్టం చేశాయి. అమెరికా వైమానికదళం రక్కా నగరంపై ఎంతగా దాడులకు పాల్పడ్డాయో చూపుతూ మానవ జీవితాలకు నామామాత్రపు విలువ ఇవ్వకుండా వ్యవహరించిన క్రూరదురంతాలను ప్రపంచానికి పరిచయం చేశాయి. ఎడ్డీ గల్లాఘర్ కేవలం ముగ్గురిని మాత్రమే హతమార్చినట్లు చెబుతున్నప్పటికీ వాస్తవానికి 1600 మందికి పైగానే చంపేశాడు.”**

పించే ప్రయత్నం సహచరులే చేసినప్పటికీ, ప్రభుత్వం దాన్ని దాచిపెట్టే ప్రయత్నం చేసింది.

ఇదిలా ఉండగా, ది ఇంటర్నేషనల్ క్రిమినల్ కోర్టు, అమెరికా యుద్ధ నేరాల గూర్చి, ముఖ్యంగా ఆఫ్ఘనిస్తాన్‌లో దశాబ్దం కిందట చేసిన ఘోర దురంతాల గూర్చి దర్యాప్తు ఆరంభించింది. రెండేళ్ల క్రితం, ప్రాథమిక సమాచారాన్ని వెల్లడించింది. యుద్ధనేరాలలో అంతర్గతంగా జరిగిన వాటిని ప్రపంచానికి వెల్లడించింది. ఈ దర్యాప్తు వివరాలు ప్రకటిస్తున్న కారణంగా, అమెరికా జాతీయభద్రతా సలహాదారు జూన్ బోల్టన్, విదేశాంగశాఖ కార్యదర్శి మైక్ పాంపియో, కోర్టును బెదిరిస్తూ ప్రకటనలు చేశారు. సాక్ష్యాలు వెల్లడిస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. అంతేగాక కోర్టు ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేస్తున్న, ఛీఫ్ ప్రాసిక్యూటర్‌కి అమెరికా వీసా తిరస్కరిస్తామని ప్రకటించారు. 2019లో ఛీఫ్ ప్రాసిక్యూటర్ వీసాను తిరస్కరించడం వలన ఐసిసి తమ దర్యాప్తును నిలిపి వేసింది. ఆఫ్ఘనిస్తాన్‌లోని యుద్ధనేరాల పట్ల ఎలాంటి మాటలను, ప్రకటనలను అమెరికా అంగీకరించదు అన్నదానిని ఈ ఘటన రుజువు చేస్తున్నది.

యుద్ధ నేరాలపట్ల దర్యాప్తు, నిలుపుదల చేయడం, విచారణలను కొనసాగించనీయక పోవడం కేవలం అమెరికాలో మాత్రమే కాదు. నాటో (నార్త్ అట్లాంటిక్ ట్రీటీ ఆర్గనైజేషన్) ప్రధాన కేంద్రమైన బ్రస్సెల్స్‌లో కూడా ఇదే పరిస్థితి. 2011లో లిబియాపై యుద్ధం జరిగింది. ఫ్రెంచి, అమెరికా భారీ ఎత్తున ఆయుధాలను మోహరించి ట్రిపోలీపై దాడి చేశాయి. మానవహక్కులను ఎంత నిర్దయగా హరించారో జర్నలిస్టులు ప్రత్యక్షంగా చూశారు. మానవ హక్కుల కార్యకర్తలు. ఆఫ్రికాలోని దేశాల ఒత్తిడి కారణంగా, నాటో దాడులకు కారణాలను యునైటెడ్ నేషన్స్ అడగవలసి వచ్చింది. కానీ, వారి ఒత్తిడిని నాటో తిరస్కరించింది. అంతేగాక, వారి న్యాయ సలహాదారు పీటర్ ఓల్సన్ రాసిన ప్రకారం “నాటో సంఘటనలు” నేరాలు కాదు. కేవలం ఘటనలు మాత్రమే! 2012 ఫిబ్రవరి 15న రాసిన లేఖలో లిబియాపై నాటో దారుణాల పట్ల ఎటువంటి చర్యలు లేవని, అయితే మేము స్పష్టపరిచేఅంశమేమనగా, సామాన్యులపై నాటో కావాలని గురిపెట్టలేదు. లక్ష్య సాధనలో వారు తమ ప్రాణాలను కోల్పోయారు. అంటే లిబియాపై జరిగింది యుద్ధమే కాదు. ఎలాంటి విచారణ చేపట్టవలసిన అవసరం లేదు. “అంటే పశ్చిమ దేశాలలోయుద్ధం నేరంకాదు. అమెరికా చేసే యుద్ధ నేరాలు అత్యంత సహజమైనవి.

**రక్కా::** సిరియాలోని “రక్కాపై అమెరికా చేసిన బాంబుదాడిపై ఏప్రియల్ మాసంలో” ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ అండ్ ఎయిర్ వార్స్ విచారణ నివేదికను విడుదల చేసింది. ఈ నివేదికలోని సాక్ష్యాలు “చరిత్రలోనే గొప్పవిగా చెప్పుకుంటున్న వాయు దాడులు రక్కాను అత్యంత దారుణంగా ఎలా నాశనం చేశాయో నిరూపించాయి. ఎడ్డీ గల్లాఘర్ ఎంత క్రూరంగా ప్రజలను హింసించాడో ప్రస్ఫుటం చేశాయి. నిరాయుధులైన సామాన్య ప్రజలను తన స్నైఫర్ రైఫిల్‌తో “ఎడ్డీ” ఎలా తెగమార్చాడో స్పష్టం చేశాయి. అమెరికా వైమానికదళం రక్కా నగరంపై ఎంతగా దాడులకు పాల్పడ్డాయో చూపుతూ మానవ జీవితాలకు నామామాత్రపు విలువ ఇవ్వకుండా వ్యవహరించిన క్రూరదురంతాలను ప్రపంచానికి పరిచయం చేశాయి. ఎడ్డీ గల్లాఘర్ కేవలం ముగ్గురిని మాత్రమే హతమార్చినట్లు చెబుతున్నప్పటికీ వాస్తవానికి 1600 మందికి పైగానే చంపేశాడు.

అమెరికా సైన్యం మాత్రం తాము కేవలం 30,000 ఆర్టిల్లరీ రౌండ్స్ మాత్రమే కాల్పులు జరిపామని ప్రకటించారు. కానీ “ప్రతి ఆరు నిమిషాలకొక కాల్పు చొప్పున నాలుగు నెలలు నిరాటకంగా కాల్పులు జరిపారని నివేదిక వెల్లడించింది. వియత్నాం యుద్ధం తర్వాత అతిపెద్ద దురాగతం ఇదే. ఆర్టిల్లరీ తుపాకులు చాలా నిర్దాక్షిణ్యమైనవి. అవి కనీసం వంద మీటర్లకుపైగానే అనాయాసంగా ప్రయాణం చేస్తాయి. అంటే ఒక్కసారి ఎక్కుపెడితే, అవి సామాన్యులను సైతం టార్గెట్ చేస్తాయి. నగరంపై జరిపిన దాడులు అని చెప్పినప్పటికీ అవి నిజానికి సామాన్య ప్రజానీకంపై జరిపిన దాడులే! కాబట్టి ఇది కేవలం ఒక యాక్సిడెంట్‌గా ప్రకటించడం తప్పు.

ఆమ్నెస్టీ నివేదిక ప్రకారం, దక్షిణ రక్కాలోని “దరియా”పై మొదటగా కాల్పులు జరిపారు. 2017 జూన్ 10న తొలిసారిగా కాల్పులు జరపగా, ఆనాటి సంఘటనకు ప్రత్యక్షసాక్షి అయిన “ఫాతిమా” సాక్ష్యం ప్రకారం, అమెరికా ఆమె నివసించే ప్రాంతంపై కాల్పులు జరుపగా, ఆమె తల్లి అజేజా, తోబుట్టువులు ముగ్గురితోపాటుగా వారు నివాసముండే వీధిలో మొత్తం 16 మంది మరణించారు. ఫాతిమా కుడికాలు సంపూర్ణంగా పోగా, ఎడమ కాలు తీవ్రంగా గాయపడింది.

అదే సంవత్సరం సెప్టెంబర్ 25న, హరాత్ అల్‌‌- బదు ప్రాంతంలో ప్రజానీకం నివసించే ఐదు అంతస్థుల భవనాన్ని యుద్ధ విమానం ఢీకొట్టింది. ఘటనలో నాలుగు కుటుంబాలు గాయాలతో తప్పించుకున్నాయి. కారణం వారు బేస్‌మెంట్‌లో దాకున్నారు. నివేదిక ప్రకారం 32 మంది సామాన్య ప్రజలు మరణించగా, అందులో 20 మంది బాలలే! ఒక వారం తర్వాత, మరో బిల్డింగ్‌ని మరో యుద్ధ విమానం గుద్దింది. తత్ఫలితంగా మరో 27 మంది మరణించారు. అందులో అధికశాతం బంధువులే! మరణాన్ని త్రుటిలో తప్పించుకున్న “ఆయత్ మొహమ్మద్ జేసెమ్” మాటల్లో “నా కళ్లముందే నా కన్నకొడుకు మంటల్లో కాలిపోయాడు. నా తల్లి, భర్త, నా సోదరి, నా నలుగురు పిల్లలు నా కుటుంబం మొత్తాన్ని చంపేశారు. ఇది ఏ విధంగా న్యాయం సామాన్య ప్రజలను రక్షించాల్సిన బాధ్యత విడిచి భక్షిస్తున్నారు. ఈ నివేదికపై ఇంత వరకు అమెరికా ప్రభుత్వం స్పందించలేదు. అత్యంత పాశవి కంగా ప్రజలను పొట్టన పెట్టుకుంది. మొదట ఐఎస్ తర్వాత అమెరికా రెండూ కలిసి రక్కా నగరాన్ని పొట్టన బెట్టుకున్నారు. సామాన్యులను నిర్దాక్షిణ్యంగా చంపేశారు. తమది కాని తప్పుకు ప్రజానీకం బలమైపోయారు.

గతంలో చేసిన దుర్మార్గాలను, యుద్ధాల వలన ఛిద్రమవుతున్న మానవ జీవితాలను ఏమాత్రం పట్టించుకోకుండా, గుణపాఠాలు నేర్వకుండా మరలా కొత్త యుద్ధాలకు సన్నద్ధమవుతున్నారు. ప్రస్తుతం వారి గురి ఇరాన్ వెనిజులాపై! ఐక్యరాజ్యసమితి ముందు నిలబడ్డ కార్యకర్త చేతిలోని సందేశం, జరగబోతున్న దారుణాలను, బాధ్యతారాహిత్యాన్ని స్పష్టం చేస్తుంది.

**అనువాదం: డాక్టర్ శమంతకమణి**

# అమ్మయ్య

(2వ పేజీ తరువాయి)

అమ్మయ్య ముందుండి అణగారిన ప్రజాజీవనంతో మమేకమై అనేక పోరాటాలను నిర్వహించారు. ఆ గ్రామంలోని క్రైస్తవ బోధకుడు (ఫాస్టరు) కమ్యూనిస్టు యువకుల్లో కుల వ్యతిరేకతను ఆచరణలో పరీ క్షించదలిచాడు. మాలపల్లెలో ఉన్న తన ఇంట్లో భోజనానికి పిలిచాడు. భోజనానికి వెళ్ళొద్దని గ్రామంలోని భూస్వాములు యువకులపై తీవ్రమైన ఒత్తిడి తెచ్చారు. 8మంది యువకులు గ్రామ పెత్తందార్లను వ్యతిరేకించి పల్లెలో క్రైస్తవ బోధకుని ఇంట్లో భోజనం చేసి వచ్చారు. ఈ ఘటన గ్రామ పెత్తందార్లలో ద్వేషం పెంచగా, పల్లెలోని ప్రజల్లో కమ్యూనిస్టు పార్టీ యువకులపై అభిమానాన్ని, విశ్వాసాన్ని పెంచింది.

ఆ రోజుల్లో మార్క్స్, ఎంగెల్స్, లెనిన్, స్టాలి న్ బొమ్మలతో జనతా పేపరు వచ్చేది. ఆపేపరులోని వార్తలను కామ్రేడ్ అమ్మయ్య అందరికీ చదివి వినిపించేవారు. 1944లో జరిగిన విజయవాడ రైతు మహాసభకు గ్రామ రైతు సంఘం ఆధ్వర్యంలో కామ్రేడ్ అమ్మయ్య నాయకత్వాన గ్రామం నుండి పచ్చళ్ళు, విరాళా లు సేకరించారు. కృష్ణాకాలువ వద్దకు నడిచి వెళ్ళి అక్కడి నుండి ముందే మాట్లాడుకున్న పడవల్లో రైతు మహాసభకు ప్రజలు చేరారు. అందులో సగం మంది మహిళలే. పడవలకు కట్టిన ఎర్రజెండాలతో బందరు కాలువ ఎరు పెక్కింది. అత్యంత స్ఫూర్తిదాయకంగా జరిగిన ఆసభలకు వెళ్లిన ప్రతిఒక్కరూ స్ఫూర్తిపొందారు. పాలపర్రులో కామ్రేడ్ అమ్మయ్య నాయకత్వంలో మేడే జరిపారు. నల్ల సాయెబు, ఎర్ర మస్తాన్ బ్యాండ్‌తో కవాతు పెట్టారు. ఊరంతా తిరిగారు. లైబ్రరీ దగ్గర మీటింగ్ పెట్టారు. కామ్రేడ్ అమ్మయ్య మేడే ప్రాధాన్యత గురించి చెప్పారు. ఇద్దరు పోలీసులు వచ్చారు. 144 సెక్షన్ పెట్టాము. మేడే జరిపితే నేరమేనని చెప్పారు. జరిగిన తరువాత ఏమి చేస్తారని కామ్రేడ్ అమ్మ య్య అడిగారు. మమ్మల్ని వ్యతిరేకించి జరిపారని రాస్తామని పోలీసులు చెప్పారు. రాసుకోమని కామ్రేడ్ అమ్మయ్య చెప్పారు. పోలీసులు అది రాసుకుని వెళ్లారు. కొద్ది రోజులు మామూలుగానే జరిగాయి. భూస్వాములు పోలీసులను రెచ్చగొట్టి మేడే జరిపినందుకు అమ్మయ్య సహా మిగిలిన వారందరి మీద కేసులు పెట్టించారు.

ఆ కేసు సాకుగా దళసభ్యులను మట్టు పెట్టాలని కుట్రలు పన్నారు. పసిగట్టిన దళ సభ్యులు రహస్యంగా ఉంటూ కేసు వాయిదాలకు హాజరయ్యేవారు. తరువాత కేసు కొట్టేశారు.



రెండవ ప్రపంచయుద్ధ సమయంలో గ్రామ కమ్యూనిస్టు పార్టీ కామ్రేడ్ అమ్మయ్య నాయ కత్వాన బ్లాక్ మార్కెట్‌కి వ్యతిరేకంగా పోరాడి దొంగ నిల్వలను వెలికి తీశారు. ఎరువులను, బట్టలను, కిరనాయిలను, ఆహారధాన్యాలను, కంట్రోలు ధరలకిప్పించి ప్రజల మన్ననలను పొందారు.

ప్రకాశం ఆర్డినెన్సు తరువాత, పార్టీ కార్య కర్తలపై నిర్బంధం పెరిగింది. గ్రామాలపై పోలీసుదాడులు మొదలయ్యాయి. గ్రామ యువ కులపై కేసులను పెట్టడం ప్రారంభించారు. ఇద్దరు పోలీసులు రైతులవేషంలో ముల్లుకర్రలు పట్టుకొని ఊళ్ళో తిరుగుతూ కామ్రేడ్ గున్నా బత్తుల సూర్యనారాయణను పట్టుకొన్నారు. అదేమని అడిగితే అరెస్టువారెంటు వుందని చూపించారు. ఈ వార్త పల్లెలో ఉన్న కామ్రేడ్ అమ్మయ్యకు తెలిసింది. పరుగున వచ్చిన కామ్రేడ్ అమ్మయ్య మఫ్టీలో వున్న పోలీసులను నెట్టి వారితో కలయబడ్డారు. లాగి ఒకటేశారు. మొద్దుల్లాగా వున్న ఆ ఇద్దరు పోలీసులను పడగొట్టి అమ్మయ్యగారి నాయకత్వంలో యువ కులు కామ్రేడ్ సూర్యనారాయణని విడిపించు కున్నారు. అజ్ఞాతంలో ఉన్న కామ్రేడ్ అమ్మయ్య అవకాశముంటే రాత్రి పూట రహస్యంగా ఇంటికి వచ్చి స్నానపానాదులు చేసేవారు. అలా ఒకసారి ఇంటికి వచ్చారు. భూస్వాములు మోసిన సమాచారంతో పోలీసులు కామ్రేడ్ అమ్మయ్య ఇంటికి వచ్చారు. స్నానానికి వెళ్లడా నికి తుండు చుట్టుకుని బయట అరుగుదగ్గరకు వచ్చిన కామ్రేడ్ అమ్మయ్యను పట్టుకొని మెడలో కండువా వేసి మునసబు గారింటికి తీసుకొచ్చి కట్టిపడేశారు. ఈ వార్త దావాలనంలా చుట్టు పక్క లకు పాకింది. వేలూరు, పాలపర్రు, ఉప్పలపాడుల నుండి పార్టీ కార్యకర్తలు దళాలుగా వేకువఝామునే వచ్చారు. చెరువు కట్టమీద నుండే నినాదాలు యిచ్చుకుంటూ వచ్చి కామ్రేడ్ అమ్మయ్యగారిని విడిపించుకొని పోయారు. భూస్వాములు, వారి అనుచరవర్గం ఎక్కడి వారక్కడ పారిపోయారు. గోరంట్లవారిపాలెం దాడిలో కామ్రేడ్ అమ్మయ్య నాయకత్వాన పాలపర్రు దళ సభ్యులు పాల్గొన్నారు. దానితో ఈ ప్రాంతమంతా పోలీసు నిర్బంధం పెరిగిం ది. దళ సభ్యులు రక్షణ కోసం బంధువులు ఇళ్ళల్లో దూరప్రాంతాల్లో వున్నారు. పోలీసులు బంధువుల ఇళ్ళన్నీ గాలిస్తున్నారు. తమ్ముడి ఆచూకీ చెప్పమని కామ్రేడ్ అమ్మయ్య సోదరి మంగమ్మగారిని చిత్రహింసలు పెట్టారు. పాలపర్రులో పరిస్థితి తెలుసుకొని రమ్మని బంధువుల యువకుడిని కామ్రేడ్ అమ్మయ్య పాలపర్రు పంపించారు. అప్పటికే గ్రామంలోని కమ్యూనిస్టు వ్యతిరేకి సాంబయ్య ఏజెంట్లు కామ్రేడ్ అమ్మయ్య ఇంటి వద్ద కదలికలు గమని స్తూనే వున్నారు. గ్రామంలో వాతావరణం చూసి భయపడి పరుగెత్త ప్రయత్నించిన ఆ యువకుడిని వెంబడించి పట్టుకున్నారు. కామ్రేడ్ అమ్మయ్య ఎక్కడ ఉన్నాడో చెప్పమని లేకపోతే కాల్చి వేస్తామని బెదిరించారు. ఆ కుర్రవాడు బెదిరి పోయి కామ్రేడ్ అమ్మయ్య తెనాలిలో ఉంటున్నా డనీ, ఎవరింట్లో ఉంటున్నాడో తనకు తెలియదనీ, సుందర రామయ్యగారి ఆస్పత్రి దగ్గర ఉన్న కోతుల చెట్టు దగ్గరకు వస్తాడనీ పోలీసులకు చెప్పాడు. మఫ్టీలో వున్న పోలీసు ఆఫీసరు అతనిని వెంటబెట్టుకొని వెళ్ళాడు. అనుకున్న టైముకి అక్కడి కి వచ్చిన కామ్రేడ్ అమ్మయ్యను 1950 మే 2న పోలీసులు అరెస్టు చేశారు. పది రోజులు తీవ్రం గా హింసించి మే 12న ఆ కామ్రేడ్‌ని తెనాలిలో కాల్చివేశారు. రైతాంగ ముద్దుబిడ్డ, పీడిత ప్రజల కోసం అంకితమైన కామ్రేడ్ అమ్మయ్య త్యాగంతో అరుణపతాకం మరింత ఎరుపెక్కింది.

**కామ్రేడ్ తేళ్ళ నారాయణ మరియు కామ్రేడ్ నార్నె నాగయ్య పాలపర్రు వారిచ్చిన సమాచారం ఆధారంగా (గుంటూరుజిల్లా అమరవీపుల గ్రంథం నుంచి)**

RNI Reg. No. APTEL/2006/17554 Posted on 05-06-2019 (36 pages) Postal Regd. No D/VJ/172/2018-20

# ఫాసిజం యొక్క రాజకీయ గుత్తాధిపత్యం బద్దలవుతుంది



**జార్జి డిమిట్రోవ్**

**"ఫా**సిస్టు నియంతృత్వం అస్థిరంగా ఉండటానికి ప్రధానకారణాలేమిటి? పెట్టుబడిదారీ శిబిరంలోని విబేధాలను, శతృత్వాలను అధిగమించటానికి ఫాసిజం ప్రయత్నం చేస్తుంది. కాని ఆ వైరుధ్యాలు మరింత తీవ్రం అవుతాయి. ఇతర రాజకీయ పార్టీలను హింసాత్మకంగా నాశనం చేయటం ద్వారా తన రాజకీయ ఏకచ్ఛత్రాధిపత్యాన్ని నెలకొల్పటానికి ఫాసిజం ప్రయత్నం చేస్తుంది. కాని పెట్టుబడిదారీ విధానం ఉనికిలో ఉండటం, వివిధ వర్గాల మధ్య వైరుధ్యాలు తీవ్రం కావటం అనివార్యంగా ఫాసిస్టు రాజకీయ ఆధిపత్యం బలహీనపడటానికి, అంతం కావటానికి దారితీస్తుంది. ఫాసిస్టు పార్టీ దేశంలో వర్గాలను, వర్గ వైరుధ్యాలను రద్దుచేసే లక్ష్యం పెట్టుకోలేదు. బూర్జువా రాజకీయ పార్టీలు చట్టబద్ధంగా పనిచేయటాన్ని అది నిషేధిస్తుంది. అయినప్పటికీ అవి రహస్యంగా పనిచేస్తూనే ఉంటాయి. కమ్యూనిస్టు పార్టీ రహస్యంగా పనిచేయాల్సిన పరిస్థితుల్లో కూడా అభివృద్ధిని సాధిస్తుంది. ఫాసిస్టు నియంతృత్వానికి వ్యతిరేకంగా శ్రామికవర్గ పోరాటాలకు నాయకత్వం వహిస్తుంది. కాబట్టి వర్గ వైరుధ్యాలతో కూడిన కల్లోల పరిస్థితులలో ఫాసిస్టుల రాజకీయ గుత్తాధిపత్యం అంతం కావటం తథ్యం.

"ఫాసిస్టు నియంతృత్వం అస్థిరంగా ఉండటానికి మరో కారణం అది పెట్టుబడిదారీ విధానానికి వ్యతిరేకంగా తీవ్రంగా ప్రచారం చేస్తూ ఆచరణలో గుత్తపెట్టుబడిదారులను మరింత ధనికులను చేయటం కోసం బందిపోటు దొంగల వలే దోపిడీకి తోడ్పడటంతో ప్రజల ముందు దాని వర్గ స్వభావం బట్టబయలౌతుంది. దాని ప్రజాపునాది కుంచించుకుపోతుంది. ఫాసిజం విజయం సాధించటం ప్రజలలో తీవ్ర వ్యతిరేకతను కలిగించటంతో వారిని విప్లవీకరించటానికి దోహదం చేస్తుంది. ఫాసిజానికి వ్యతిరేకంగా శ్రామికవర్గ ఐక్యసంఘటనను ఏర్పాటు చేయటానికి శక్తివంతమైన ఉత్ప్రేరకంగా పనిచేస్తుంది.

"ఆర్థిక జాతీయవాద విధానాలను అనుసరించటం, జాతీయాదాయంలో ఎక్కువ భాగాన్ని యుద్ధానికి సన్నద్ధం చేయటం కోసం ఉపయోగించటంతో ఫాసిజం దేశ ఆర్థిక జీవనాన్ని కుంగదీస్తుంది. పెట్టుబడిదారీ దేశాల మధ్య ఆర్థిక యుద్ధాన్ని తీవ్రం చేస్తుంది. పెట్టుబడిదారుల మధ్య తలెత్తే శతృత్వాలను ఫాసిజం మరింత తీవ్రం చేస్తుంది. కొన్ని సందర్భాలలో రక్తపాతంతో కూడిన ఘర్షణలు జరగటంతో ప్రజల దృష్టిలో ఫాసిస్టు రాజ్యాధికారం యొక్క స్థిరత్వం క్షీణించిపోతుంటుంది. గత సంవత్సరం జూన్ 30వ తేదీన జరిగినట్లుగా తన అనుచరులనే చంపుకొనే స్వభావం ఉన్న ప్రభుత్వం విస్తారంగా ఉన్న పెటీ బూర్జువా ప్రజానీకంలో ఎక్కువ కాలం తన ఆధిపత్యాన్ని కొనసాగించలేదు.

"బూర్జువా వర్గ శిబిరంలో ఉన్న వైరుధ్యాలు, శతృత్వాలను కార్మికవర్గం ఉపయోగించుకోవాలి. కానీ ఫాసిజం తనంతట తాను కూలిపోతుందనే భ్రమలలో కార్మికవర్గం ఉండరాదు. ఫాసిజం తనంతట తానుగా కూలిపోదు. బూర్జువా శిబిరంలో అనివార్యంగా తలెత్తే వైరుధ్యాలను విప్లవ కార్యాచరణతో కార్మికవర్గం వినియోగించుకోవటం ద్వారా , ఫాసిస్టు నియంతృత్వాన్ని బలహీనపరచటం, దానిని కూలద్రోయటం సాధ్యమౌతుంది. బూర్జువా ప్రజాస్వామ్యం యొక్క అవశేషాలను ధ్వంసం చేయటం, బహిరంగ హింసాకాండను ప్రభుత్వ విధానంగా అమలుచేయటం ద్వారా కార్మికవర్గంలోని ప్రజాస్వామిక భ్రమలను, చట్టం యొక్క ఆధిపత్యాన్ని ఫాసిజం పటాపంచలు చేస్తుంది.

"ఆ విధంగా పెట్టుబడిదారీ విధాన క్షీణత ఫలితంగా తలెత్తిన ఫాసిజం దీర్ఘకాలంలో దానిని మరింత బలహీనపరచటానికి దోహదం చేస్తుంది. మార్క్సిజాన్ని, కార్మికవర్గం యొక్క విప్లవోద్యమాన్ని పాతిపెట్టటానికి పూనుకున్న ఫాసిజం గతితర్కం, వర్గ పోరాటాల వలన పెట్టుబడిదారీ విధానానికి గోరీ కట్టేశక్తులను మరింత బలపరచటానికి దోహదం చేస్తుంది.

***(1935లో జరిగిన కమ్యూనిస్టు ఇంటరేషనల్ 7వ మహాసభలో జార్జి డిమిట్రోవ్ చేసిన ప్రసంగం నుండి ఈ భాగాన్ని పునర్ముద్రిస్తున్నాం)***

Printed and Published by B.V. Raghavulu on behalf of CPIM AP Committee. Printed and Published at Prajasakti Printers & Publishers private Ltd. D .No 14-12-19, Krishna Nagar, Tadepalli (M) Guntur Dt. 9490098977, 9494101091.
Editor : S. Venkatarao, RNI Reg.No. APTEL/2006/17554. Vol.14, No.2. Published on June 1, 2019